# శ్రీ నాన్న ప్రవచనాలు



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

# శ్రీ నాన్న ప్రవచనాలు

సేకరణ

**సాగిరాజు రామచంద్రరాజు**

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265

# శ్రీ నాన్న ప్రవచనాలు

సేకరణ
సాగిరాజు రామచంద్రరాజు

ప్రథమ ముద్రణ - 2001, జూన్


ప్రతులు 2000

© శ్రీ రమణ క్షేత్రం

ప్రతులకు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265, ప.గో. జిల్లా

Laser Typesetting at
RUDRA GRAPHIC DESIGNERS
Ameerpet, Hyderabad - 500 016
Tel. : 374 2023

Printed at
SHARP SCAN PRINTERS LIMITED
Madhapur, Hyderabad.
Tel. : 3114969, 3114970



భగవాన్ శ్రీ రమణ మహర్షి

ఓం శ్రీ గణేశాయ నమః

# ముందుమాట

1980 సంవత్సరంలో సద్గురు శ్రీ నాన్నగార్ని దర్శనం చేసుకొన్నాను. ఆనాటి నుండి నేటివరకు శ్రీ నాన్నగారి దర్శనానికి వెళ్ళుతూనే ఉన్నాను. ఆయన నా యోగక్షేమాలు తెలుసుకోవటమే కాకుండా భక్తి, కర్మ, జ్ఞాన యోగములను సమన్వయము చేసి బోధిస్తూ ఉండేవారు. నాకు భగవదనుభవం పొందాలనే కాంక్ష ఉదయించింది.


సద్గురువు శ్రీ నాన్నగారితో సహవాసం వలన నా జీవితము మలుపు తిరిగింది, శాంతి కలిగింది. సద్గురువు శ్రీ నాన్నగారితో నాకు పరిచయం అయిన రోజులలో ఆంధ్రపత్రిక విలేఖరిగా పనిచేస్తూ ఉండేవాడిని.

శ్రీ నాన్నగారి బోధ వినుటకు నాతోపాటు కొంతమంది భక్తులు వస్తూ ఉండేవారు. ఆ రీతిగా శ్రీరమణ సత్సంగం జిన్నూరులో 1983వ సంవత్సరములో ఏర్పడినది.

భక్తుల కోరిక మీద పశ్చిమగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాలకు వెళ్ళి సద్గురువు శ్రీ నాన్నగారి ప్రవచనాలు చేస్తూ ఉండేవారు. ఈ ప్రవచనాలు మానసిక ఆరోగ్యమును కల్గించి త్యాగబుద్ధిని నేర్పేవిగా ఉండేవి. వినయమును, వివేకమును పెంచుకొనుటకు సహకరించేవి. ఈ ప్రవచనాలను నేను వ్రాసి పత్రికలకు పంపుతూనే ఉండేవాడిని. పత్రికలు యధాతధంగా ప్రచురించేవారు. అవి ఎంతో సరళంగా, స్పష్టంగా, సమగ్రంగా ఉండేవి.

సత్యాన్వేషకులకు ఈ ప్రవచనాలు ఎంతో ఉపయోగపడేవి. ఈ ప్రవచనాలను పత్రికా సంపాదకులు ప్రముఖ స్థానమిచ్చి ప్రచురించేవారు. భక్తుల కోరిక మీద ఈ ప్రవచనాలను పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాము.

..... సాగిరాజు రామచంద్రరాజు



# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | నా జీవితంలో భగవాన్ ఎలా ప్రవేశించారు? | 1 |
| 2. | స్వప్నము వాస్తవమవుతుందా? | 4 |
| 3. | భగవాన్ శ్రీ రమణ మహర్షి | 7 |
| 4. | మరణానుభవము | 11 |
| 5. | జిజ్ఞాసువులకు పితృవాక్యం | 13 |
| 6. | మనోబలమును ప్రసాదించేది మతము | 16 |
| 7. | ఆసక్తి లేనివాడు శాంతిలో ఉంటాడు | 17 |
| 8. | జాతకాల పేరుతో వాస్తవ జీవితానికి దూరం కావటం మంచిది కాదు | 20 |
| 9. | చిత్తశుద్ధి లేనిదే శాంతి లేదు | 23 |
| 10. | మానవుడు మోక్షంలో ఉన్నాడు | 27 |
| 11. | జ్ఞానము యొక్క అవతారమే శ్రీ రమణమహర్షి | 29 |
| 12. | దుఃఖ స్పర్శ నుండి విడుదల పొందుటే మోక్షం | 30 |
| 13. | అందరూ దేహానికి భక్తులే | 32 |
| 14. | అహంభావ నాశనమే-తెలివి యొక్క ప్రయోజనము | 34 |
| 15. | ధర్మాన్ని ఆచరిస్తేనే సత్య సాక్షాత్కారము | 36 |
| 16. | అహంకారమునకు మించిన రాక్షసుడు లేదు | 38 |
| 17. | జ్ఞానమే మోక్షం, అహం వృత్తియే బంధము | 40 |
| 18. | సత్యసాక్షాత్కారమే జీవిత పరమావధి (సత్యవైభవం) | 42 |

| | | |
|---|---|---|
| 19. | ప్రేమలేని బ్రతుకు వ్యర్థం, దుర్భరం | 43 |
| 20. | అమృతానుభవం స్వార్థమునకు అందేది కాదు | 44 |
| 21. | భారతీయ విద్య యొక్క గమ్యము సత్యాన్వేషణ | 45 |
| 22. | సహజంగా జీవించటమే జ్ఞానము | 46 |
| 23. | మృత్యువు యొక్క తలంపు లేనివాడే మహర్షి | 48 |
| 24. | స్వార్థం లేకుండా జీవించటమే తపస్సు | 49 |
| 25. | అజ్ఞానమే అన్ని అనర్థములకు మూలము | 51 |
| 26. | జ్ఞాన ప్రదాత శ్రీ రమణాచార్యుడు | 52 |
| 27. | మనో మూలములోనే దేవుడు ఉన్నాడు | 55 |
| 28. | సత్యమును గ్రహించుటకు గ్రహణశక్తి అవసరము | 56 |
| 29. | అజ్ఞానాన్ని తొలగించుటయే జీవిత గమ్యము | 57 |
| 30. | మతాలు వేరైనా గమ్యం ఒక్కటే | 59 |
| 31. | మానవజాతికి గీతే మాత | 60 |
| 32. | మతిని బాగుచేసేది మతము | 62 |
| 33. | సత్యసాక్షాత్కారమే జీవిత గమ్యం | 64 |
| 34. | రక్షణ ఇచ్చేది రామాయణం | 64 |
| 35. | ఈశ్వర దర్శనమే యోగం | 65 |
| 36. | వ్యాస పూర్ణిమ ఉత్సవం (గురు పౌర్ణమి) | 67 |
| 37. | జ్ఞాన సముపార్జన మాత్రమే ఘనకార్యము | 69 |
| 38. | అజ్ఞానం నశించిన చోట సమత్వం ఉదయిస్తుంది | 70 |
| 39. | అజ్ఞానమే బంధము | 71 |
| 40. | నేటి ప్రపంచముకు కావలసినది జ్ఞానమతము | 72 |

41. జ్ఞానసంపదకు సహృదయులందరూ వాటాదారులే 73
42. మనోజయమునకు గీతలో ఎన్నో సాధనలు చెప్పబడినవి 74
43. కుల, మతముల ఆకర్షణకు లోబడినవాడు సమాజమునకు న్యాయం లేకూర్చలేడు! 76
44. శాంతి కుదిరితే సంఘములో శక్తిని స్థాపించవచ్చును 78
45. సామాజిక స్పృహ వలన బుద్ధికి శుద్ధి కలుగుతుంది 79
46. అందరూ ఆరాధకులే 80
47. మోక్షం హృదయంలో ఉంది 81
48. మన దేశానికి కర్మ నిష్ఠ అవసరము 83
49. గీతను అర్థం చేసుకొని ఆనందమును పొందండి. 84
50. అహంకారం నశిస్తేనే ఆత్మసాక్షాత్కారం సాధ్యం 85
51. మనోనిగ్రహమే అత్యంత ముఖ్యము 87
52. సహజస్థితిని పొందుటకే సాధన 88
53. సుఖము అహంకారమునకు అందేది కాదు 89
54. మూలతలంపు మూలంలోనే ఆత్మదేవుడు ఉన్నాడు 91
55. దేశసమైక్యతకు రామకథ సహకరిస్తుంది 92
56. బ్రహ్మానుభవం వచ్చాక భవసుఖాలు నశిస్తాయి 93
57. జ్ఞాన సముపార్జనలో అతి ప్రధానమైనది గుర్వానుగ్రహము మాత్రమే (గురుపౌర్ణమి) 95
58. జ్ఞానగురువు శ్రీ రమణ మహర్షి 96
59. అందరిలోను సత్యం ఉన్నది 98

| | | |
|---|---|---|
| 60. | శాస్త్రవేత్త అయినా, తత్త్వవేత్త అయినా సమాజమునకు ఉపయోగపడే లాగ ఉండాలి | 99 |
| 61. | గురువు యొక్క కృప | 100 |
| 62. | పరమాత్మ శ్రీ రమణ రూపంలో భూమిమీదకి దిగి వచ్చినది | 101 |
| 63. | జ్ఞానమే సుఖానికి మూలము | 102 |
| 64. | బ్రహ్మానుభవం ఉన్నవాడే గురు శబ్దానికి అర్హుడు | 103 |
| 65. | సత్యమునకు కుల మతములు లేవు | 105 |
| 66. | ఆత్మ లాభానికి గురువు అనుగ్రహం అవసరము | 106 |
| 67. | బుద్ధిని బాగుచేసేది భగవద్గీత | 108 |
| 68. | అరుణాచల దీప దర్శనం పుణ్యప్రదం | 109 |
| 69. | వివేకమును పెంచుకోవటమే వేదసారము | 110 |
| 70. | అవిద్యను తొలగించువాడే గురువు | 111 |
| 71. | సుఖము ఆత్మలో ఉన్నది, లోకంలో లేదు | 112 |
| 72. | ఆత్మజ్ఞానమే మోక్షం | 115 |
| 73. | ధనం ప్రయోజనం పరిమితం | 116 |
| 74. | తన కోరికే తనకు శత్రువు | 117 |
| 75. | HOW I CAME TO BHAGAVAN RAMANA | 119 |

# 1. నా జీవితంలో భగవాన్ ఎలా ప్రవేశించారు?

జూన్ 13, 1984

నాది పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు గ్రామం. నేను వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. నా పూర్వీకులు ఆస్థిక్య బుద్ధి కలవారు. నాకున్న తాత్త్విక చింతన వంశపారంపర్యంగా వచ్చిన వారసత్వపు హక్కు లాంటిది. మా నానమ్మ పాపయ్యమ్మ గారి ప్రభావం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా నా జీవితం మీద ఎంతగానో ఉన్నది. 1954వ సంవత్సరములో మా అమ్మమ్మ గారైన సీతమ్మగారితో కలసి ఉత్తరాది పుణ్యక్షేత్రాలన్నీ దర్శించుకొని వచ్చాను.

అది 1957వ సంవత్సరము. అంతవరకు నా జీవితం సాధారణం గానే గడిచి వెళ్ళిపోవుచున్నది. నా ఆలోచనలో ఉన్న పొరపాట్లను అతిక్రమించటానికి గాని, సత్యాత్మను దర్శించటానికి గాని నేను చెప్పకోదగిన కృషి ఏమీ చేయలేదు. సాంఘిక సేవ పట్ల ఆసక్తిగా ఉండేది. జీవితములో ఒక సోషల్ వర్కర్‌గా మిగిలి పోవాలని ఉండేది. కష్టాలను సుఖాలుగా మార్చుకోవటానికి అలవాటు పడ్డాను. జీవితము పట్ల విరుద్ధమైన వైఖరి లేదు.

ఒకరోజు రాత్రి నాకు స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో చేతిలో కర్ర ఉన్న ఒక ముసలి వ్యక్తి వచ్చి నన్ను మంచం మీద నుండి లేవదీసి గట్టిగా ముద్దు పెట్టుకున్నారు. నేను కంగారుపడ్డాను. ఇలాగ నన్ను మూడుసార్లు కుడిబుగ్గ మీద ముద్దుపెట్టుకొన్నారు. నా జోలికి రావద్దని, నన్ను ముద్దు పెట్టుకోవద్దని, నన్ను విడిచిపెట్టమని ఆయనతో గట్టిగా పోరాడినాను. అయినా ఆ అపరిచిత వ్యక్తి నా మాట వినిపించుకోలేదు. నన్నుకాని, నేను చెపుతున్న మాటలను కాని కొంచెము కూడా పట్టించుకోకుండా ఆయన పని ఆయన ఏకపక్షంగా చేసుకు

పోతున్నారు. ఆయన నా జీవితము మీద దాడి చేస్తున్నట్లు అనిపించినది. నాకెంతో భయం కూడా వేసినది. ఆయన ఒడిలో నుండి జారిపోవటానికి నేను గట్టిగా ప్రయత్నము చేసినాను. నా జోలికి రావద్దని, నన్ను ముద్దు పెట్టుకోవద్దని, నన్ను విడిచి పెట్టమని నా జీవితములో ప్రవేశించవద్దని నేను గట్టిగా మొరపెట్టు కొన్నాను. నన్ను ఆయన బలవంతముగా ఎత్తుకొని ఎంతో ఆప్యాయముగా మూడుసార్లు ముద్దుపెట్టుకొన్న సమయములో నా తలక్రింద ఉన్న తలగడ క్రిందజరి పడిపోయినది. నన్ను ముచ్చటగా మూడుసార్లు ముద్దుపెట్టుకొన్న తరువాత క్రింద పడిపోయిన తలగడ స్వయముగా ఆయన చేతితో తీసి జాగ్రత్తగా మంచము మీద సర్ది నాకు ఇసుమంతయు నొప్పిలేకుండా తిరిగి యధావిధిగా నన్ను మంచం మీద పడుకోబెట్టినారు. నావంక ఎంతో జాలిగా ఒకసారి చూచి ప్రస్తుతానికి సరిపోతుందిలే అని చెప్పి నెమ్మదిగా వెళ్ళిపోయినారు. ఇదంతా ఒక డాక్టరు రోగికి ఆపరేషను చేసినట్లుగా అనిపించినది. ఆయన ఎవరో, ఏమిటో, ఎందుకు నన్ను కావాలని స్వీకరించటానికి వచ్చినారో నాకానాటికి తెలియలేదు. నేను స్వప్నావస్థలో నుండి జాగ్రదావస్థలోనికి వచ్చిన తరువాత కూడా మూడు రోజులపాటు ఆ ముసలాయన నన్ను ముద్దుపెట్టుకొన్న కుడిబుగ్గ మీద చెమ్మగానే ఉన్నది. చెరిపినా చెరగలేదు.

నాకు స్వప్నములో దర్శనమిచ్చి నన్ను లాలించి ఆశీర్వదించిన వ్యక్తి ఎవరో అర్థం కాలేదు, ఆయన రూపము ఎప్పుడూ అంతకు ముందు చూడలేదు. ఆయన పేరు వినలేదు, ఎక్కడా చదవలేదు. ఆయనకు నాకు ఉన్న అనుబంధం నా ఆలోచనకి అందని విషయ మైన స్వప్నం యొక్క ప్రభావం మాత్రం నా జీవితము మీద బలీయముగా పనిచేయటం ప్రారంభించింది. అది ఎన్ని జన్మల

అనుబంధమో మరి! అలా ఆరు మాసములు గడిచిపోయినవి. నాస్వప్నంలో దర్శనమిచ్చిన వ్యక్తిని గురించి ఎవరో తెలుసు కొనుటకు తపిస్తూనే ఉన్నాను. ఒకరోజున మా జిన్నూరు గ్రామ లైబ్రరీలో కూర్చొని "ది హిందూ" అను ఆంగ్ల దినపత్రిక చదువు చున్నాను. అందులో మద్రాసు బుక్ పబ్లిషింగ్ హౌస్‌వారు ప్రచురించిన "గ్రేట్ మెన్ ఆఫ్ ఇండియా" అను అడ్వర్‌టైజుమెంటు చూచినాను. భారతదేశములో జన్మించిన పదిమంది మహాత్ముల గురించి ఆంగ్లభాషలో చిన్న పుస్తకములో ప్రచురించారు. వారు ప్రచురించిన పేర్ల వరుసలో చదువుచున్నాను. అందులో ఏడవపేరు "శ్రీ రమణ మహర్షి". అది చదివేసరికి నా శరీరం జలదరించినది. నన్ను ఎవరో కుదిపినట్లు అనిపించినది. ఆయన పేరు చదవగానే ఆయన నన్ను ఆకర్షించటమే కాకుండా ఆయన గురించి తెలుసుకోవాలనే కాంక్ష బయలుదేరినది. ఈ పేరు చదవగానే నా శరీరమనే గుళ్ళనుండి నన్ను హృదయగుహ లోనికి ప్రవేశించుటకు దారి చూపిస్తాడని అనిపించినది. ఈ వ్యక్తి ఎవరో నా మనస్సును పక్వము చేయుటకు వచ్చినట్లుగా స్ఫురించినది. బుద్ధి విశాలమై నట్లు అనిపించినది. వెంటనే మద్రాసు కంపెనీ వారికి వ్రాసి "శ్రీ రమణ మహర్షి" అను పుస్తకము పోస్టు ద్వారా తెప్పించినాను. ఆ పుస్తకములో ఆయన పటమును కూడా ముద్రించియున్నారు. నాకు ఆరు మాసముల పూర్వము స్వప్నంలో దర్శనమిచ్చి ఆశీర్వదించిన అవతార పురుషుడు ఈ పటములో ఉన్న "శ్రీ రమణ మహర్షి" ల వారు అని తెలిసినది.

నాకు స్వప్నములో దర్శనము ప్రసాదించిన దేవతా పురుషుడు తమిళనాడు రాష్ట్రములో "అరుణాచలము" అను పుణ్యక్షేత్రమందు "శ్రీ రమణాశ్రమం" లో జీవించి "భగవాన్ శ్రీరమణ మహర్షి"గా ప్రపంచ ప్రఖ్యాతి పొంది ఆయన తన 70వ సంవత్సరములో అనగా

ది. 14-4-1950వ సంవత్సరములో మహానిర్వాణము చెందినారు. ఆయనకు వ్యక్తిగతమైన జీవితము లేదు. సత్యాత్మ ప్రకాశమే ఆయన జీవితము. సమత్వమే ఆయన ఊపిరి. ఆత్మ ఒక్కటే సమానమైనది. ఆయన దర్శన మాత్రముచేతనే ప్రపంచములో అనేకమంది జీవితములో కృతార్థులైనారు. భారతదేశపు ఆధ్యాత్మిక ఆకాశానికి సూర్యుడులాంటివాడు. యావత్ మానవజాతికి ఒక వరముగా "శ్రీ రమణస్వామి"ని పరమేశ్వరుడు ప్రసాదించినాడు. ఆయన జీవితమే ఒక సందేశము. శ్రీ రమణస్వామి ఉపదేశములను దేశకాలములు బంధించవు. ఆయన నామస్మరణ పుణ్యప్రదమైనది. మహాత్ములకు మహాత్ముడు. ఆయన అవతారము మానవజాతికే గర్వకారణం. మానవజాతి తపఃఫలితముగానే ఆయన అవతరించినారు. ఆయన సందేశము జాతికి వెలుగు.

నేను 1959వ సంవత్సరము జనవరి నెలలో మొదటిసారిగా తిరువణ్ణామలైలో ఉన్న రమణాశ్రమం దర్శించినాను. ఆనాటి నుండి ఈనాటి వరకు రమణ సందేశమును వ్యాప్తి చేయుటకు నా జీవితము అంతా అంకితము చేసినాను. నేను కావాలని ఆయనను నా జీవితములోనికి తెచ్చుకొనలేదు. నన్ను ఆయన కావాలని తీసుకొని జీవితములో కృతార్థుడిని చేసినారు.

- శ్రీ నాన్నగారు

## 2. స్వప్నము వాస్తవమవుతుందా?

జూన్ 18, 1984

పూర్వము ఒక భక్తుడు పాలకొల్లులో తన ఇంటివద్ద భగవాన్ శ్రీరమణ మహర్షి జయంతి కార్యక్రమము ఏర్పాటు చేసినాడు. అతను మా గృహమునకు వచ్చి నన్ను ఒక వక్తగా రమ్మని ఆహ్వానించినాడు.

జయంతి కార్యక్రమమునకు వెళ్లి ప్రవచనము చేయుటకు నా మనస్సు ఇష్టపడలేదు. నేను రాలేను అని చెప్పితిని. తప్పనిసరిగా జయంతి సభకు రావాలని ఆ భక్తుడు నన్ను బలవంతం చేసినాడు. సభాకార్యక్రమమునకు హాజరగుటకు ఇష్టము లేకపోయినా వస్తానని మాటమాత్రము అన్నాను. కాని వెళ్లకూడదని ఒక నిర్ణయమునకు వచ్చినాను. ఈ సంగతి అంతా భగవాన్ శ్రీరమణ మహర్షి జయంతికి ముందు జరిగినది.

ఆ రోజు రాత్రి నాకు శ్రీ భగవాన్ స్వప్నదర్శనం ప్రసాదించి నీవు పాలకొల్లు సత్సంగమునకు హాజరగుచున్నావా? అని ప్రశ్నించి నారు. భగవాన్‌తో వాస్తవము చెప్పటకు సంకోచించి, సత్సంగమును హాజరై ప్రసంగించి వస్తానని చెప్పితిని. నీవు అబద్ధము చెప్పచున్నా వని ఆయన అన్నారు. ఆ మాటకు నేను కంగారుపడ్డాను. నా మనస్సునకు కలవరము కలిగినది. నా మానసములో ఉన్న విషయము ఆ మహర్షికి తెలిసినందుకు నాలో నాకు ఆశ్చర్యము కల్గినది. నాకు ఇసుమంతయు ఇష్టము లేకపోయినా, జయంతి సభకు హాజరై మాట్లాడి వస్తానని మరొకసారి చెప్పితిని. ఆ ఋషి మాత్రము నాతో ఏమీ మాట్లాడలేదు. మౌనముగా బయటికి వెళ్లి పోయినారు. స్వప్నము ముగిసినది. అదే రోజు రాత్రి కొన్ని గంటలు తరువాత రెండవ స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో శ్రీ భగవాన్ నాకు దగ్గరగా వచ్చి నన్ను ఆహ్వానించిన వ్యక్తి యొక్క గృహామును, ఆ గృహాములో ఉన్న ఒక పెద్ద గదిని చూపించినారు. మరుసటి రోజున జయంతి సభ ఆ పెద్దగదిలో ఉదయం పదిగంటలకు ప్రారంభం అవుతుందని తెలియపర్చారు. నాకు తెలిసిన ఒక ఉన్నత విద్యావంతుడు, సోషల్ వర్కర్ అయిన ఒక పెద్దమనిషిని భగవాన్ నాకు స్వప్నములో చూపించి మరుసటిరోజున జరుగబోయే సభలో ఆయన నీకంటే ముందుగా వచ్చి ముందుగానే

మాట్లాడతారని చెప్పినారు. ఆ పెద్దమనిషి ఆ గదిలో కూర్చొనే చోటు కూడా చూపించినారు. ఆ సభలో ఆయన రెండు నిముషములు మాత్రమే మాట్లాడతారని, తరువాత నీవు మూడు గంటలసేపు ప్రసంగించ వలసి ఉంటుందని అన్నారు. నీకు ఇష్టము ఉన్నా లేకపోయినా నీవు జయంతి సభను జయప్రదము చేయవలసి ఉన్నదని, నీవు అహంకారముతో తీసుకొన్న నిర్ణయము కూలిపోతుందని, అని నాకు గట్టిగా చెప్పి నా వంక ఆప్యాయముగా ఒకసారి చూచి నెమ్మదిగా వెళ్ళిపోయినారు. ఇదంతా నాకు ఒక సలహాగా కాకుండా ఆయన ఆజ్ఞగా అనిపించినది. స్వప్నజగత్తు నుండి జాగ్రదవస్థలోనికి వచ్చినాను.

అది అంతా ఒక స్వప్నము మాత్రమే. శ్రీ భగవానే స్వయముగా వచ్చి నాకు ఆదేశములు జారీ చేసినా నాకు విశ్వాసము కుదరలేదు. స్వప్నమును ఎంత మాత్రము విశ్వసించలేదు. స్వప్నము వాస్తవము ఎలా అవుతుంది? అని అనుకున్నాను. ఇంత జరిగినా భగవాన్ జయంతి సభకు వెళ్ళకూడదని ఒక దృఢ నిశ్చయమునకు వచ్చి ఉదయము తొమ్మిదిగంటలకే భోజనము చేసి కూర్చున్నాను. జయంతి సభకు వెళ్ళమని నాలో ఒక బలీయమైన శక్తి నన్ను ఆజ్ఞాపించుచున్నది. ఆ శక్తి ప్రవాహములో నా నిశ్చయము జారిపోయినది. నా మనస్సు నా స్వాధీనములో లేదు. నా తలంపు సన్నగిల్లినది. ఒక అతీతమైన శక్తి ప్రవాహము నన్ను బలాత్కారముగా పాలకొల్లు జయంతి సభకు తీసుకొని వెళ్ళినది. నన్ను ఒక బొమ్మ రీతిగా ఆ శక్తి సభాస్థలమునకు చేర్చినది. నేను సభలోనికి అడుగు పెట్టగనే శ్రీ భగవాన్ నాకు స్వప్నములో చూపించినవన్నీ అక్కడ జరుగుచున్నవి. అదంతా నాకు అద్భుతముగా, అపూర్వముగా అనిపించినవి. నాకు వచ్చిన పొట్టి స్వప్నము యధాతథముగా అక్కడ పొడుగునా ప్రదర్శిస్తున్నారని

తోచినది. స్వప్నము వాస్తవము అవుతుందని నేను విశ్వసించలేదు. కాని జరిగినది చూచిన తరువాత నాకు వచ్చిన స్వప్నమును నేను నమ్మకుండా ఉండలేక పోయాను. భగవాన్ శ్రీ రమణ మహర్షి ఎంతో సజీవముగా ఉన్నారని అనిపించినది.

- శ్రీ నాన్నగారు

## 3. భగవాన్ శ్రీ రమణ మహర్షి

తమిళనాడు రాష్ట్రంలో మధురై పట్టణమునకు ముప్పది మైళ్ళు దూరములో తిరుచ్చుళి అను శివక్షేత్రంలో సుందరమయ్యర్, అళగమ్మ అను పుణ్య దంపతులకు రెండవ కుమారుడుగా భగవాన్ శ్రీరమణ మహర్షి 1879వ సంవత్సరం డిశంబరు నెల 30వ తేదీన జన్మించినాడు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి తిరుచ్చుళిలో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని మధురైలో తన పినతండ్రి సుబ్బయ్యర్ ఇంటివద్ద ఉండి మధురై మిషన్ హైస్కూలులో చదువుకొనేవాడు. ఆయనకు తన పదహారవ సంవత్సరములో మరణం వచ్చి మీదపడినది. ఈ మరణానుభవం ద్వారా తాను శరీరము కాదని, తాను కేవలము ఆత్మనని అనుభవపూర్వకముగా గ్రహించినాడు. అసలు "నేను" ను గుర్తించి మాయా "నేను" నుండి విడుదలై అమృతస్థితిని పొందినాడు. ఎట్టి సాధనలు తోటి నిమిత్తము లేకుండా పరమేశ్వరుడు ఆయనను ఆత్మ సింహాసనం మీద కూర్చోబెట్టాడు. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో జ్ఞానము పొందిన వ్యక్తి పూర్వపు యుగములలో కూడా కనిపించడు.

ఈ మరణానుభవమునకు పూర్వమే భారతదేశములో ఉన్న

ముఖ్యమైన పుణ్యక్షేత్రములలో ఒకటిగా ఉన్న శివక్షేత్రమైన అరుణాచల పావన నామమును ఆయన ఒక బంధువు ద్వారా విన్నాడు. అరుణాచలంనే తిరువణ్ణామలై అని అంటారు. ఇది మద్రాసు పట్టణమునకు నూట ఇరువది మైళ్ల దూరములో ఉన్నది. ఆ క్షేత్రము పేరు అరుణాచలం, అక్కడ దేవుని పేరు అరుణాచలం, అక్కడ గిరిపేరు అరుణాచలం, అరుణగిరి ప్రదక్షిణము అత్యంత పుణ్యప్రద మైనది. దీనినే కోరికలు నెరవేర్చే కొండ అని కూడా పిలుస్తుంటారు. అద్వైత సిద్ధాంతమునకు అరుణాచల క్షేత్రం అత్యంత సన్నిహితముగా ఉన్నది. స్మరణమాత్రము చేతనే మోక్షమును ప్రసాదించే క్షేత్రం.

శ్రీ రమణ మహర్షి పొందిన ఆత్మానుభవమును, ఆత్మ జ్ఞానమును, ఆత్మ శాంతిని లోకమునకు పంచియిచ్చుటకు 1896వ సంవత్సరం సెప్టెంబరు నెల ఒకటవ తేదీన మధురై పట్టణమునుండి అరుణాచలం చేరుకొని అరుణాచలేశ్వరునకు తనను నివేదించు కొన్నాడు. కౌపీనం ధరించాడు. అరుణాచలం వచ్చిన తొలిరోజులలో తీవ్రమైన తపోనిష్ఠలో ఉన్నారు. ఆయనది సహజసమాధి. ఆ దివ్య మూర్తిని చూసి అనేకమంది ఆకర్షింపబడ్డారు. అట్టివారిలో గొప్ప సంస్కృత పండితుడు, మహాకవి, ఉన్నతమైన ఉపాసనాపరుడు, భారతీయ తత్త్వ శాస్త్రమును మథించిన మహామేధావి అయిన శ్రీ కావ్యకంఠ గణపతి శాస్త్రిగారు ఒకరు.

గణపతి ముని రమణ ఋషిని తపస్సు యొక్క స్వరూపమును గూర్చి ప్రశ్నించారు. "నేను" అను తలంపు ఎక్కడ నుండి ఉద్భవిస్తున్నదో పరిశీలించిన మనస్సు అందులో లీనమగును. అదియే తపస్సు అని శ్రీ రమణ మహర్షి ఉపదేశించెను. ఈ ఉపదేశానుగ్రహమునకు

గణపతి ముని హృదయము ఆనందముతో నిండినది. మోక్షమునకు నూతన మార్గమును సూచించిన ఈ సద్గురువునకు "భగవాన్ శ్రీ రమణ మహర్షి" అని శ్రీ గణపతి శాస్త్రిగారు నామకరణం చేసినారు. ఈ నామమే లోకప్రసిద్ధి పొందినది. శ్రీ రమణ మహర్షి ఆధ్యాత్మిక బోధనల్నిటిని క్రోడీకరించి రమణ గీత అను పేరుతో గణపతి శాస్త్రి గారు ఒక అద్భుతమైన గ్రంథమును రచించారు. ఆ గ్రంథములో హృదయ విద్య యొక్క ప్రత్యేకతను లోకమునకు ఎత్తి చూపించారు.

1922వ సంవత్సరములో శ్రీ రమణ మహర్షి మాతృదేవి అళగమ్మ మహానిర్వాణం అనంతరము అరుణాచలములో శ్రీ రమణాశ్రమము స్థాపించబడినది.

భారతదేశము నలుమూలల నుండి మరియు పాశ్చాత్య దేశముల నుండి అనేకమంది రచయితలు, శాస్త్రవేత్తలు, వక్తలు, రాజకీయ నాయకులు, సంగీత విద్వాంసులు ఆయనను దర్శించారు. శ్రీ బి.వి. నరశింహస్వామి అనే ప్రముఖ అడ్వకేటు భగవాన్ జీవిత విశేషములను సేకరించి ఆంగ్లములో "ఆత్మ దర్శనము" అను పేరుతో ఒక గ్రంథమును రచించెను. పాశ్చాత్య దేశముల నుండి పాల్‌బ్రంటన్ అను గొప్ప పత్రికా రచయిత ఆయనను దర్శించి ఆయన సమక్షములో తాను పొందిన ఆత్మ అనుభూతిని గూర్చి గొప్ప ఆంగ్ల గ్రంథమును రచించి పాశ్చాత్య ప్రపంచమునకు శ్రీ రమణ మహర్షిని పరిచయము చేసినాడు. అనేకమంది ముముక్షువులు ఆయనను దర్శించి ఆయన నుండి కాంతిని, శాంతిని పొందారు. శ్రీ రమణ దర్శనానంతరము మాత్రమే తనకు ఏమీ తెలియదన్న సంగతి తనకు తెలిసినదని ఒక ప్రముఖ పాశ్చాత్య శాస్త్రవేత్త అన్నాడు.


శ్రీ రమణ మహర్షి బోధ సహజమైనది, సరళమైనది, సూటి యైనది. దేవుని పేరుమీద ఆయన ఉపయోగములేని చర్చలకు దిగలేదు. మానవజాతికి జ్ఞానోదయం కలిగించుటకు సహకరించి నాడు. మానవజాతికి ఆత్మజ్ఞానమును గూర్చి ఉపదేశించుటకు ఈశ్వరుని ఆజ్ఞపై ఆ లోకము నుండి ఈ లోకమునకు దిగివచ్చిన అవతార పురుషుడు. భగవద్గీతలో వర్ణించిన స్థితప్రజ్ఞుడు, గుణాతీతుడు ఎలా వుంటాడో మనము భగవాన్ శ్రీరమణ మహర్షిని చూచి తెలుసుకోవచ్చును. ఆయన ఆత్మస్థుడై ఉండి లోకమునకు ఆత్మను తెలుసుకొనే మార్గము సులభం చేసినాడు. సత్యమే ఆయన ఊపిరి. ఆయన సమత్వం లోకమునకు ఆదర్శం. ఆయన అనుగ్రహముతో అనేకమంది అమృతస్వరూపులైనారు. ఆయన ప్రేమమూర్తి. 1950వ సంవత్సరం ఏప్రియల్ నెల 14వ తేదీ శుక్రవారం రోజున ఆయన దేహగతమైన చరిత్ర ముగిసినది.

భగవాన్ శ్రీ రమణ మహర్షి మహాప్రస్థాన సమయములో ఒక కాంతిపుంజము ఆకాశవీధిలో సంచారము చేసినది. ఆత్మ తత్త్వము రమణ తత్త్వము. రమణ జ్యోతి వెలుగుతూనే ఉన్నది. ఆయన బోధామృతం చిరకాలం, కలకాలం స్మరించదగినది.

అన్ని జీవుల హృదయ గుహలో ఎరుకయై ప్రకాశిస్తున్న పరమాత్మయే అరుణాచల రమణుడని ఆయన ఒక సందర్భములో చెప్పినాడు. రక్తమాంసములతో ఉన్న దేవుణ్ని చూడాలని అనుకొంటే భగవాన్ శ్రీ రమణ మహర్షిని చూడవచ్చునని మాజీ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు.

- శ్రీ నాన్నగారు

# 4. మరణానుభవము



తమిళనాడు రాష్ట్రములో మధురై పట్టణమునకు 30 మైళ్ళ దూరములో ఉన్న తిరుచ్చుళి అను పుణ్యక్షేత్రములో 1879 డిశంబరు 30వ తేదీన శ్రీ రమణమహర్షి అవతరించెను. మధురైలో తన పినతండ్రి సుబ్బయ్యర్ ఇంటి వద్ద ఉండి, మిషన్ హైస్కూలులో చదువుకొనేవాడు.

శ్రీ రమణ స్వామికి తన పదునారవ ప్రాయములో అనగా 1896 జూలై 16వ తేదీన తాను ఒంటరిగ ఉన్న సమయంలో పరిపూర్ణమైన ఆరోగ్యముతో ఉండగా, మనస్సులో ఏ విధమైన ఆవేదన గాని, ఆందోళన గాని లేకుండానే ప్రశాంతముగా ఉన్న సమయములో మరణము వచ్చి ఆయన మీద పడినది. శరీరములో శ్వాస నిలిచిపోయినది. రక్తప్రసరణ ఆగిపోయినది. కాళ్లు, చేతులు కట్టెలులాగ కొయ్యబారిపోయినవి. పెదవులు బిగిసికిపోయినవి. కన్నులు మూతపడినవి.

శరీరము శవముగా మారినప్పటికీ ఆయనకు భయము గానీ, ఆందోళన గానీ కలుగలేదు. పెద్దలకు చెప్పాలని గాని, డాక్టరు దగ్గరకు వెళ్ళాలని కాని ఆయనకు అనిపించలేదు. ఈ మరణ సమస్యను తనంతట తానే పరిష్కరించుకోవాలని అనుకొన్నారు.

దేహముశవముగా మారినప్పటికి దేహముతో ఇసుమంతయు సంబంధములేని సద్వస్తువు ఆయనకు స్ఫురించినది. దేహముతో సంబంధము తెగిపోయినప్పటికి ఆయన అస్థిత్వమునకు అణు

మాత్రము కూడా లోటు కనిపించలేదు. ఆత్మ స్ఫురణ స్పష్టముగా ఉన్నది. దేహమును బూడిద చేసినప్పటికి తాను దేహము కాదు కాబట్టి తనకు నాశనము లేదని తెలుసుకున్నాడు. దేహమునకు తాను ఉన్నానే సంగతి తెలియదు. అందుచేత దేహము జడము, జ్ఞానము లేనిది. ఇది ఆయన ఊహకు సంబంధించిన విషయము కాదు, ఆయన ప్రత్యక్ష అనుభవము.

ఆత్మ అంటే ఏమిటో, పరబ్రహ్మ అంటే ఏమిటో, వేదములలో చెప్పబడిన సద్వస్తువు అంటే ఏమిటో ఆయనకు తెలియదు - తెలుసుకోవాలనే కాంక్ష కూడా లేదు. మరణించే ఈ దేహానికి అతీతమైన అమృత వస్తువు ఒకటి ఉన్నదని కూడా ఆయనకు తెలియని రోజులలోనే ఈ మరణానుభవము కలిగినది.

ఈ మరణానుభవము వలన శ్రీ రమణస్వామికి అంతర్ముఖ దృష్టి లభించినది. అంతర్ముఖ దృష్టి కలిగినవాడికి ఆత్మ దర్శనం అవుతుంది. ఆత్మ దర్శనమైనవాడు ఈ సృష్టి జాలము నుండి బయటపడతాడు.

ఇరువది నిముషముల తర్వాత శ్రీ రమణస్వామికి తిరిగి శ్వాస కలిగినది. రక్తప్రసరణ ప్రారంభమైనది. ఆయన ద్వారా లోకమునకు జ్ఞానశాస్త్రమును బోధించుటకు పరమేశ్వరుడు ఆయన శరీరములో ప్రాణము పోసి, తన స్వాధీనము చేసుకొన్నాడు. గురువు సహాయము లేకుండా, శాస్త్రాన్ని శ్రవణము చేయకుండా, సాధనతో నిమిత్తము లేకుండా, అసలు సత్యాత్మ అనేది ఒకటి ఉన్నదని కూడా తెలియ కుండా ఆత్మానుభూతిని పొందినవారు మన ఆధ్యాత్మిక చరిత్రలో మరొకరు లేరు.

శ్రీ రమణ స్వామి కారణజన్ముడు కాబట్టి పరమేశ్వరుడే స్వయముగా మృత్యువు దూత రూపంలో వచ్చి ఆయన్ని జ్ఞాన సింహాసనము మీద అధిష్ఠింప చేసాడు.

అమ్మ మీనాక్షి క్షేత్రమైన మధురై పట్టణము నుండి 1896, ఆగష్టు 29 వ తేదీన బయలుదేరి అయ్య క్షేత్రమైన అరుణాచలము నకు సెప్టెంబరు 1వ తేదీన చేరుకున్నాడు.

- శ్రీ నాన్నగారు

## 5. జిజ్ఞాసువులకు పితృవాక్యం

సెప్టెంబరు 23, 1993

మానవ విలువలు అంతరిస్తున్న ఈ కాలంలో జాతిని జాగృతం చేయటానికి సద్గురు శ్రీ నాన్నగారు జ్ఞాన నిధిగా శాంతిని ప్రజలకు అందించాలనే మహత్తర ఆశయంతో మన మధ్య నిలిచారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో సంచరిస్తూ తన ఆధ్యాత్మిక ప్రబోధాలతో చైతన్యవరునస్తూ మానవ విలువలు తెలునుకొనే మార్గాన్ని సూచించుకున్నారు.

తన బోధలలో ఏదో ఒక దేవునిని నమ్ముకోమని గాని, లేక తనని దైవాంశసంభూతునిగా కొలవమని గాని, మూఢభక్తి తత్త్వంతో మునిగిపొమ్మని గాని చెప్పకపోవడం సద్గురు శ్రీ నాన్నగారి ప్రత్యేకత. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలనీ, తనలో దాగిఉన్న శక్తిని తెలుసుకోమని వివరిస్తూ ఉంటారు శ్రీ నాన్నగారు. మీకు సుఖం, శాంతి, ఆనందం లేనప్పడు మీరు ఏ దేవుని భక్తులయితే నాకు లాభమేముంది అంటారు శ్రీ నాన్నగారు.

నేను బోధిస్తున్నప్పడు నా హృదయంలో శాంతి, పవిత్రత ఉంటేనే నా మాటలు మిమ్మల్ని వెన్నంటి తరుముతాయి, మీమీద పనిచేస్తాయి. నేను స్మరించినంత మాత్రాన మీ హృదయాలలో శాంతి కలుగకపోతే నాలో పవిత్రత లేనట్లే అని శ్రీ నాన్నగారు తన సందేశంలో బోధిస్తూ

ఉంటారు. ఆత్మ చైతన్యవంతమైనది. ఆత్మకు శరీరం అక్కరలేదు. అహంకారానికి శరీరం కావాలి, జీవితాంతం ఎవరైతే ఆదర్శంగా, వినయంగా జీవిస్తారో వారే ఆత్మ దర్శనానికి అర్హులు అని అంటారు శ్రీ నాన్నగారు.

భగవద్గీత కూడా వేదమే. అది సాక్షాత్తు భగవంతుడి నోటి నుండి వచ్చిన మాటలే. భగవంతుడిని గురించి చెప్పగల సమర్థత మనలో ఎవరికి ఉంది? ఆయన గురించి ఆయనే చెప్పకపోతే మనకు అర్థం కాదు కాబట్టి మన మీద ప్రేమతో భగవంతుడు తన గురించి తానే చెప్పకున్నాడు. ఎందుచేతనంటే ఆయన ఔన్నత్యం తెలిస్తేనే గాని మనకు ఆయన మీద ప్రేమ, గౌరవము కలుగదు. ప్రేమలేని హృదయాలు దేవుడు లేని ఆలయాలు అంటారు శ్రీ నాన్నగారు.

మోక్షం కైలాసంలోనో, వైకుంఠంలోనో దొరుకుతుందని చాలా మంది భ్రాంతి పడుతుంటారు. కాని మీరు పొందాలనుకొంటున్నది మీర్తై ఉన్నా అది ఇప్పడే, ఇక్కడే మీలోనే ఉందని మీరెప్పడు తెలుసుకొంటారు? ఈ జన్మలోనా! మరో జన్మలోనా! అని తన ప్రవచనాలలో శ్రీ నాన్నగారు ప్రశ్నిస్తూ ఉంటారు.

శ్రీ నాన్నగారు తెల్లని వస్త్రాలు ధరిస్తున్న గృహస్తాశ్రమ ధర్మంలో పయనిస్తున్న ప్రేమ స్వరూపుడు, శాంతి నిలయ స్వరూపుడు, నిగర్వి నిరాడంబరమే ఆయనకు గల ఆభరణాలు.

ఇతరుల నుండి ఆయన కోరుకొనేది సుఖశాంతులు మాత్రమే ఆయన వద్ద ఏ ట్రస్టు లేదు, ఆయన పేరిట ఏ సంస్థలు లేవు, ఆయన వద్ద గల ట్రస్టు జ్ఞాననిధి మాత్రమే. పలు రాష్ట్రాల నుండి, విదేశాల నుండి ఆయనను దర్శించటానికి, ప్రబోధాలు వినటానికి వేలాది సంఖ్యలో వస్తున్నారంటే ఆయనలో నిగూఢంగా దాగిఉన్న అంతర్వాణి

దివ్యానుభూతులను కల్గించి శాంతితీరాలకు మనస్సును లగ్నం చేయడం శ్రీ నాన్నగారి సన్నిధిలో జరిగే గొప్ప విషయం, ఇది మహర్షులకు, మహాత్ములకు, జ్ఞానులకు మాత్రమే సాధ్యం అని చెప్పవచ్చు.

శ్రీ నాన్నగారి ఉపన్యాసం కోసం భక్తులు పరితపిస్తూ ఉంటారు. ఉపన్యాసం జరిగిన ఆరోజు ఒక పండుగ చేసుకున్నట్లుగా ఉంటుంది. ఆదిశంకరాచార్యులు, శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, భగవాన్ శ్రీరమణ మహర్షి దివ్యవాక్కులు తిరిగి వింటున్నట్లుగా, బుద్ధదేవుని శాంతి స్వరూపం గోచరిస్తున్నట్లుగా శ్రీ నాన్నగారు వేదాంత సారాన్ని తన ప్రవచనాలలో వివరిస్తున్నప్పుడు ఆయనలో భక్తులు దర్శించటం జరుగుతుంది. అది వారికి దివ్యానుభూతి.

నేడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన సద్గురు శ్రీ నాన్నగారు లోకం కొరకు, శాంతిని వెదజల్లటం కొరకు తన జీవితాన్ని, కాలాన్ని తన మేధస్సును అంకితం చేయటం ఆయన త్యాగమయ జీవితానికి నిదర్శనం.

శ్రీ నాన్నగారి అసలు పేరు శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీ నర్శింహరాజు. కాని లోకం వారిని ప్రేమతో ఆయనను శ్రీ నాన్నగారిగా పిలుచుకొంటారు. తాను ఆచరిస్తూ ఇతరులను ఆచరించమనే ఆధ్యాత్మిక ప్రేమమూర్తి శ్రీ నాన్నగారు.

మానవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్లడానికే ఏ అవతార పురుషుడు ఉద్భవించినా, ఏ జ్ఞాని చెప్పినా, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని శ్రీ నాన్నగారు తన ప్రవచనాలలో బోధిస్తూ ఉంటారు.

ఎస్. రాంచంద్రరాజు

# 6. మనోబలమును ప్రసాదించేది మతము

పాలకొల్లు, డిశంబరు 15, 1985

హిందూ మతమునకు మరొకపేరు సనాతన ధర్మము. దీనిని ఒక వ్యక్తి స్థాపించలేదు. సృష్టి ప్రారంభం నుండి హిందూమతము ఉన్నది. ఈ మతమునకు మూలము వేదములు. మానవజాతిని అజ్ఞానము నుండి బయటకి తీసుకొని వచ్చుటకు ఈ మతము కృషి చేస్తూనే యున్నది. ప్రపంచములోని అన్ని దేశములకు తన విజ్ఞానమును పంచిపెట్టినది. సత్యమును సాక్షాత్కరించుకొనుటకు తగిన ప్రణాళిక ఈ మతములో నిక్షిప్తమై యున్నది. ఈ మతమునకు ఏ మతముతోనూ పేచీ లేదు. అన్ని మతముల సారమును తనలో కలుపుకొంటూ వస్తున్న జీవనదిలాంటిది.

హిందూమతములో ఆవిర్భవించిన మహాత్ములు, మహర్షులు, ప్రవక్తలు, భక్తులు, గాయకులు హిందూదేశము యొక్క సమగ్రత కోసం, సమైక్యత కోసం పనిచేశారు. హిందూదేశములో ఐకమత్యము, సమిష్టి కృషి లోపించుట వలన కొన్ని శతాబ్దములు హిందూ జాతి బానిసత్వములో మ్రగ్గినది. హిందువులలో ఉన్న అనైక్యతే హిందూదేశము యొక్క బలహీనత. హిందూదేశము యొక్క ఐక్యత కాపాడుటకు దూరదృష్టి గల నాయకత్వము అవసరము. దేశములో అనేక భాషలు, సంస్కృతులు, కులములు, మతములు, ఆచారములు, సాంప్రదాయములు ఉండుట వలన వాటిని సమన్వయపరచి జాతిని ముందుకు నడిపించగల నాయకులు అవసరము.

ఆదిలో అస్పృశ్యత లేదు. అది మధ్య యుగములలో వచ్చిన పరిణామము. దానిని సమూలంగా నిర్మూలిస్తేనే గాని భారత దేశమునకు ప్రగతి లేదు.

దేశములో విద్యారంగము పని సంస్కృతిని ప్రోత్సహించాలి. విద్యావిధానము దేశము యొక్క సమైక్యతను, దేశభక్తిని, దైవభక్తిని, సంస్కృతిని సమకూర్చేదిగా ఉండాలి. విద్య సహేతుకమును పెంపొందించాలి. విద్య జీవనోపాధికి మాత్రమే పరిమితమై ఉండ కూడదు. మనోవికాసమును కల్గించాలి. విద్య సంపూర్ణ మానవుడిగా తయారుచేయగలగాలి. విద్య అహేతుకమైన దానిని తొలగించాలి. స్వయంకృషిని ప్రోత్సహించాలి. విద్య అజ్ఞానము నుండి, దారిద్ర్యము నుండి భారతదేశమును విడిపించుటకు సహకరించేదిగా ఉండాలి. సమగ్రమైన విద్యావిధానము ద్వారానే దేశము ఉజ్వలమైన భవిష్యత్తు లోనికి ప్రవేశిస్తుంది.

దేశమునకు సంపద ఎంత ముఖ్యమో, శీలము కూడా అంతే ముఖ్యము. మతము శీలమును ప్రసాదించుటయే గాకుండా జీవితములో ఎదురయ్యే కష్టసుఖములను ఎదుర్కొనుటకు తగిన మనోబలమును ప్రసాదించాలి. మానవుడి యొక్క మతిని సంస్కరించేది మతము.

## 7. ఆసక్తి లేనివాడు శాంతిలో ఉంటాడు

గుమ్ములూరు, ఫిబ్రవరి 20, 1983

భగవంతుడిని నిరంతరము స్మరించుట వలన వాసనాయుత మనస్సు నశిస్తుంది. పరిశుద్ధమైన మనస్సు జ్ఞానోదయమునకు సహకరిస్తుంది. మనోనిగ్రహము స్వర్గములో ప్రవేశించుటకు ద్వారము వంటిది. మనోనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము లోపిస్తే నరకయాతనలు తప్పవు.

ఆత్మనిష్ట లేకుండా ఆత్మజ్ఞానము కలుగదు. ఎవరి మానసము ఆత్మానందము నందు తృప్తిగా రమిస్తున్నదో వారి జ్ఞానము స్థిరముగా ఉంటుంది. జ్ఞానము ప్రేమిస్తుంది. కామము వాంచిస్తుంది.

దుఃఖమును ఎవడైతే సహిస్తున్నాడో వాడికి పాపము ఖర్చు అవుతుంది. పుణ్యము సుఖరూపములో ఖర్చు అవుతుంది. దుఃఖము, సంతోషము ఈ రెండు తలంపుల రూపంలో ఉంటాయి. తలంపు లకు మూలము అహంభావము. అహంభావము అంతర్ధానమైతే ఆత్మజ్ఞానము కల్గుతుంది.

మౌనంగా ఉన్నప్పడే ఆత్మబలం చేకూరుతుంది. మంచి తలంపులు వస్తాయి. మనస్సులో ఏమి జరుగుచున్నదో మౌనంలో తెలుస్తూ ఉంటుంది. రాగము, భయము, క్రోధము జయించినవాడు లోకాన్ని జయించగలడు. అతని జ్ఞానం స్థిరంగా ఉంటుంది. రాగం, క్రోధం, భయం త్యజించినవాడే జ్ఞానియగును.

ఏదైతే నమనలో నేనుగా వ్యక్తం అవుతున్నదో అదే అహం భావన. దానిని తొలగించుకొన్నవాడికి స్వరూప జ్ఞానం కల్గుతుంది. ఆసక్తి లేకుండా జీవించువాడికి శాంతి కల్గుతుంది.

దేహము తిరుగాడుతున్నప్పడే దేహభావనను త్యజించాలి. శుభమును ఎవడైతే కోరుకొంటాడో వాడికి అశుభం వెంటాడుతూ ఉంటుంది. పుట్టుకకి మరణమునకు ఎంతో దూరము లేదు.

మోక్ష సముపార్జనకు శీలముతోపాటు భక్తి కూడా ఉండాలి. ప్రాపంచిక ప్రతిష్ట పందిపెంటతో సమానము. మనస్సు ఇంద్రియ విషయములకు లోబడినప్పడు అది కలుషితమవుతుంది. ఇంద్రియ విషయముల నుండి మనస్సును ఉపసంహరించిన యెడల దానికి

అందరదృష్టి కలుగుతుంది. అంతరదృష్టి లేనివాడికి ఆత్మసుఖము తెలియదు.

జ్ఞానికి విషయాలు అందుబాటులో ఉన్నప్పటికి వాటి వలన వికారము పొందడు. ఇంద్రియ నిగ్రహము జ్ఞానికి సహజగుణము. ఎవడైతే మోక్షము కొరకు సాధన చేస్తున్నాడో, ఎవడైతే ఆత్మను తెలుసుకోవడం కోసం తన తెలివిని సద్వినియోగం చేసుకొంటున్నాడో వాడే నిజమైన సాధకుడు.

రమణస్వామి ఆత్మజ్ఞాని కాబట్టే ఈనాడు ఆయనను మనం గౌరవిస్తున్నాము. భగవాన్ శ్రీ రమణ మహర్షి దేహము, ఇంద్రియాలు ఉన్నాయనే సంగతి తెలియని అతీంద్రియుడు. ఆయన మిత సత్య భాషణ కలవాడు. భగవాన్ ఈ లోకం కోసం అవతరించిన కారణజన్ముడు. కేవలం ఒక జాతికి, మతానికి సంబంధించినవాడు కాదు. భగవంతుడికి మతం లేదు. ఆయన సందేశం మానవజాతికి గర్వకారణం. ఆయన ఉపదేశం దేశ, కాలములకు అతీతమైనది. భగవంతుడు రమణస్వామిని మానవ జాతికి బహుమతిగా ప్రసాదించాడు. ఆయన సందేశము ఆకాశగంగ లాంటిది.

ధనం వల్ల గర్వము వస్తే దానికంటే దారిద్ర్యము అనుభవించుట మంచిది. ఏదైనా కోరిక కోసం భగవంతుణ్ణి ప్రేమిస్తే ఆయన అనుగ్రహం కోరికకే పరిమితం అవుతుంది. ఈశ్వరుని అనుగ్రహం కోసమే మనం పరితపించాలి. ఆయన అనుగ్రహం సంపాదించుటకే పనిచేయాలి.

పరమ పవిత్రుడికి మాత్రమే జ్ఞానము కల్గుతుంది. ఆత్మ పదవి కోసమే ప్రయత్నం చేయాలి. నిద్రకి, మరణానికి దగ్గర సంబంధం ఉంది. మృత్యువు సమీపించినప్పుడు దానిని ఆనందముగా స్వీకరించడమే కాకుండా బంధువువలే గౌరవించాలి.

ఆత్మవిశ్వాసము వలన అన్ని సాధించవచ్చును. దేవుడు మనలో నిజమైన ఆత్మగా ఉన్నాడు. విశ్వాసం ఉంటే అసంభవాలు సంభవాలు అవుతాయి.

మనోనిగ్రహం ఉన్నవాడు ఎక్కడ నివసించినా శాంతిగానే ఉంటాడు. మనశ్శాంతి ఉన్నవాడికి దుఃఖం నశిస్తుంది. జ్ఞాని శక్తి లేకుండా ఉండడు. అజ్ఞాని "నేను" గా జీవిస్తాడు. జ్ఞాని "తాను"గా జీవిస్తాడు. నిరంతరము జ్ఞానికి ఆత్మ అనుభవంలో ఉంటుంది.

గ్రంధపఠనం వలన పాండిత్యము వస్తుంది. మనస్సును శోధించుట వలన అది అణుగుతుంది. అణిగిన మనస్సుకి లోచూపు కల్గుతుంది. లోచూపు వలన ఆత్మజ్ఞానము కల్గుతుంది. ఆత్మజ్ఞానము సత్యజ్ఞానము.

జ్ఞానము ముందు అజ్ఞానము నిలబడదు. వెలుగు ముందు చీకటి నిలబడదు. కోరిక లేని కర్మ మనో వికాసము కల్గిస్తుంది. ప్రకృతిని అతిక్రమించలేకపోతే జ్ఞాని కాలేడు. అహంభావన లేకుండా ఎవడు జీవిస్తున్నాడో వాడు శాంతిని పొందుతాడు, అదే తపస్సు. శాశ్వత శాంతే మోక్షం. ఆత్మ సాక్షాత్కారం కలిగినవాడికి మోహము కలుగదు.

## 8. జాతకాల పేరుతో వాస్తవ జీవితానికి దూరం కావటం మంచిది కాదు

చించినాడ, ఫిబ్రవరి 1, 1984

అదృష్టం అరచేతిలో లేదు, మానవుడు చేసే కృషిలోనే అదృష్టం ఉన్నది. జాతకాల పేరుతో వాస్తవ జీవితానికి దూరం కావటం మంచిది కాదు.

ఉన్న సత్యం ఆత్మ ఒక్కటే. ప్రపంచాన్ని కూడా ఆత్మగానే దర్శించాలి. ఆత్మను తెలుసుకొనుటయే మానవుని ప్రధమ కర్తవ్యం, ప్రధాన కర్తవ్యం.

విద్యలలోనికి ఆత్మ విద్య రాజు. ఈ విద్యను అనుభవం లోనికి తెచ్చుకోవటం వలన మానవుడు తానుగా జీవించటానికి శక్తిని ప్రసాదిస్తుంది. భగవంతుడు మానవున్ని స్మరించకుండా మానవుడు భగవంతుడిని స్మరించలేడు. భగవంతుని పిలుపు ఎప్పుడు వస్తుందో మానవుడికి తెలియదు. ఏ రోజుకారోజు ఆయన పిలుపు సిద్ధంగా ఉండాలి. భగవంతుని పిలుపు వస్తే మనము శలవు పెట్టుటకు సిద్ధంగా ఉండాలి. భగవంతుని పిలుపు వస్తే మనము శెలవు పెట్టుటకు అవకాశము లేదు. అందుకే సాధన చేసి సిద్ధి పొందాలి. చావు అనేది చాలా స్వల్పం, అల్పమైన విషయం, అది ఒక తలంపు మాత్రమే. మనకు ఉన్న అజ్ఞానమే మనలను దుఃఖానికి గురి చేస్తున్నది.

మానవుడు రాగ, ద్వేషాలతో జీవిస్తున్నాడు, అందుకే స్వతంత్రుడుగా, సుఖిగా ఉండలేకపోతున్నాడు. మానవునిలోని అన్ని బలహీనతలకు, లోపములకు, పాపములకు, కోపములకు, తాపములకు భయం కారణం. భయమే మనిషిని బానిసగా మార్చి వేస్తున్నది.

భగవంతుడు భక్తుడి యొక్క సహనమును పరీక్షించుటకే కష్టాలను గురిచేయవచ్చును. కష్టం అనుభవిస్తున్నప్పుడు దానికి సంబంధించిన స్పృహ లేకుండా లేనివాడే యధార్థమైన భక్తుడు. అరమరికలు లేకుండా భగవంతునకు శరణాగతి పొందినవాడు ఈ భూమి మీద స్వర్గరాజ్యాన్ని ఆవిష్కరింపజేస్తాడు. జ్ఞానాన్వేషనుడికి ఇంద్రియ నిగ్రహం పునాది లాంటిది.

మానవుని వివేకమును, సహనమును జీవితయాత్రలో చివరి రోజు వరకు విడిచి పెట్టకూడదు. తోటి మానవులలో స్వల్పమైన లోపాలు ఉన్నంత మాత్రంచేత భక్తుడు తనని అగౌరవముగా చూడడు.

గుడిలో ఉన్న విగ్రహము మనకు నిగ్రహాన్ని నేర్పితే విగ్రహారాధన మంచిదే! దేవుడిని దేవాలయానికి పరిమితం చేయకూడదు. విశ్వమంతా దర్శించాలి, విశ్వరూపంలో ఉన్నది కూడా దేవుడే. భగవంతుడు అందరి హృదయలలోను ప్రత్యక్షంగా ప్రకాశిస్తున్నాడు. ఈ నగ్నసత్యాన్ని దర్శించినవాడే జ్ఞాని. జ్ఞానికి భగవంతుడు లేనిచోటు కనపడదు. మానవుడు కుయుక్తులకు, కుతంత్రములకు, కుచేష్టలకు దూరముగా ఉండి పరమపవిత్రుడుగా జీవించుట నేర్చుకొంటే భగవంతుడు తనంతట తానుగా దర్శనమిస్తాడు. జీవితము నుండి సాధన వేరు చేయకూడదు. ఏ పని చేసినా అహంకారమును కేంద్రముగా పెట్టుకొని చేయకూడదు. అన్ని అవస్థలకు అహంకారమే కారణం.

సత్యాన్వేషకుడు తన దేహమును ఆరోగ్యముగాను, నిర్మలముగాను ఉంచుకోవలెను. మనిషి వ్యర్థమైన చింతలతో, వ్యర్థమైన ఆలోచనలతో, వ్యర్థమైన పనులతో, వ్యర్థమైన కోరికలతో తనను తాను హింసపెట్టుకొంటున్నాడు. మనిషి బాగుపడకుండా సమాజము బాగుపడదు. సత్యాన్ని దర్శించుటకు మౌనము మంచిది. ఏకాంత వాసం, సహవాసం, ఉపవాసం సత్యాన్వేషణకు సహకరిస్తాయి. మనిషి మంచిచేస్తే మంచి ఎదురొస్తుంది. చెడ్డ చేస్తే చెడ్డ ఎదురవుతుంది. మంచితనము కూడా జ్ఞానమే. జ్ఞాని దుఃఖానికి దూరంగా ఉంటాడు. అజ్ఞాని సుఖానికి దూరంగా ఉంటాడు. జ్ఞాని తనకంటే వేరుగా లోకాన్ని చూడడు, తన స్వరూపంగానే లోకాన్ని దర్శిస్తాడు.

లోకాన్ని రక్షించేది విజ్ఞానము, మతము కాదు. లోకము దారిద్ర్యముచేత కంటే, అజ్ఞానము చేతనే ఎక్కువగా పీడింపబడుచున్నది.

మానవుడు జీవించి ఉండగానే అజ్ఞానము నుంచి విడుదల పొందకపోతే మరణించిన తరువాత ఎలా విడుదల పొందుతాడు? మరణము కూడా జీవితములో ఒక భాగమే! వినయము లేని వాడిని విజ్ఞానము వరించదు. మనిషి పాపము చేస్తున్నంత కాలం విజ్ఞానం యొక్క విలువను గ్రహించలేడు. సమాజ శ్రేయస్సునకు భంగము కల్గించే ప్రతీ పని పాపమే. పాపిని ప్రకృతి పీడించకుండా వదిలిపెట్టదు. ఈనాటికైనా, ఏనాటికైనా పాపికాని, స్వార్ధపరుడు కాని సత్యాన్ని దర్శించే అవకాశము లేదు.

## 9. చిత్తశుద్ధి లేనిదే శాంతి లేదు

వడ్లవాని పాలెం, మార్చి 25, 1984

దేశములో శాంతి భద్రతలు కాపాడుటకు పోలీసు బలగము ఎంత అవసరమో, మానవుల హృదయములను శాంతితో, కాంతితో నింపుటకు జ్ఞానుల బోధలు కూడా అంత అవసరము.

మానవులను అజ్ఞానమనే సంసారమును దాటించుటకే అవతార పురుషులు, ప్రవక్తలు ఈ భూమి మీద అవతరించారు. మతములు కూడా అందుకే పుట్టినవి. జ్ఞానము ఒక్కటే శాశ్వత మైనది. జ్ఞానమునకు వేరుగా మోక్షము లేదు. అజ్ఞానముతో జన్మించినా జ్ఞానముతో మరణించాలి. ఏడుస్తూ పుట్టినా నవ్వుతూ మరణించాలి. జ్ఞానము పొందకుండా దేహము మరణిస్తే అపారమైన నష్టమునకు, కష్టమునకు గురి అవుతాడు. దేహము యొక్క ప్రయోజనము, ఇంద్రియముల యొక్క ప్రయోజనము, మనస్సు యొక్క ప్రయోజనము మానవుడికి తన హృదయములో ఉన్న జ్ఞానమును ఆవిష్కరింపజేసుకొనుటకు మాత్రమే.

మన ప్రయత్నముతో పనిలేకుండా దేహానికి వార్ధక్యము వస్తుంది, కాని మన ప్రయత్నము లేకుండా అహంకార రూపములో ఉన్న అజ్ఞానమును తొలగించలేము. నిరంతరము ఈ లోకమునకు మూలకారణమగు ఈశ్వరుని స్మరించుట ద్వారా అజ్ఞానము పల్చబడుతుంది. అజ్ఞానమును అతిక్రమించలేనివాడు ప్రకృతిలో ఏది సాధించినా అది స్వప్నతుల్యమే.

పూజ, జపము, ధ్యానము చిత్తశుద్ధికి సహకరిస్తాయి. చిత్తశుద్ధి లేనివాడు శాంతిని పొందలేడు. శాంతిలో కూరుకుపోయిన వ్యక్తి ప్రపంచమును కూడా తన స్వరూపముగానే చూస్తాడు. బేదబుద్ధి అతని కళ్ళకు కనిపించదు.

నిదానముగా, సరళముగా, సహజముగా జీవించుట ద్వారా పరమేశ్వరుని ఆరాధించటం మంచిది. ఈ జన్మలో పరమేశ్వరుని పొందలేకపోయినా కనీసం ఆ ప్రయత్నంలో మరణించుట మంచిది. పరమేశ్వరుడు మానవుడు యొక్క నిజమైన స్వరూపము కంటే వేరుగా లేదు. ఈశ్వరుని దర్శించుట అంటే తనను తాను తెలుసు కొనటమే. తనను తాను తెలుసుకోలేనివాడు ఈశ్వరుణ్ణి దర్శించ లేడు. తన మనస్సును మింగలేనివాడికి తన స్వరూపము దర్శన మిచ్చే అవకాశము లేదు. స్వరూప దర్శనము కానివాడు జ్ఞాన గంగలో మునగలేడు. జ్ఞాని కానివాడు సుఖీ కాలేడు. జ్ఞానం వేరు, సుఖం వేరు కావు. జ్ఞాని మాత్రమే స్వార్ధరూపములో ఉన్న సంసారము నుండి విడుదల పొందగలడు.

స్వార్థమే భయముగా రూపాంతరము చెందుచున్నది. మానవుడులో ఉన్న అన్ని బలహీనతలకు స్వార్థమే కారణము. ధనము, విద్య, సౌందర్యం, కాలము ఇవన్నీ గొప్ప శక్తులు. వాటిని సద్వినియోగం

చేసుకొంటే మానవుడు పావనుడవుతాడు, దుర్వినియోగం చేసుకొంటే పతితుడవుతాడు. ధనబలము కంటే, దేహబలము కంటే, జ్ఞానబలము శక్తివంతమైనది, శాశ్వతమైనది. జ్ఞానము సహజముగా ప్రకాశ వంతమైనది. జ్ఞానము సహిస్తుంది. జ్ఞానము ప్రేమిస్తుంది. ప్రేమ వాంఛించదు. కామము వాంఛిస్తుంది.

కష్టాలు రాకుండా, దుఃఖాలు రాకుండా చూడమని భక్తుడు భగవంతుని ప్రార్థిస్తాడు. కాని కష్టాలు వచ్చినా, దుఃఖాలు వచ్చినా సహజముగా భరించగలవాడే నిజమైన భక్తుడు. వివేకవంతముగా జీవించుటయే భక్తియొక్క సారము. ముక్తికి దారి చూపించలేని భక్తి భక్తి కాదు. నిజమైన భక్తుడు భగవంతుడు చెప్పిన మాటలను వేరుగా చూడడు. జీవ లక్షణములను దాటలేని వ్యక్తి నిరంతరము తనను తాను హింసించుకొంటాడు. తన మనస్సుకు తానే బానిస అవుతాడు. వ్యర్థమైన ఆలోచనలతో, వ్యర్థమైన కోరికలతో కాలము గడుపుతూ కాలగర్భంలో కలసిపోతాడు. ఈ లోకములో ప్రతి వస్తువు కాల ప్రవాహములో కొట్టుకుపోతుంది. కాలాన్ని దూరాన్ని జయించ లేనివాడు భక్తుడు కాలేడు.

కళ్ళతో చూస్తున్నట్లే, చెవులతో వింటున్నట్లే మనము బుద్ధితో ఆలోచించగలగాలి. ఆలోచన అమృతముతో సమానము. ఆలోచన లేని వాడికి గమ్యము ఉండదు. ఆలోచన ఆవేశాన్ని దూరం చేస్తుంది. ఆలోచన చల్లదనమును కూడాతీసుకొస్తుంది. ఆలోచన హేతువును విడిచిపెట్టదు. ఆలోచన ఎంత గాఢమైనదో అంత గూఢమైనది కూడా! ఆలోచన ఎంత విశాలమైనదో అంత గంభీరమైనది కూడా! ఆలోచనకు కేంద్రము మెదడు, నడచుటకు కాళ్ళు ఉపయోగపడుచున్నట్లుగా పనిచేయుటకు చేతులు ఉపయోగపడుచున్నట్లుగా మనస్సులో ఉన్న

విషయములను బహిర్గతము చేయుటకు మెదడు ఉపయోగపడుచున్నది. మెదడు కూడా మనస్సు సృష్టించిన ఒక పనిముట్టు మాత్రమే. నామరూపములను కూడా మనస్సే కల్పించినది. మనస్సు పూర్తిగా జగత్తును, దేవుడిని కూడా కల్పించినది. మనస్సు పూర్తిగా అణగకుండా జ్ఞానము కలుగదు. మానవుని ప్రథమ కర్తవ్యం జ్ఞానమును సంపాదించుట మాత్రమే. జ్ఞానము యొక్క విలువ తెలియనివాడు జ్ఞాన సముపార్జనకు ప్రయత్నము చెయ్యడు. జ్ఞానమునకు ఆటంకములు స్వార్థము, క్రూరత్వం, సోమరితనము.

జ్ఞాని మంచి కోసం మంచిపని చేస్తాడు. కాని పుణ్యమును ఆశించి పనిచేయడు. జ్ఞాని భగవంతుని స్వరూపాన్ని పొందుతాడు. జ్ఞాని భగవంతుడిని కాని, విశ్వమును కాని తనకంటే వేరుగా చూడడు. విశ్వ క్షేమమును కోరువాడు నియమబద్ధముగా, నీతిబద్ధముగా జీవిస్తాడు. విశ్వమును కూడా భగవంతుని రూపము గానే చూస్తాడు. అహంకారమును కేంద్రముగా పెట్టుకొని జీవించేవాడు విశ్వమును ప్రేమించలేడు. విశ్వక్షేమము కోసము తన అహంకారాన్ని త్యాగం చేసినవాడే నిజమైన భక్తుడు. భక్తుడు సమాజమును కూడా పూజిస్తాడు. భక్తికి, సమాజానికి విరోధము లేదు. భక్తునికి సమాజం కూడా దేవుని యొక్క ఆలయమే. విశ్వమంతా తన ఆశ్రమమే.

ఆకలి పోగొట్టే అన్నదాత కంటే అజ్ఞానం పోగొట్టే జ్ఞానదాత శ్రేష్ఠుడు. జ్ఞానం వేరు, చదువు వేరు. చదువు లేనివాడు కూడా జ్ఞాని కావచ్చు. జ్ఞాని హృదయం నిశ్శబ్దముగా, నిశ్చలంగా ఉంటుంది. జ్ఞాని తనకున్న శక్తులన్నీ సమాజ కళ్యాణానికి ఉపయోగిస్తాడు.

# 10. మానవుడు మోక్షంలో ఉన్నాడు

జిన్నూరు, జూన్ 18, 1984

ప్రతి మానవుడు మోక్షంలోనే ఉన్నాడు. మానవుని నిజమైన స్వరూపం మోక్షమే. మానవుని గమ్యం కూడా అదే. మానవుడు ఆలోచనలో ఉన్న పొరపాట్లు వల్లనే తాను మోక్షమునకు దూరముగా ఉన్నాడని అనుకొంటున్నాడు. మోక్షము ఒకచోట తాను వేరొకచోట ఉన్నాను అని అనిపించుటకు కారణం దేహబుద్ధి, స్వార్ధబుద్ధి మాత్రమే. తాను మోక్షములో ఉన్నప్పటికి కుయుక్తులకు, కుతంత్రము లకు, కుచేష్టలకు అలవాటు పడుట వలన మోక్ష సుఖమును అనుభవంలోనికి తెచ్చుకోలేకపోతున్నాడు.

"నేను", "నాది" అను భావముల నుండి విడుదల పొందుటే మోక్షం. మానవుడికి దేహగతమైన "నేను" నుండి విడుదల కానంత కాలం దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. దేహగతమైన "నేను" నుండి పుట్టిన కోరికలను అనుదినము ఆరాధిస్తూ "భక్తి" అని అనుకొంటున్నాడు. మోక్షమనేది మానవుడికి వేరుగా ఉంటే అది వాడి స్వంతము ఎలా అవుతుంది?

తనను తాను దర్శించుకోవటమే మోక్షం. తానుగా జీవించ టమే మోక్షం. మోక్షము అంటే ఒక వస్తువు కాదు, మానవుని హృదయములో ప్రకాశిస్తున్న వెలుగే మోక్షం.

జీవితములో పరిశీలన, పరిశోధన లేనివాడు జ్ఞాని కాలేడు. జ్ఞానమే మోక్ష స్వరూపం. మనస్సుని, వాక్‌ని, శరీరమును సక్రమంగా, సరళంగా, సహజంగా ఉపయోగించుకొంటే బంధము నుండి విడుదల అవుతాడు. బంధము నుండి విడుదల పొందుటే మోక్షం. బంధము

మనస్సు రూపంలో ఉన్నది. మనస్సు పరిమితమైనది. సాధనలన్నీ మనస్సును జయించటం కోసమే. మనస్సు పల్చబడాలంటే నిగ్రహంతో కూడిన జీవితం అవసరం. విగ్రహం నిగ్రహాన్ని ప్రసాదించ గల్గితే విగ్రహారాధన కూడా మంచిదే. యంత్రములు, మంత్రములు, తంత్రములు ఇవన్నీ మనస్సును నిరోధించుటకు సహకరించవచ్చును. ఏకాగ్రత, ప్రవీణత, పవిత్రత, వినీతత ఇవన్నీ మోక్షమునకు సహకరించే సామగ్రి, తన హృదయం యొక్క లోతుల్లోకి దిగి అక్కడ ప్రకాశిస్తున్న ఆత్మ ముత్యమును పొందుట కంటే మానవుడు చేయవలసిన పని ఏమున్నది.

ఆత్మను దర్శించుటే మోక్షం. ఆత్మను దర్శించిన వాడికి మోక్ష చింతన ఉండదు. అతను చేయవలసిన కర్తవ్యమూ ఉండదు. తనకంటే వేరుగా లోకాన్ని చూడడం, తనలో ఒక భాగంగానే లోకం దర్శనమిస్తుంది, తాను దేహాన్ని అని అనుకోడు, కాని తనకు ఒక దేహం మాత్రం ఉందని అనుకుంటాడు. అతని వ్యక్తిత్వం దేహానికి పరిమితం కాదు. దేహం మాత్రమే "నేను" అని అనిపించే అహంభావ రూపమైన మొదటి తలంపు నుండి విడుదల పొందుటే మోక్షం.

మనస్సు కూడా ఒక సంసారమే. మనిషిని వెంటాడేది తలంపుల రూపంలో, వస్తువుల రూపంలో ఉన్న అతని మనస్సు యొక్క మలము నుండి, హృదయములో ఉన్న భారముల నుండి విడుదల పొందుట మనిషి యొక్క ప్రథమ కర్తవ్యం, ప్రధాన కర్తవ్యం.

ఇంద్రియనిగ్రహం, ఈశ్వర అనుగ్రహం లేని మానవుడు హృదయములో ఉన్న శాంతిని పొందలేడు. మోక్ష స్వరూపం శాంతి మాత్రమే. శాంతి ప్రసాదించే సుఖానికి మాలిన్యము లేదు. అది ఆకాశ గంగ వంటిది.

# 11. జ్ఞానము యొక్క అవతారమే శ్రీ రమణమహర్షి

పాలకొల్లు, అక్టోబర్ 21, 1984

భగవాన్ శ్రీ రమణ మహర్షి సమాజమును సమత్వము వైపు నడిపించుటకే ఈ లోకములో అవతరించారు. సమత్వమే యోగము. సమత్వమే జ్ఞానము. జ్ఞానమునకు మించిన దేశము లేదు, మతము లేదు, జాతి లేదు. జ్ఞానమునకు మించి సత్యము లేదు. సత్యమునకు సరిహద్దులు లేవు. సత్యము మానవుడికి తన స్వరూపముగానే దర్శనమిస్తుంది. సత్యాత్మను తెలుసుకొనుటకు ఈ లోకములో శ్రీ రమణస్వామి సహజమైన, సరళమైన, సూటియైన మార్గమును ఆవిష్కరించారు. సత్యాత్మను దర్శించినవాడినే ఋషి అని అంటారు. మరుగుపడిపోయిన జ్ఞానమార్గమును మానవజాతికి ఎత్తిచూపిన జ్ఞానస్వరూపుడే శ్రీ రమణస్వామి.

ఆత్మరూపములో ఉన్న సత్యమును తెలుసుకొనే వరకు మానవుడిని దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. దుఃఖము లేని స్థితినే మోక్షము అంటారు. మోక్ష సుఖము కంటే మించిన సుఖము ఈ లోకములో కాని, పరలోకములో కాని లేదు. రమణస్వామి బోధించనది విచారణా మార్గము. విచారణా మర్గాము అంటే మానవుడు మనస్సును సత్యాత్మలోనికి మరలించుకోవటం. మానవుని మానసము ఆత్మ విచారణను విడిచిపెట్టి లోక విచారణకు మాత్రమే అలవాటు పడింది, అందువలన దుఃఖాలకు, బాధలకు, భారాలకు, లోపాలకు, పాపాలకు బలి అగుచున్నది. విషయభక్తి దైవభక్తి కాదు. విషయభక్తి మనిషిని అజ్ఞానములో బంధిస్తుంది. దైవభక్తి అజ్ఞానము నుండి విడుదల చేసి ప్రజ్ఞానమును ప్రసాదిస్తుంది. ప్రజ్ఞానము ప్రేమ స్వరూపము. అజ్ఞానము కామ స్వరూపము.

"నేను" అను తలంపు పుట్టినచోటు చూసినవాడు మాత్రమే జ్ఞాని అవుతాడు. జ్ఞానము మాత్రమే శాంతిని ప్రసాదిస్తుంది. మనిషి ఏ వృత్తిలో ఉన్నప్పటికి అహం వృత్తిలో ఉండకూడదు. "అహంకారము" లో ఉన్న "కారము" నుండి విడుదల అయిన మనిషికి వివేకం కల్గుతుంది. ఈ లోకములో ఉన్న మాయ అంతా అహంకార రూపములో ఉన్నది. అహంకారికి సుఖము కనబడదు. నిరహం కారికి దుఃఖము కనపడదు. సూర్యుడికి చీకటి కనబడదు. అజ్ఞానికి దైవము ఉన్నచోటు కనబడదు. జ్ఞానికి కర్తృత్వము ఉండదు. కర్తృత్వమే దుఃఖమునకు కారణం. జ్ఞానిద్వారా కర్మ జరుగుతుంది. జ్ఞాని దేహము దేవాలయముతో సమానము.

నేటి భారతదేశములో రాళ్లకున్న విలువ మనుషులకు లేకపోవుటకు గల కారణం అజ్ఞానము మాత్రమే. జ్ఞానాగ్ని చేత అజ్ఞానమును దహించవచ్చు. జ్ఞానమే సహజమైనది. సహజమైనదే శాశ్వతమైనది. పక్షి ఎగురుటకు రెండు రెక్కలు ఎంత అవసరమో మానవుడు జ్ఞానమును పొందుటకు పవిత్రత, ఏకాగ్రత అను రెండు రెక్కలు అంతే అవసరము.

## 12. దుఃఖ స్పర్శ నుండి విడుదల పొందుటే మోక్షం

జిన్నూరు, జూలై 26, 1984

మానవజాతిని దుఃఖము నుండి, బాధ నుండి విమోచనము చేయుటకే ఈ లోకములో అవతార పురుషులు, జ్ఞానులు, ప్రవక్తలు అవతరించారు.

సాంకేతిక జ్ఞానం మానవజాతికి బాహ్యసుఖమును ప్రసాదించినా అజ్ఞానము నుండి, దుఃఖము నుండి విముక్తిని ప్రసాదించలేవు.

మానవుని యొక్క నిజమైన స్వరూపము సుఖము మాత్రమే. దురభ్యాసములకు, దురలవాట్లకు బానిస అగుట వలన తన స్వరూపమైన సుఖమును అనుభవములోనికి తెచ్చుకోలేక పోతున్నాడు. తనకంటే వేరుగా సుఖము ఎక్కడో ఉందనుకోవటం అజ్ఞాని లక్షణం.

మానవుడు తన స్వరూపమును విడిచిపెట్టి ప్రయోగశాలలో పరిశోధనలు జరిపినా భోగము అనుభవించవచ్చును. కాని సుఖమును పొందలేడు. భోగమును దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. భోగము వలన ఇంద్రియములు చల్లబడినా హృదయము చల్లబడదు. జాతి గమ్యము జ్ఞానము కాని భోగము కాదు. జ్ఞానము మనిషిని ఒక మతమునకో, ఒక వర్గమునకో బంధింపజేయదు, వివేకవంతుడుగా జీవించుటకు సహాయ సహకారములు అందిస్తుంది. తోటివారితో ఎలా కలసి మెలసి జీవించాలో కూడా విశదపరుస్తుంది. తనలో అంతర్గతముగా ఉన్న జ్ఞానమును దర్శించలేనివాడు దైవమును కూడా దర్శించలేడు. జ్ఞానము కంటే వేరుగా దైవము లేదు. జ్ఞానము యొక్క నిజమైన స్వరూపము ప్రేమ మాత్రమే. ప్రేమ పనిచేస్తుంది కాని వాంఛించదు. జ్ఞాని మాత్రమే తానుగా జీవించగలడు.

జ్ఞాని సమాజములో ఉన్నా అవినీతికి దూరముగా ఉంటాడు, ఇంద్రియాలతో పనిచేస్తూ అతీంద్రియుడుగా ఉంటాడు. సమాజాన్ని తనలో ఒక భాగంగానే చూస్తాడు. జ్ఞాని అనుకరణకు దూరముగా ఉండి తాను స్వతంత్రుడై తోటి మానవుడిని స్వతంత్రుడిగా జీవించుటకు సహకరిస్తాడు. జ్ఞాని మాత్రమే నా స్వరూపమును పొందుతాడని భగవంతుడు కూడా చెప్పాడు.

# 13. అందరూ దేహానికి భక్తులే

జిన్నూరు, సెప్టెంబర్ 12, 1984

సకామ భక్తి వలన మానవుడు స్వార్థము అనే అడుసులో కూరుకుపోతాడు. స్వార్థమే కేంద్రముగా పెట్టుకున్న మనిషి పరమార్థము నందుకోలేడు. స్వార్థపరుడు తాను మోహమునకు లోనగుటయే కాకుండా సమాజమును అవినీతికి గురిచేస్తాడు. మనిషి హృదయంలో మోహమనే చీకటి ఉన్నంతకాలం సమాజమును అవినీతి, అజ్ఞానము, దారిద్ర్యము విడిచిపెట్టవు. స్వార్థమునకు బందీ అయిన వ్యక్తి మనస్సు సరియైన స్థితిలో ఉండదు. ఆత్మానుభవము పొందలేనివాడు స్వార్థము నుండి విడివడలేడు. ఆత్మానుభవము లేనివాడు సత్యమును సాక్షాత్కరించు కోలేడు.

నిష్కామభక్తి మానవుడిని స్వార్థము నుండి విడుదల చేసి జ్ఞానమును ప్రసాదిస్తుంది. అవినీతి ఏ రూపములో ఉన్నా జ్ఞానము గౌరవించదు. జ్ఞానము స్వాతంత్ర్యమును ఆదరిస్తుంది. నిష్కామ భక్తి సమాజమును సమత్వం వైపునకు నడిపిస్తుంది. సమాజములో సోదర భావమును పెంచుతుంది. సమాజము పడే అన్ని రకముల బాధల నుండి విడుదల చేసేది జ్ఞానము ఒక్కటి మాత్రమే. అందుచేత దేశనమునకు ఆర్థిక ఉద్యమము, రాజకీయ ఉద్యమము ఎంత అవసరమో ఆధ్యాత్మిక ఉద్యమము కూడా అంతే అవసరము. ఆధ్యాత్మిక విద్యతో సంబంధము లేని జాతికి సమగ్రత చేకూరదు.

ప్రతి వ్యక్తి తనను తాను ఉద్ధరించుకొనుటకు ప్రయత్నము చేసే సమాజము దానంతట అదే ఉద్ధరించబడుతుంది. వ్యక్తికి సమాజము ఎంత అవసరమో, సమాజమునకు వ్యక్తి కూడా అంతే అవసరము. శీలము లేని వ్యక్తికి వ్యక్తిత్వము లేదు. నీతిలేని సమాజమునకు ప్రగతి లేదు.

ప్రతి మనిషి తనకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్త వహించాలి. జీవితమును నడిపేవి తలంపులే. తలంపులే మనిషి చేసే పనిని నియమిస్తాయి. తలంపుల సమూహమునే మనస్సు అని అంటారు. తన మనస్సుని, ఇంద్రియములను అదుపులో పెట్టుకోలేని వాడు పవిత్రతను సాధించలేడు. జీవిత లక్ష్యమైన పవిత్రతను పొందలేకపోతే జ్ఞానమును సాధించలేడు. శరీరమును, వాక్కును, మనస్సును అదుపు చేయటమే సాధన. సాధన లక్ష్యం చిత్తశుద్ధి మాత్రమే. బుద్ధి శుద్ధి కాకపోతే తన హృదయములో ఉన్న జ్ఞానము ఆవిష్కరించబడదు. రూపము కంటే శీలము, శీలము కంటే జ్ఞానము ఉదాత్తమైనవి.

జ్ఞానమునకు మరొక పేరే దైవము. అందరూ దైవానికి భక్తులు కాకపోయినా తమ దేహాలకు భక్తులుగానే ఉన్నారు. దేహమునకు మాత్రమే భక్తులైనవారు దేశమునకు, దైవమునకు భక్తులుగా ఉండలేదు. దేహ భావమును త్యాగము చేయలేనివాడు దేశభక్తుడు కాలేడు. దైవము లేకుండా దేహము రూపుదాల్చదు. దేహమునకు ఆధారముగా ఉన్న దైవమును చూడగలవాడే సమానత్వమును సాధిస్తాడు. సమత్వదృష్టి లేనివాడు జ్ఞాని కాలేడు. సమాజమునకు సారము చేకూర్చేది జ్ఞాని మాత్రమే. జ్ఞాని దేహములో ఉన్నా దేహానికి అతీతుడే, లోకములో ఉన్నా లోకమునకు అతీతుడే, లోకమును శోకము నుండి విడిపించుట జ్ఞానికి మాత్రమే సాధ్యము.

లోకములోని అజ్ఞానము అంతా రాగ, ద్వేషముల రూపంలో ఉన్నది. రాగద్వేషముల నుండి విడుదల కావించుటే యోగ లక్ష్యము. శరీరమునకు ఆరోగ్య శాస్త్రము ఎంత అవసరమో, మనిషిని దురభ్యాసముల నుండి విడిపించుటకు యోగశాస్త్రము కూడా అంతే

అవసరము. యోగి కానివాడు జ్ఞాని కాలేడు. మనిషి ప్రథమ కర్తవ్యము, ప్రధాన కర్తవ్యము జ్ఞానమును సంపాదించుటకు మాత్రమే. జ్ఞానమును సంపాదించుట కంటే మించిన పని ఈ లోకంలో కాని పరలోకంలో కాని లేదు.

నిజమైన జ్ఞానము మానవునిలో ప్రకాశిస్తున్న సత్యాత్మను దర్శింపజేసి స్వతంత్రుడిని చేస్తుంది. జ్ఞాని కానివాడు దుఃఖము నుండి విడుదల పొందలేడు. మనిషి స్వరూపము సుఖమే కాని దుఃఖము కాదు. అందువలననే ప్రతి మానవుడు సుఖమునే కోరతాడు. జ్ఞానమే సుఖము, జ్ఞానమే అభయము, జ్ఞానమే మోక్షము.

## 14. అహంభావ నాశనమే-తెలివి యొక్క ప్రయోజనము

జిన్నూరు, సెప్టెంబర్ 28, 1984

దేహం పుట్టినప్పడు మానవుడు పుట్టలేదు, అహంకారము పుట్టినప్పడే నిజముగా పుట్టినాడు, అందువలన దేహం చనిపోయి నప్పడు మానవుడు చావటం లేదు, అహంకాం చనిపోయినప్పడే మానవుడు నిజముగా చనిపోవుచున్నాడు, అందువలన అహంకారం పుట్టుకే పుట్టుక, అహంకారం యొక్క చావే నిజమైన చావు. దేహము యొక్క పుట్టుక పుట్టుకా కాదు, దేహము యొక్క చావు చావూ కాదని తెలివితో తెలుసుకోవలెను. ఇదియే తెలివి యొక్క ప్రయోజనము.

అహంకారమునే జీవుడని అంటారు. జీవ లక్షణములు లేనివాడు జ్ఞాని కాగలడు. జ్ఞాని స్వరూపమే ఆత్మ. అహంకారమే బేధమును కల్పిస్తున్నది, అదే ద్వైతమునకు మూలము. దైవమునకు అహంకారమును ఆహారముగా సమర్పించినవాడే నిజమైన భక్తుడు. అహంకారము లేనివాడికి అశాంతి లేదు. దేహము కాలి బూడిద

అవ్వకముందే ఎవనిలో అహంకారము కాలి నాశనము అవుతుందో వాడు జ్ఞాని కాగలడు.

మర్యాద తెలియని వాడి దగ్గర నుండి మర్యాద ఆశించ కూడదు. అనాగరికుడి నుండి నాగరికత ఆశించకూడదు. అదే విధముగా జ్ఞాని కానివాడి నుండి ఆత్మవిద్య ఆశించకూడదు. ప్రారబ్ధము, కర్మ కేవలము దేహమునకు, అహంకారమునకు సంబంధించినవే కాని ఆత్మకు సంబంధించినవి కావు. అహంకారమునకు దేహము అవసరము కాని ఆత్మకు దేహముతో పనిలేదు. అహంకారము అస్వతంత్రమైనది. ఆత్మ స్వతంత్రమైనది. ఆత్మే సత్యము, ఆత్మే శాంతి, ఆత్మ లేకుండా దేవుడు లేడు. మాయను అతిక్రమించలేనివాడు ఆత్మను దర్శించలేడు. మాయ ప్రతి మనిషిలోను తన అహంకార రూపములోనే ఉన్నది. అహంకారము పల్చబడితే ఆత్మను తెలుసుకోవడానికి అతడు అర్హుడవుతాడు. అహంకారమే సమస్యలను కల్పించి బంధింపబడుచున్నది. బంధము లేనివాడికి మోహముతో పనిలేదు. ఆరోగ్యవంతుడికి మందుతో పనిలేదు.

మానవుడికి తన అహంకారము అనుభవములో ఉన్నది. కాని ఆత్మ అనుభవములో లేదు. అందుచేత ఆత్మ లేదని అనుకొంటున్నాడు. మనలో ఉన్న ఆత్మ లేదనుకున్నంత మాత్రమున లేకుండా పోదు. కలహములు కలిగించుటకు మతములు పుట్టలేదు. అన్ని మతముల సారము ఆత్మ రూపములో ఉన్న సత్యమును సాక్షాత్కరించుకొనుటకే. సత్యమునకు సమానమైన మతము లేదు. సత్యమును దర్శించలేని వాడు దుఃఖము నుండి విడుదల పొందలేడు. మానవునిలో ఉన్న దుర్గుణములే దుఃఖము రూపములో ఎదురు వస్తాయి. తనలో ఉన్న దుర్గుణములను త్యజించినవాడే నిజమైన త్యాగి. త్యాగి కానివాడు జ్ఞానికాలేడు. జ్ఞాని కానివాడు సుఖి కాలేడు. సుఖము లేకపోతే బ్రతుకు భారమవుతుంది.

నేడు భారతదేశమునకు కావలసినది హేతువాదము. హేతువాదము మూఢనమ్మకములను, మూఢ విశ్వాసములను, వ్యర్థమైన కోరికలను, వ్యర్థమైన కార్యములను దూరముగా ఉంచుతుంది. మనిషికి మంచి చేసే ఏ వాదమయినా ఆరాధించదగినదే. మనిషికి, మనిషికి మధ్య అడ్డుగోడలుగా నిలబడే కులముల కంటే, మతముల కంటే, వర్గముల కంటే హేతువాదమే మంచిది. సత్యమును తెలుసుకొనుటకు హేతువాదము కూడా సహకరిస్తుంది. సత్యమునకు, హేతువాదమునకు విరోధము లేదు.

మానవునిలో ఉన్న అజ్ఞానమే తనకు శత్రువు. మానవునిలో ఉన్న జ్ఞానమే తనకు మిత్రుడు. జ్ఞానమే మనిషికి అలంకారము. జ్ఞానము పొందకుండా మనిషి మరణిస్తే జీవితములో ఏమీ సాధించనివాడితో సమానము. జ్ఞానములేని జన్మ వృధా అవుతుంది. జ్ఞానము మాత్రమే అభయమును ప్రసాదిస్తుంది. దేహము కాలగర్భములో కలసిపోతుంది. జ్ఞానము కాలమునకు, దేహమునకు, దేశమునకు అతీతమైనది.

## 15. ధర్మాన్ని ఆచరిస్తేనే సత్య సాక్షాత్కారము

భగవాన్ 105వ జయంతి

జిన్నూరు, జనవరి 7, 1985

సమాజమునకు యోగశాస్త్రం అర్థంకానంత కాలం దాని విలువ కూడా తెలియదు. తనను తాను తెలుసుకోలేనివాడు ఎన్ని తెలుసుకున్నా మహాత్ముడు కాలేడు. దురాత్ముడిని మహాత్ముడిగా మార్చేది యోగము మాత్రమే. వియోగము లేకపోతే ఉన్నది యోగము మాత్రమే. విభక్తి లేకపోతే ఉన్నది భక్తి మాత్రమే. అజ్ఞానము లేకపోతే ఉన్నది సుజ్ఞానమే. అనారోగ్యం పోతే ఉన్నది ఆరోగ్యము మాత్రమే. దుఃఖము పోతే ఉన్నది

సుఖము మాత్రమే. లేని దానిని లేనట్లుగా తెలుసుకుంటే ఉన్నది ఉన్నట్లుగా కన్పిస్తుంది. ఉన్నదానిని ఉన్నట్లుగా తెలుసుకొన్నవాడే ఉత్తమ పురుషుడు.

ధర్మమును ఆచరించలేని మానవుడు అమృతత్త్వ స్థితిని పొందలేడు. మానవజాతిని సమైక్యముగా ఉంచి ఉదాత్తమైన ఆలోచనలతో ఊగించి ఉన్నతమైన స్థితికి తీసుకొని వెళ్ళుటకు ఒక్క ధర్మమునకు మాత్రమే సాధ్యమైన పని. నిండు మనస్సుతో ధర్మము నాచరించేవాడు సత్య సాక్షాత్కారమునకు అర్హతను, యోగ్యతను సంపాదిస్తాడు. ధర్మమునకు దూరమైన సమాజం సుఖమునకు కూడా దూరమవుతుంది.

మానవుడికి ఒక దేహం ఉన్నది. కాని వాడు దేహము కాదు, అందువలన దేహము మరణించగా ఆత్మరూపములో ఉన్న తాను మరణించుట లేదు. ధర్మజీవనం సాగించేవాడు "తాను"గా జీవిస్తాడే కాని "నేను"గా జీవించడు. ధర్మాన్ని విడిచిపెట్టిన మానవుడు వివేక వంతుడు కాలేడు, ధ్యానం చెయ్యలేడు. ధ్యానమును చేసేవాడి యొక్క మూలమును తెలుసుకొనుటే ధ్యానము యొక్క ప్రయోజనము.

మానవుడు తనలో ఉన్న అల్పత్వము నుండి బయట పడాలంటే ధర్మమునే లక్ష్యముగా పెట్టుకొని, ధర్మమునే ఉపాయముగా పెట్టుకొని జీవించాలి. అప్పడు జీవితమునకు ఆవలి ఒడ్డు అయిన జ్ఞానం ప్రసాదింపబడుతుంది. సత్పురుషుడికి జ్ఞానమే డ్రైవరుగా ఉంటుంది. ఇసుమంతయు పక్షపాతము లేని జీవనవిధానమే జ్ఞానమునకు గుర్తు. అజ్ఞానమును త్యజించలేని వ్యక్తి సమాజమునకు ఉపయోగ పడలేడు. మనిషిని బంధించేది అజ్ఞానం కాని సంసారం కాదు.

ఇష్టం ఉన్నా లేకపోయినా బంధంలో ఉన్న మనిషి పాపం చేస్తాడు. అన్ని అనర్థాలకు పాపమే మూలము. స్వార్థమునకు మించిన పాపము లేదు. మానవుడు తన శరీరం మీద, తన మనస్సు మీద అదుపు సంపాదించలేకపోతే పాపదూరుడు కాలేడు. మానవుడికి వాడి మనస్సును స్వాధీనము చేసి స్వస్థత చేకూర్చుటకే యోగము ఏర్పడినది. యోగి కాలేనివాడు మోక్ష సుఖమును రుచి చూడలేడు. యోగము శారీరక రోగమును, మానసిక రోగమును నిర్మూలిస్తుంది. యోగి కానివాడు జీవితములో భోగిగా మిగిలిపోతాడు. భోగము రోగానికి దారితీస్తుంది. దేహము మీద ఉన్న ధూళిని పోగొట్టుటకు "జలము" ఎలా ఉపయోగపడుచున్నదో, అదే విధముగా మనస్సులో ఉన్న దుర్వాసనలను ఊడగొట్టుటకు "యోగము" ఉపయోగపడుతుంది. సమాజము యొక్క మానసిక ఆరోగ్య విషయములో జాగ్రత్త తీసుకోకపోతే ఎంతోమంది టెక్నాలజిస్టులు, సైంటిస్టులు ఉన్నప్పటికి సమాజమునకు ఉజ్వల భవిష్యత్తు ఉండదు.

## 16. అహంకారమునకు మించిన రాక్షసుడు లేడు

పోడూరు, ఫిబ్రవరి 5, 1985 సం.

నైతిక విలువలు విడిచిపెట్టి పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా భక్తి అనిపించుకోదు. కళ్యాణ గుణములు కలవాడే భక్తుడు. గుణసంపద లేని భక్తి రాక్షసభక్తి. మనిషిలో ఉన్న అహంకారమునకు మించిన రాక్షసుడు లేడు.

మన రాగద్వేషములు, మన కామక్రోధములు మన ఆలోచనలను తగ్గిస్తున్నాయి. ఆలోచన అమృతములో సమానము. ప్రాపంచిక వాసనలతో ఉడుకుతున్న మనిషి నరళంగా, నహేతుకంగా

ఆలోచించలేడు. నిజమైన ఆలోచన నీతిని పెంచుతుంది. నీతి అంతరంగిక జీవితమునకు సంబంధించినది. నీతి ప్రదర్శించే వస్తువు కాదు. నీతి కర్తవ్యమును ప్రబోధించి మనస్సుకు సౌందర్యమును చేకూరుస్తుంది. నీతి దుష్టకర్మకు కోత పెడుతుంది. దురభ్యాసములను విడిచిపెట్టటమే నిజమైన త్యాగము, నిజమైన పూజ కూడా అదే. ఈశ్వరుని యందు భక్తి వలన, సజ్జన సాంగత్యము వలన దురభ్యాసములను విడిచిపెట్టవచ్చును.

శాస్త్ర పరిశోధన ద్వారా, ఆత్మ విచారణ ద్వారా తత్త్వమును తెలుసుకొని సుఖి కావచ్చును. జీవ లక్షణములను విడిచిపెడితే జీవుడు శివ స్వరూపం పొందుతాడు. ఆనందమే శివస్వరూపం. మరణం అంటే చొక్కా మార్చుకోవటం లాంటిది. భౌతికమైన అగ్ని శరీరమును కాల్చి బూడిద చేసినా జీవరూపములో ఉన్న మనస్సును కాల్చలేదు. జ్ఞానాగ్ని ద్వారానే మనో నాశనం అవుతుంది. మన దుర్గుణములే మనకు విరోధులు. దుర్గుణములను దూరము చేయకపోతే శాంతి లేదు. శాంతి లేనివాడు పాపముతో పోరాడ లేడు. శాంతి యధార్థమైన ఆత్మలోనే ఉన్నది. మనఃశ్శాంతిని పోగొట్టేది మన కోరికే! కోరికతో పనిచేసే ప్రతివాడు కూలివాడే! కూలివాడు ఆత్మ సామ్రాజ్యమును అధిష్టించలేడు, స్వాతంత్ర్యమును పొందలేడు. బానిస గానే జీవిస్తూ భయములో కూరుకుపోయి బానిసగానే మరణిస్తాడు.

టెక్నాలజీ అభివృద్ధి పొందినంత మాత్రం చేత మనిషి అభివృద్ధి పొందలేడు. అహంకారమును అలంకరించుకొనుటకు జీవించే మానవుడు తనకు గాని, సమాజమునకు గాని న్యాయము చేకూర్చలేడు. అహంకారమును దాటితే గాని అజ్ఞానమనే సుడి గుండము నుండి బయటపడలేడు. అహంకార రూపములో ఉన్న

"నేను" ను పోగొట్టుకొంటే మోక్ష సుఖమును పొందుతాడు. అహంకారము చుట్టూ తిరిగే మనిషి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయలేడు, విశ్వాత్మను దర్శించలేడు. అహంకారమునకు మించిన రోగము లేదు, శోకము లేదు. దేహానికి మరణము రాక ముందే అహంకారము రాలిపోతే మానవుడు దానవుడు అవుతాడు.

## 17. జ్ఞానమే మోక్షం, అహం వృత్తియే బంధము

జిన్నూరు, జూలై 7, 1985

విద్యలలోకి మోక్షవిద్య అత్యంత ప్రధానమైనది. సాంకేతిక విద్య మానవుని భౌతిక అవసరములు తీర్చుటకు సహాయ సహకారములు అందించగలిగినా మానవుడిని పూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుటకు సహకరించలేదు. మోక్షవిద్య మాత్రమే మానవుడిని దుఃఖము లేని స్థితికి తీసుకొని వెళ్ళుటకు సహాయపడుతుంది.

మానవుడికి నిజమైన శత్రువు తన అహంకారము మాత్రమే. అహంకారమునకు మించిన పాపము లేదు. ఆత్మజ్ఞానము మాత్రమే అహంకారమునకు కోత. జ్ఞానికి అహంకారము రోత. అహంకారము లేనివాడికి మోహము కలుగదు. మోహము తీరినవాడికి దుఃఖము లేదు. అజ్ఞానికి తన దేహము, మనస్సు ఎలా అనుభవంలో ఉంటాయో, జ్ఞానికి తన స్వరూపమైన సత్యం అలాగే అనుభవంలో ఉంటుంది. సత్యమును దర్శించినవాడే నిజమైన గురువు. అటువంటి గురువు మాత్రమే లోకములో ఉన్న శోకమును హరించ గలడు.

పవిత్రుడు కానివాడు మోక్షమును పొందలేడు. బుద్ధిని శుద్ధి చేయుట కొరకే జపము, ధ్యానము, నిస్వార్థసేవ చెయ్యమని శాస్త్రం

ఆదేశించినది. అజ్ఞానము అంతా రాగద్వేషముల రూపములో ఉన్నది. జ్ఞానం కోసం జీవించేవాడికి మాత్రమే ఈ రాగద్వేషాలు రాలిపోతాయి. సంకల్పముల యొక్క బాహ్యరూపమే ప్రపంచము. మానవుడు పరిశుద్ధమైన సంకల్పములను ఆవిష్కరింపచేయ లేకపోతే ప్రపంచమునకు ప్రగతి లేదు. ఆలోచనలో పరిణితి లేనప్పుడు ఉజ్వల భవిష్యత్తును ఊహించలేము. దేహము యొక్క ఆరోగ్యము ఎంత అవసరమో మానసిక ఆరోగ్యంకూడా అంతే అవసరం. దేహము, మనస్సు కలిపితే మానవుడు అవుతాడు. మానసిక ఆరోగ్యమును పాడుచేసే అలవాట్లే మన బంధాలు, మన సంకెళ్ళు.

సత్యాన్వేషకుడు మాత్రమే తన బలహీనతల నుండి బయట పడగలడు. ధైర్యముతో తన బలహీనతలను తొలగించుకోలేకపోతే ఉన్మాదమునకు గురి అవుతాడు. స్వార్థము నుండి, గర్వము నుండి విడుదల పొందనివాడు లోకమునకు హితవు చేయలేడు. జ్ఞాని మాత్రమే తన శక్తినంతా లోకక్షేమమునకు ఖర్చుపెడతాడు. జ్ఞానము లేనివాడు సంఘ క్షేమమునకు పనిచేయలేడు. మానవుడు జ్ఞానమును పొందుటకు ఏ లోపములు అడ్డు తగులుతున్నాయో వాటిని సమూలముగా త్యజించటమే త్యాగము. త్యాగమునకు మరొక పేరే యజ్ఞము. జ్ఞాని హృదయం శాంతితో, శక్తితో, కాంతితో నిండి ఉంటుంది.

మానవుడు హృదయములో ఉన్న చీకటిని జ్ఞానాగ్ని మాత్రమే తొలగించగలదు. కాని భౌతికమైన అగ్ని తొలగించలేదు. జ్ఞానమును సంపాదించుట కంటే మించిన పనికాని, యోగము కాని, భక్తి కాని లేనేలేదు. జ్ఞాని లోకమును, దైవమును వేరుగా చూడడు. జ్ఞానం కోసం ఇప్పడే, ఇక్కడే ప్రయత్నం చెయ్యాలి. జన్మలు మారినంత మాత్రంచేత

దేహములు మార్చవచ్చు కాని జ్ఞానం మాత్రం కలుగదు. జ్ఞానములేని జన్మ సాఫల్యము కాదు. దేహం పతనం అవ్వకముందే అజ్ఞానం పతనం అవ్వాలి. అజ్ఞానమే బంధము, దాని నుండి విడుదల కలిగించే విద్యే ఆత్మవిద్య.

## 18. సత్యసాక్షాత్కారమే జీవిత పరమావధి (సత్యవైభవం)

శృంగవృక్షం, నవంబర్ 4, 1085

మానవుడు భయములేని స్థితిని పొందేవరకు దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. సత్యవస్తువును దర్శిస్తేనే గాని అభయ స్థితిని అందుకోలేడు. సత్యమును గురించి శ్రవణం చేయటం కంటే మించిన భాగ్యము లేదు. మానవుని బుద్ధి సత్యములో లయించే వరకు అజ్ఞానం నుండి బయటపడలేడు. సత్యసాక్షాత్కారమే జీవిత పరమావధి. అంతఃకరణ శుద్ధి అను ద్వారము ద్వారానే సత్యమును దర్శించే యోగ్యత కల్గుతుంది.

అవిద్యలో చిక్కుకుపోయిన మానవజాతి ఆత్మవిద్యను శ్రవణం చేయటం ద్వారా విడుదల పొందవచ్చును. జాతికి ఆర్థికాభివృద్ధి ఎంత ముఖ్యమో చైతన్యస్థాయిని పెంచుకోవటం కూడా అంతే అవసరము. చైతన్యమును ధ్యానించుట ద్వారా బుద్ధిలోని దోషములు రాలిపోతాయి. నిర్మలమైన బుద్ధి విజ్ఞానమును, ప్రజ్ఞానమును కూడా ప్రసాదిస్తుంది. అంతే కాకుండా అహంకారం అనే వృత్తి నుండి బయటపడుటకు కూడా సహాయపడుతుంది.

దుర్గుణములను, దుర్వాసనలను, కుయుక్తులను, కుతంత్రములను, కుచేష్టలను దూరముగా విడిచిపెట్టలేకపోతే జీవితమనే

వృక్షమునకు జ్ఞానమనే పండు కాయదు. భగవాన్ శ్రీ రమణ మహర్షి జీవితమును జ్ఞానమునకు ఉదాహరణముగా తీసుకోవచ్చును.

పనిచేయుటకు కోరిక ఒక్కటే కారణం అయితే మోక్షానందమును పొందలేడు. మోక్షమునకు మరొక పేరే జ్ఞానము. జ్ఞానం కొరకు తదేకంగా తపించటమే తపస్సు జ్ఞానమును సంపాదించు టలో అడ్డు వచ్చే విషయములను విడిచిపెట్టటమే త్యాగం.

## 19. ప్రేమలేని బ్రతుకు వ్యర్థం, దుర్భరం

కార్తీక దీపోత్సవం

జిన్నూరు, నవంబర్ 26, 1985

ఇంద్రియ నిగ్రహం లేకుండా మనోనిగ్రహం సాధ్యం కాదు. ఇంద్రియములను శుద్ధి చేయటం ద్వారానే చిత్తశుద్ధిని సాధించాలి. చిత్తశుద్ధి లేనివాడు తన హృదయంలోనే గాఢంగా, గూఢంగా ఉన్న పరమాత్మను దర్శించలేడు. ఆత్మానుభవమును పొందినవాడు మాత్రమే కర్మ ఫలమును త్యాగము చేయగలడు. జన్మ యొక్క ప్రయోజనం యోగ్యతను పెంచుకొని సమత్వ దృష్టిని సాధించటమే సమత్వమునకు మించిన యజ్ఞం లేదు. సమత్వము లేకపోతే దివ్యప్రేమకు అస్థిత్వం లేదు. మానవ ప్రవృత్తికి ప్రేమ మాత్రమే కారణముగా ఉండాలి. నిజమైన ప్రేమ దేశ కాలములకు అతీతమైనది. ప్రేమలేని జీవితం వ్యర్థం. దివ్యప్రేమ మాత్రమే మానవుడిని బంధము నుండి విడుదల చేస్తుంది. ప్రేమను జీర్ణించుకున్న వాడికి ఈశ్వరుడు తన స్వరూపమును ప్రసాదించి కళ్యాణములనే ఆభరణములతో అలంకరింపచేస్తాడు. దైవ గుణములు కలవాడిని మాత్రమే జ్ఞానము ఆలింగనము చేసుకుంటుంది. వ్యర్థమైన కోరకలతో, వ్యర్థమైన కర్మలతో, వ్యర్థమైన తలంపులతో ఉద్రేకమునకు

లోనై అనారోగ్యమునకు గురవుతున్న నేటి సమాజమును భగవాన్ శ్రీ రమణమహర్షి లాంటి జ్ఞానుల ఉపదేశములు మాత్రమే రక్షించ గలవు.

కర్మఫలమును భోగించుట ద్వారా వ్యక్తి భావన పెరిగి అజ్ఞానములో కూరుకుపోతాడు. జ్ఞానికి మాత్రమే బ్రహ్మభావన సాధ్యం అవుతుంది. జ్ఞానం పట్ల ప్రీతి పెంచుకొంటే భీతి పోతుంది. దేహములు, ప్రాణములు, పరిసరములు, సంసారము కాదు. అవిద్య మాత్రమే సంసారం. రాగద్వేషములకు దూరముగా ఉన్నవాడే నిజమైన పండితుడు. కామ్య కర్మలు రాగద్వేషములను పెంచుతాయి. కర్మయోగము రాగద్వేషముల నుండి విడుదల చేసి, జన్మ మరణములు అను దీర్ఘయాత్ర నుండి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది.

## 20. అమృతానుభవం స్వార్ధమునకు అందేది కాదు

చించినాడ, డిసెంబర్ 18, 1985

శవమునకు అలంకరణ చేస్తే ఎలా ఉంటుందో జ్ఞానము లేని జీవితము కూడా అలాగే ఉంటుంది. పప్పునకు ఉప్పు ఎంత ముఖ్యమో శ్రీ రమణమహర్షి, రామకృష్ణ పరమహంస, వివేకానంద, మహాత్మాగాంధీ మొదలైన జ్ఞానుల జీవితములు కూడా సమాజము నకు అంతే ముఖ్యం.

అజ్ఞానం అనే దారిద్ర్యం నుండి బయటపడే వరకు మానవుడిని దుఃఖము ఏదో ఒక ముసుగు వేసుకొని వెంటాడుతూనే ఉంటుంది. మానవ హృదయంలో చైతన్యరూపంలో ప్రకాశిస్తున్న పత్యాత్మను దర్శించటం ద్వారా మాత్రమే అజ్ఞానము నుండి విడుదల పొందుతాడు. ఆత్మను ధ్యానము చేస్తే ఆత్మ తెలియబడుతుంది. ఆత్మకు హద్దులు పేలు, వాంఛలు లేవు. ఆత్మ తెలియబడగానే మానసికమైన అస్వస్థ నుండి మానవుడు స్వేచ్ఛను పొందుతాడు.

మతములు, కులములు, ఆచారములు, సాంప్రదాయములు నేటి సమాజమును పట్టి పీడిస్తున్నాయి. విజ్ఞానమును ఆరాధించుట ద్వారా సమాజము ఉజ్వల భవిష్యత్తులోనికి ప్రవేశిస్తుంది.

మానవ మానసము తాను కల్పించుకున్న పరిమితుల నుండి విడుదల పొందలేకపోతే పరమాత్మ లేనట్లుగా కనిపిస్తున్నది. దుఃఖ మిశ్రితము లేని సుఖమును పొందుటకు తన స్వరూపముగా ఉన్న పరమాత్మను ప్రత్యక్షం చేసుకోవాలి. స్వార్థముతో నిండిన భక్తికి గాని, కర్మకు గాని, ధ్యానమునకు గాని పరమాత్మ అందడు. మానవుడిలో ఉన్న స్వార్థమే సమాజమును క్రూరత్వములోనికి దింపివేస్తుంది.

అంతరదృష్టి లేని వ్యక్తి సత్యములో ఉన్న సౌందర్యమును గాని, ఆలోచన యొక్క లోతును గాని, ఆడంబరము లేని జీవన విధానమును గాని దర్శించలేడు. సత్యము యొక్క మరొక రూపమే దైవము. దైవమును ధ్యానించేవాడు ద్వైత ప్రపంచము నుండి వియోచనము పొందుతాడు. ద్వైతం భయకారణం. భయములేని స్థితి పొందిన వ్యక్తి యొక్క ఇంద్రియములు, మనస్సు ఆనంద సాగరములో లీనమౌతాయి. అభయ స్థితే అమృతస్థితి. అమృతస్థితిని సాధించటమే మానవ జీవిత లక్ష్యము.

## 21. భారతీయ విద్య యొక్క గమ్యము సత్యాన్వేషణ

నేరేడుమిల్లి, జనవరి 19, 1985

సాంకేతిక శాస్త్రము శారీరక సుఖమును మాత్రమే ఇవ్వగలదు. తనను తాను తెలుసుకొనుటకు తత్త్వశాస్త్రం సహకరిస్తుంది.

మానవ హృదయములో సత్యము స్వయముగా ప్రకాశిస్తున్నది. సత్యమును సాక్షాత్కరించుకొనుటకు భారతీయ విద్యయొక్క లక్ష్యమై యున్నది.

సత్యాన్వేషకుడు మాత్రమే మనస్సులో మంచితనమును చేర్చుకొని పరమార్థమును దర్శించగలడు. అతను మాత్రమే పూర్ణ మానవుడు అవుతాడు.

మానవుడు తన తెలివిని ఉపయోగించి తన బలహీనతలను తొలగించుకొని తన గమ్యమైన తన స్వరూపమును చేరుకోవాలి, అదే నిర్విషయ స్థితి, అదే జ్ఞానం, అదే అద్వైత స్థితి.

భారతీయ తత్వ శాస్త్రమును శ్రీ రమణస్వామి సుసంపన్నం చేసినారు. ఆయన ఆధ్యాత్మిక జగత్తులో చిరంజీవి.

అహం వృత్తి యొక్క మూలం తెలిస్తేనే కాని నిజం తెలియదు. నిజం తెలిసిన యెడల దుఃఖము లేని స్థితిని పొందవచ్చును. నిజము తెలుసుకొనుటకు శాస్త్రములో సూచనలు ఉన్నాయి, కాని నిజం శాస్త్రములో లేదు. చల్లని మనస్సుతో నిజమును తన హృదయములో వెతికితే వెలుగు కన్పిస్తుంది. నిజము తెలియని జీవితము దుర్భరముగా ఉంటుంది.

స్వార్థము నుండి విడివడలేని వ్యక్తి యజ్ఞములు చేసినా, యాగములు చేసినా, సంకీర్తనములు చేసినా వ్యాపార భక్తికి పరిమితమై ఉంటాడు. సత్యము స్థానములో అసత్యమును ఆరాధిస్తే జీవితము దుఃఖముతో ముగుస్తుంది.

## 22. సహజంగా జీవించటమే జ్ఞానము

జిన్నూరు, ఫిబ్రవరి 11, 1985

మానవుడు ముందుగా తాను ఎవడో తెలుసుకోవాలి. తనను తాను తెలుసుకోవడానికి తన బలహీనతలే అడ్డువస్తున్నాయి. తన

బలహీనతలు తొలగించుకోవడానికి ఈశ్వరుని యందు భక్తి అవసరము. నిజమైన భక్తి ఏమీ అడగదు. అడిగేది భక్తి కాదు.

ఈశ్వరుని సహాయం లేకుడా కేవలం స్వప్రయత్నము వలన దుర్గుణములకు దూరము కాలేడు.

సుగుణముల సమూహమే మంచితనం. మంచిని చెయ్యాలి కాని చేసిన మంచిని మరచిపోవాలి. మంచివాడికి తాను మంచివాడినన్న సంగతి కూడా తెలియదు. మంచితనముగా జీవించటం కంటే మించిన తపస్సు లేదు. మంచితనమును ప్రేమించేవాడు కష్టములను భరించుటకు కూడా సిద్ధపడాలి.

అత్యంత సహజముగా జీవిస్తే మనస్సు యొక్క పొరలలో ఉన్న దోషములన్నీ రాలిపోయి జ్ఞానమునకు దారి కనిపిస్తుంది. కాల ప్రవాహములో దేహము కొట్టుకుపోయినా కాలమునకు, దూరమునకు అతీతముగా జ్ఞానము ప్రకాశిస్తుంది. జ్ఞానము ప్రేమిస్తుంది కాని కామించదు. జ్ఞానిలో కర్తృత్వ భావన కనిపించదు. కర్తృత్వభావన లేనివాడు రాగద్వేషాలకు, లాభ నష్టాలకు, సుఖ దుఃఖాలకు దూరముగా ఉంటాడు.

జ్ఞానికి ఆలోచనే ప్రధానము కాని ఆవేశమునకు లోనుకాడు. జ్ఞాని తన స్వరూపమైన సత్యము నుండి వేరుపడి ఒక్క క్షణము కూడా ఉండడు. సత్యమతమే జ్ఞానమతము.

అసత్యమును వాంఛించేవాడికి సత్యము దొరకదు. సత్యము దొరకనివాడికి దుఃఖము నుండి విడుదల లేదు. మనస్సు యొక్క పుట్టుచోటు చూడలేనివాడు సత్యమును దర్శించలేడు.

తలంపుల సమూహామే మనస్సు. మానవుడు తనకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తపడాలి. తలంపులే జీవితమును తీర్చిదిద్దుతాయి. తలంపుల మూలం తెలిస్తే తన స్వరూపం కూడా తెలుస్తుంది. స్వరూపమును దర్శించినవాడే సుఖి.

## 23. మృత్యువు యొక్క తలంపు లేనివాడే మహర్షి

వెంప, ఫిబ్రవరి 28, 1985

భారతీయుల ప్రాచీన గ్రంథములైన వేదములలో చెప్పబడిన సారమును జీవించి చూపిన ఆధునిక మహర్షి అరుణాచల రమణుడు. ఆయన జీవిత విధానము ద్వారా శాస్త్రములలో చెప్ప బడిన సత్యము వెలుగులోనికి వచ్చినది, శాస్త్రము యొక్క గౌరవము పునరుద్ధరింపబడినది.

మృత్యువు యొక్క తలంపులేనివారు మహర్షులవుతారు, మహర్షులు పూజనీయులు, జ్ఞానస్వరూపులు, ప్రేమమయులు. ప్రేమ ఆరదదు, అందుకనే మహర్షుల మాటలు చిరకాలం, కలకాలం స్మరణీయములు.

భగవాన్ శ్రీ రమణ మహర్షికి ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో స్థిరమైన స్థానము ఏర్పడినది. ఆయన చేసిన ఉపదేశం ఉపదేశసారము లో ఉన్నది. ఆయన చెప్పిన మాటలు లక్ష్య ప్రధానములు.

ఆత్మ ఒక్కటే దైవము, దానిని తెలుసుకొనుటే జీవితగమ్యము. ఆత్మజ్ఞానము ద్వారా ఆత్మ తెలుస్తుంది. ఆత్మ దర్శనమైనవాడు దుఃఖము నుండి, అజ్ఞానము నుండి విడులవుతాడు. అజ్ఞానమును భరించటం మిక్కిలి కష్టం. మానవుని మానసములో ఉన్న అన్ని దౌర్బల్యములకు,

బలహీనతలకు, లోపములకు, రుగ్మతలకు, పాపములకు అజ్ఞానమే కారణము.

భయమును విడిచిపెట్టకుండా అభయస్థితిని పొందలేడు, అదే విధముగా అజ్ఞానమును విడిచిపెట్టకుండా జ్ఞానస్థితిని పొందలేడు. ఏ మానవుడు జ్ఞాన మార్గమంటే ఇష్టపడతాడో, జ్ఞానమును అనుభవించాలని ఆతృతపడతాడో, జ్ఞానము పేరు చెప్పగానే ఎవని శరీరము పులకరిస్తుందో, ఎవని మనస్సు ప్రేమతో పొంగుతుందో వాడికి మాత్రమే అరుణాచలమన్నా, అరుణాచల మహర్షి అన్నా ఆకర్షణ కలుగుతుంది.

అజ్ఞానము లేనిచోట మాత్రమే సుఖము ఉంటుంది. అజ్ఞానము రాగద్వేషముల రూపములో ఉంటుంది. అవి ఉన్నంతకాలం మనో నిర్మలత్వము కాని, మనో నిశ్చలత్వము కాని, మనో వికాసము కాని ఉండదు. రాగద్వేషముల నుండి విడుదల పొందుటకు అనుదినము శ్రమించి సాధన చెయ్యాలి. దానికి శక్తి అవసరము, ఉత్తములతో సహవాసము చేయుట వలన ఆ శక్తి లభిస్తుంది. జ్ఞానమే నిజమైన శక్తి. దానిని సంపాదించే ఉపాయము తెలుసుకుంటే అపాయము నుండి బయటపడవచ్చును.

## 24. స్వార్థం లేకుండా జీవించటమే తపస్సు

జిన్నూరు, మార్చి 27, 1985

స్వార్థమునకు మరొక రూపమే అహంకారము. స్వార్థము నుండి విడుదల కానివాడు దుఃఖము నుండి కూడా విడుదల కాలేడు. మానవుడిని ప్రకృతిలో బంధించేది కూడా స్వార్థమే. ప్రకృతిని

దాటలేనివాడు సత్యమును దర్శించలేడు. మనస్సు రూపములో ఉన్నది కూడా ప్రకృతే.

మనస్సులో ఉన్న దోషములను దాటలేనివాడు మనస్సును జయించలేడు. మనస్సునకు దాని మూలము తెలియబడితేనే కాని అది స్వార్థము నుండి బయటపడదు. స్వార్థపూరితుడిని జ్ఞానము వరించదు. స్వార్థ పిశాచమే ధనకాంక్షగా, కీర్తికాంక్షగా, అధికార కాంక్షగా రూపాంతరము చెందుచున్నది. స్వార్థము లేకుండా జీవించటమే తపస్సు. మానవుడికి దుఃఖ కారణము తెలిసే వరకు దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది.

మానవుని గమ్యం ఆనందమును సాధించుట మాత్రమే. మతములు కాని, దేవతలు కాని, సైన్సు కాని, టెక్నాలజీ కాని మానవుని గమ్యం కాదు. మానవుడు తన స్వరూపముగా ఉన్న సత్యమును, సౌందర్యమును దర్శించే వరకు ఆనందమును పొందలేడు. ఆనందం పొందుటకు తెలివి కంటే పవిత్రత ఎక్కువ సహకరిస్తుంది. మానవుడు పవిత్రుడగుటకు చేయు కృషి కంటే మించిన కృషి ఈ లోకములో గాని, పరలోకములో గాని లేనే లేదు. సంఘసేవ వ్యక్తి పవిత్రుడగుటకు సాధనగా ఉపయోగపడుతుంది. పవిత్రుడు కానివాడిని ప్రకృతి బంధించి పీడిస్తుంది. పవిత్రుడు కానివాడు జన్మ మరణ రూపములో ప్రవహిస్తున్న కాలచక్రములో కొట్టుకుపోతాడు. కాలానికి లోబడుతాడు, కామానికి లోబడుతాడు.

మానవుడికి మరణము వరమే కాని శాపము కాదు. మరణము స్నేహితుడే కాని శత్రువు కాదు. మరణము అంటే మార్పు. మార్పు లేకపోతే ప్రగతి లేదు. మరణము అంటే తెలియనంత కాలం మానవుడిని మరణభయం వెంటాడుతూనే ఉంటుంది. మానవుడు పరిణామము

పొందుటలో మరణము ఒక సంఘటన మాత్రమే. దేహమునకు మరణము రాకముందే తన స్వార్థమును జ్ఞానాగ్నితో కాల్చి బూడిద చేసుకొన్నవాడు ముక్తుడవుతాడు.

## 25. అజ్ఞానమే అన్ని అనర్థములకు మూలము

జిన్నూరు, ఏప్రియల్ 30, 1985

పూజలు, ప్రార్థనలు, జపాలు, ధ్యానములు మనస్సును పూర్తిగా అణచుటకు సహాయ సహకారములు అందిస్తాయి. మనస్సు పూర్తిగా అణగినవాడికి ప్రయత్నముతో పనిలేదు. జపం చేసేవాడికి జపి ఎవడో తెలియడం లేదు. మనోమూలం తెలియని వాడికి సృష్టి రహస్యం కూడా తెలియదు.

మనిషి యొక్క ప్రధమ వృత్తి, ప్రధాన వృత్తి మనస్సుపై అదుపు సాధించటమే. మనస్సును స్వాధీనం చేసుకున్న వాడికి శరీరాలతో గాని, లోకములతో గాని, దేవతలతో గాని పనిలేదు. రాగద్వేషములే మనో రూపములో కనిపిస్తున్నవి. మనస్సుకు రూపము లేకపోయినా ఏదో ఒక నామరూపమును ఆశ్రయించి జీవిస్తున్నది. రూపమును చింతించటమే దానికి ఆహారము. తన శరీరమే తాను కానప్పుడు తన శరీరముతో చూసే దేవతలు మాత్రము నిజము ఎలాగవుతారు?

అవినయము అజ్ఞానమునకు దారితీస్తుంది. లోకములో ఉన్న అన్ని సమస్యలకు అజ్ఞానమే మూలకారణము. అజ్ఞానమనే సమస్యను పరిష్కరించే వరకు లోకము సమస్యల నుండి బయటపడదు. లోకములో పనికిమాలిన వస్తువు మనలో ఉన్న అజ్ఞానము మాత్రమే. ఎంతమంది మహాత్ములు ఈ లోకం లోనికి దిగివచ్చినా అజ్ఞానం

ఉన్నంత కాలం ఈ లోకమును దుఃఖము నుండి దూరము చేయలేరు. లోపాలకు, దోషాలకు, రోగాలకు, శోకాలకు, అజ్ఞానమే మూలకారణము. అజ్ఞానికి శవ దృష్టే కాని శివదృష్టి ఉండదు. అజ్ఞానమును పోగొట్టుకొన్నవాడే మోక్ష సుఖమును పొందుతాడు. మోక్ష సుఖమే పూర్ణ సుఖము. అజ్ఞానమే దుఃఖము, జ్ఞానము సుఖము.

అజ్ఞానమును విడిచిపెట్టటమే నిజమైన త్యాగము, జపము, భక్తి. అజ్ఞానమే దురభ్యాసములుగా, దురలవాట్లుగా, కుయుక్తులుగా, కుతంత్రములుగా, కుచేష్టలుగా రూపాంతరము చెంది జాతిని పట్టి పీడిస్తున్నది.

సత్యాన్వేషకుడికి మాత్రమే అజ్ఞానము కాలి బూడిద అవుతుంది. సత్యాన్ని ఆధారముగా చేసుకొని జీవించేవాడికి మాత్రమే జ్ఞానోదయం అవుతుంది. సత్యము కంటే వేరుగా దేవుడు లేడు. మానవుడికి తన నిజమైన అస్థిత్వం తెలియనంత కాలం దేవున్ని గురించి కూడా తెలియదు.

## 26. జ్ఞాన ప్రదాత శ్రీ రమణాచార్యుడు

పాలకొల్లు, అక్టోబర్ 17, 1986

తాను బోధించినది ఆచరించి, ఆచరింపజేసేవాడు ఆచార్యుడు. శ్రీ రమణస్వామి జ్ఞానాచార్యుడు. లౌకిక ప్రయోజనాల కోసం ఆయనను దర్శించినవారికి కూడా జ్ఞానాభిలాష ఉదయించే టట్లు చేసేవాడు.

భారతీయ తత్త్వ శాస్త్ర సాంప్రదాయంలో గురువు శిష్యుడిని మూడు రకములైన దీక్షలతో అనుగ్రహిస్తాడు. మొదటిది చక్షుదీక్ష, రెండవది భావదీక్ష, మూడవది స్పర్శ దీక్ష

శ్రీ రమణేశ్వరుడు తనను దర్శించిన వారిని చక్షుదీక్ష ద్వారా అనుగ్రహించేవారు. గురువు యొక్క మాటకంటే, తలంపుకంటే మౌనమే శిష్యుని ఆధ్యాత్మికాభివృద్ధికి సహకరిస్తుంది.

అవినయము, అసహనము ఉన్న మనిషి జ్ఞాని బోధను గ్రహించలేడు. జ్ఞానము యొక్క విలువ తెలియని వానికి జ్ఞానం పట్ల అపేక్ష కలుగదు. ఆత్మజ్ఞానము స్వేచ్ఛను, ఉత్తమ సుఖమును ప్రసాదిస్తుంది.

కామ ప్రభావమునకు, కాల ప్రభావమునకు లోనవుతున్న మనిషి స్వతంత్రమును కోల్పోతాడు. మానవునిలో ఉన్న పాపము రాగముగా, భయముగా, క్రోధముగా, ద్వేషముగా వ్యక్తమవుతున్నది.

శాంతిలేనివాడు పాపముతో పోరాడలేడు. దేహబుద్ధి, ద్వైత బుద్ధి, సంసారబుద్ధి ఉన్నంతకాలం భయము, హింస వెంటాడుతూనే ఉంటాయి.

నిరాడంబరికి, నిరహంకారికి మాత్రమే స్వచ్ఛమైన బుద్ధి ప్రసాదింపబడుతుంది. లోకములో ఉన్న శోకము, బాధ, అశాంతి ఇవన్నీ మానవుని యొక్క అహంకారవే కల్పించినది. మానవుడిని అహంకారమనే జైలు నుండి విడిపించుటకు సహాయ సహకారములు అందించువాడే నిజమైన గురువు.

సృష్టికర్త అయిన ఈశ్వరుడు అందరి హృదయాలలోను అంతర్యామిగా ఉన్నాడు. ఆయనను దర్శించటమే మానవుని ధ్యేయము. ఈశ్వర దర్శనం అయ్యే వరకు ప్రకృతి విడిచిపెట్టదు. హృదయములో మనస్సును నిరోధించగలిగే మానవుడికి మనస్సులో ఉన్న దోషములన్నీ రాలిపోయి హృదయం యొక్క లోతులలోనికి దిగి అక్కడ చైతన్య

రూపములో ప్రకాశిస్తున్న ఈశ్వరుడిని దర్శిస్తాడు. అనంతస్థితిని అందుకొని ఆనంద సముద్రములో ప్రవేశిస్తాడు.

నియతేంద్రియుడు మాత్రమే తన అంతఃకరణాన్ని సంస్కరించుకోగలడు. ప్రతి మానవుడు సంస్కరణ అనేది తన దగ్గరే ప్రారంభించాలి. తాను ఎంతవరకు ససంస్కరింపబడతాడో అంత వరకు మాత్రమే సమాజమును సంస్కరించగలడు. కృత్రిమ జీవితమును విడిచిపెట్టి సమాజ సేవకు అంకితమైన వాడికి అహం కారం పల్చబడుతుంది.

అజ్ఞానము అహంకార రూపములోనే ఉన్నది. అహంకారమును త్యజించలేనివాడు వ్యక్తి భావనకు సంబంధించిన హద్దులను దాటలేడు. అహంకారమే సంసారం. అహంకారం లేకుండా పనిచేసే వాడికి దేహం ఉన్నా లేనట్లుగానే అనిపిస్తుంది. అహంకారమును కేంద్రముగా పెట్టుకొని జీవించేవాడికి సమదృష్టి కలుగదు.

పూజ, జపము, సేవ, ధ్యానము శుద్ధబుద్ధిని ప్రసాదిస్తాయి. శుద్ధ బుద్ధి మాత్రమే వ్యక్తి భావనను పోగొట్టి శాశ్వత జీవితమును ప్రసాదిస్తుంది. పవిత్రంగా జీవించేవాడికి వేగంగా బుద్ధి పక్వానికి వస్తుంది. నిర్మలమైన బుద్ధికి మాత్రమే సత్యవస్తువు దర్శనమిస్తుంది.

భోగదృష్టి నుండి జ్ఞాన సముపార్జనకు మానవ మానసమును మరల్చుటకు యోగము సహకరిస్తుంది. యోగం కలవాడే యోగి. జ్ఞానం కలవాడే జ్ఞాని. మోక్షం పట్ల అపేక్ష కలవాడు ముముక్షువు. జ్ఞానం పట్ల అపేక్ష కలవాడు జిజ్ఞాసువు. భక్తి కలవాడు భక్తుడు. మాధవుడిని మానవుడి దగ్గరకు తీసుకొచ్చేది భక్తి మాత్రమే.

విషయ కాముడు లౌకికమును దాటి వెళ్లలేడు. ఈశ్వర కాముడు మాత్రమే ఈశ్వర స్వరూపమును పొందుతాడు. ఆత్మ రూపములో ఉన్న

ఈశ్వరుడే నిజం. ఈ నిజం తెలుసుకొనేవరకు అబద్ధమే నిజముగా కనిపిస్తుంది.

మత బేధములు, రూప బేధములు, ఆర్థిక వ్యత్యాసములు, వర్గ బేధములు, కుల బేధములు ఇవన్నీ మనుష్యులు కల్పించినవి. సమత్వ దృష్టి కలవాడిని మాత్రమే ఆత్మజ్ఞానం వరిస్తుంది. అంతర దృష్టి లేనివాడు ఆత్మ సౌందర్యము చూడలేడు. నిజమైన ఆత్మకు వేరుగా ఈశ్వరుడు లేడు.

## 27. మనో మూలములోనే దేవుడు ఉన్నాడు

డిశంబరు 18, 1986

మోక్షమును సాధించుటకు మనోనిగ్రహము అత్యంత ముఖ్యం. పరిసరముల యొక్క ప్రభావమునకు లొంగనివాడు మాత్రమే మనస్సును స్వాధీనం చేసుకోగలడు. మనోమూలమును గ్రహించిన వాడికి శాంతి లభ్యమవుతుంది. సమదృష్టి కలుగుతుంది. మానవ మానసములోని చెడును యంత్రములు బయటికి తీయలేవు. జ్ఞానము ఒక్కటి మాత్రమే మనస్సును శుద్ధి చేయగలదు.

అహంకారం దెయ్యం లాంటిది. ఆ దెయ్యం దారి ఇస్తేనే గాని దైవం దర్శనం ఇవ్వదు. లోకసేవ గూడా దైవదర్శనమునకు సహాయ పడుతుంది. దైవమును గుర్తించని మానవుడిని హృదయములో కూడా దైవము ప్రకాశిస్తూనే ఉన్నాడు. దేవునికి పక్షపాతము లేదు. నిరంతరము మంచి గురించి ఆలోచిస్తూ మంచి చేసేవాడికి మాత్రమే జ్ఞానం యందు అపేక్ష కల్గుతుంది.

ఈశ్వరుడి మీద భారం వేసి నిజాయితీతో తన పనిని తాను చేసుకొనేవాడు యోగి అవుతాడు. పొట్టకోసం అహంవృత్తి లేకుండా

ఏ వృత్తి చేసుకొన్నా బుద్ధి, వాక్కు, ఇంద్రియములు నిర్మలం అవుతాయి. విచక్షణా శక్తి లేనివాడు వివేకమును పొందలేడు. దైనందిన జీవితం సరళంగా జరగాలంటే వివేకం అవసరం. వివేకమును కర్మాగారము ఉత్పత్తి చేయలేదు. సత్యమును ఆచరించే వాడికి వివేకము కలుగుతుంది. వివేకవంతుడు మాత్రమే ఆత్మ సామ్రాజ్యమునకు అధిపతి అవుతాడు. ఆత్మవిద్య తెలిసినవారిలో అగ్రగణ్యుడు భగవాన్ శ్రీ రమణ మహర్షి. సమానత్వము ఎలా ఉంటుందో ఆయనలో చూడవచ్చును. మానవజాతి చేసుకొన్న పుణ్యమునకు ఫలితముగా ఆయన ఈ లోకమునకు దిగివచ్చాడు. మరుగనపడిపోయిన జ్ఞాన మార్గమును ఆవిష్కరించాడు. భారత దేశ ఆధ్యాత్మిక ఆకాశమునకు శ్రీ రమణాచార్యుడు సూర్యుడు లాంటివాడు.

## 28. సత్యమును గ్రహించుటకు గ్రహణశక్తి అవసరము

చించినాడ, మే 12, 1987

మానవుడు మానసిక పీడనకు గురి కాకుండా ఉండాలంటే ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలి. సత్యమును గ్రహిస్తేనే కాని అసత్యమునకు దూరము కాలేడు. సహృదయుడగుటకు మాత్రమే సత్యము యొక్క వైభవము తెలుస్తుంది.

తలంపులకు తల్లి అహంకారం. దాని మూలము తెలియ బడితేనే కాని సత్యదర్శనము కాదు. సత్య సాక్షాత్కారమే జ్ఞానము.

శుష్కవాదమును హేతువాదము తీవ్రమైన వేగముతో ఖండించినదని అంత మాత్రము చేత సత్యాన్వేషణకు హేతువాదం ఒక్కటే చాలదు. మన బుద్ధికి అందని విషయములు హృదయమునకు మాత్రమే అందుతాయి.

గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి ఈ రెండు శక్తులు లేని మానవుడు జీవితం పొడవునా మూర్ఖుడిగానే ఉండిపోతాడు. సామాజిక స్పృహతో పనిచేసినవాడి బుద్ధికి సత్యమునకు దారి కనిఇస్తుంది. సత్యము స్వార్థమును కల్పించలేదు. మానవ మానసము మాత్రమే స్వార్థమును, ఆడంబరమును కల్పించి వాటి వలలో చిక్కుకు పోతుంది.

అబద్ధములు చెప్పటంలో పోటీపడుతున్న ఏ జాతి అయినా నిజమునకు, వెలుగుకు దూరమై చీకటిలోనికి, దుఃఖము లోనికి, ఆపదల లోనికి కూరుకుపోతుంది. దైనందిన జీవితములో ఆందోళనకు, అశాంతికి గురి అవుతున్న మానవుడు నిరాడంబ రముగా, నిర్మలముగా పనిచేయలేడు. మానసిక పొరలలో ఉన్న భయము నుండి, ద్వేషము నుండి మానవుని విడిపించుటకు తత్త్వ శాస్త్రము ఎంతగానో సహకరిస్తుంది.

ప్రవర్తన సరళముగా లేకపోతే మానసిక అనారోగ్యమునకు గురి అవుతాడు. దృష్టిని సరిచేసుకోలేపోతే సృష్టిని బాగుచేయలేరు.

సమాజ శ్రేయస్సు కోసం తమ స్వార్థమును సమూలముగా త్యజించినవారే జ్ఞానులు. జ్ఞాని పనిచేసినా, చెయ్యకపోయినా, మాట్లాడినా, మాట్లాడకపోయినా వారి అస్థిత్వము మాత్రము చేతనే సమాజము ఉద్ధరింపబడుతుంది. సత్యమునకు వేరుగా జ్ఞానికి అస్థిత్వము లేదు.

## 29. అజ్ఞానాన్ని తొలగించుటయే జీవిత గమ్యము

చించినాడ, సెప్టెంబర్ 30, 1987

దేహమునకు శక్తి అవసరము. దానిని ఆహారము ద్వారా సమకూర్చుకొంటున్నాము. మనోవికాసమునకు జ్ఞానం అవసరము.

దానిని ధ్యానము ద్వారా, విచారణ ద్వారా సమకూర్చుకోవాలి. గమ్యం తెలుసుకొని ప్రయాణం చెయ్యాలి. అజ్ఞానమును చంపటమే జీవిత గమ్యము. అజ్ఞానమును తొలగించుకోవాలనే వాంఛ మనస్సు లోపల పొరల నుండి వస్తేనే బలముగా ఉంటుంది.

ఈ మధ్యకాలంలో అవతరించిన మహనీయులలో శ్రీ రమణస్వామి ఒకరు. ఆయన బోధించినది విచారణా పద్ధతి. ఆయన జ్ఞాన మార్గమునకు నవ్యదృష్టిని చేకూర్చి దానిని అఖండము చేశారు.

ఆత్మవిచారణ చేసేవాడికి శాంతి కల్గుతుంది. లోకవిచారణ చేసేవాడికి అశాంతి కల్గుతుంది. మానవుడిని అజ్ఞానము నుండి విడుదల చేసి జ్ఞానమును కలుగజేయుటయే నాల్గు వేదముల యొక్క సారము. అజ్ఞానము ఉన్నంతకాలం వేరు భావన తప్పదు. దానిని తొలగించుకొనుటకు సమదృష్టిని అభ్యసించాలి. అదే యోగం.

స్వార్థము లేకుండా సామాజిక దృక్పథంతో పనిచేసేవాడి మనస్సు ఎంతో అందమును చేకూర్చుకొంటుంది. మనస్సులో అందము ఉంటేనే అది జీవితములో వ్యక్తం అవుతుంది. మానసిక నైర్మల్యమును సాధించినవాడు మాత్రమే తనలో ఉన్న అమృతస్థితిని అందుకొంటాడు.

నిజస్థితిని పొందేవరకు ప్రతి జీవిని శోకము వెంటాడుతుంది. నిజం మానవుని హృదయగుహలో ప్రకాశిస్తున్నది. నిజస్థితిని గ్రహించుటకు మనస్సును అంతర్ముఖం చెయ్యాలి. నిజమును గ్రహించుటకు సహాయ సహకారములు అందించువాడు మాత్రమే గురువు.

జ్ఞానమే ఐశ్వర్యము. దానిని సంపాదించే వరకు మనిషికి మోహం తెగదు. జ్ఞానం కలగనంత కాలం సత్యం అసత్యముగా, అసత్యం

సత్యముగా కన్పిస్తుంది. సత్యమును తెలుసుకొనుటకు శక్తి అవసరము. ఆ శక్తిని ప్రసాదించేది జ్ఞానం. సహజంగా, సరళంగా జీవించేవాడిని జ్ఞానం వరిస్తుంది. కలుషితము కాని దేశభక్తి, కలుషితము కాని దైవభక్తి ఈ రెండూ కూడా జ్ఞానమునకు దారి చూపిస్తాయి.

## 30. మతాలు వేరైనా గమ్యం ఒక్కటే

గుమ్ములూరు, అక్టోబరు 17, 1987

దేహములో ఉన్న వ్యాధిని తొలగించుకోవటం ఎంత అవసరమో మనస్సులో ఉన్న మాలిన్యమును తొలగించుకొనుట కూడా అంతే అవసరము.

మోక్ష మార్గములో ప్రయాణము చేయుటకు అవగుణములు అడ్డుగా ఉన్నవి. దైవమును స్మరించుట వలన, ప్రార్థించుట వలన, ధ్యానించుట వలన అవి పడిపోతాయి.

మనస్సును సంస్కరించుకోవటమే నిజమైన విప్లవము, మానవుడు ధనవంతుడైనా, పేదవాడైనా అజ్ఞానమును విసర్జించుటకు ప్రయత్నం చెయ్యాలి. అజ్ఞానమును తొలగించలేని విద్య విద్యయే కాదు. ఆత్మ విద్యను బోధించుటలో అతి సమర్థుడు శ్రీ రమణస్వామి. గురువు రమణుడు గురువులకు గురువు.

హృదయమును జ్ఞానమయం చేసుకోవాలి. అదే మోక్షం. జాతులు వేరైనా, మతాలు వేరైనా మోక్షము ఒక్కటే. అల్ప భావములను, స్వల్ప భావములను విడిచిపెడితే ఉన్నది మోక్షమే! మోక్షమంటే దుఃఖము లేని స్థితిని అందుకోవటం. ఆత్మను అను భవించిన వాడు ఆనందమయు డవుతాడు. అతనికి నిజం తెలుస్తుంది. అతని నాలుక మీద నిజం నిలుస్తుంది.

మతం వ్యాపారం కాదు. నిజమును దర్శించుటకు సహక రించునదే మతం. మత గ్రంథములు చెప్పిన మాటల లోతులకు దిగిచూస్తే తత్త్వం తెలుస్తుంది. తాత్త్విక దృష్టి కలవాడు సమాజము యొక్క ఆరోగ్యం కోసం పనిచేస్తాడు. అదే నిజమైన పూజ. పూజ, జపము, ధ్యానము వీటి ప్రయోజనము అహంభావనను తొలగించు కొనుటకు మాత్రమే. అహంభావము మిక్కిలి బరువైనది. దానిని భరించుట కష్టం. ఆ భారమును తొలగించువాడే ఆచార్యుడు.

జ్ఞానమును సంపాదించు లక్ష్యముతో పనిచేయాలి. అలా పనిచేయలేకపోతే చేసిన పని నేలపాలవుతుంది. జ్ఞానం కోసం మండే గుండెలో జ్ఞానోదయం అవుతుంది.

జ్ఞానులే జాతి భూషణములు. జ్ఞానం లేని జీవితం ప్రయోజనం లేని రచన లాంటిది. జ్ఞానమునకు మించినది జ్ఞానమే.

జ్ఞానులు మాత్రమే ప్రేమమయులు, వైరాగ్య మూర్తులు. వారి హృదయము నుండి కరుణ కురుస్తుంది. అది జాతిని ఉన్నత మార్గములో పయనించుటకు సహకరిస్తుంది.

జ్ఞానులే జాతిసారము. మానవ మానసమును అశాంతి నుండి విడిపించి వెలుగును చూపించేది జ్ఞానము మాత్రమే.

డబ్బు లేకపోతే భోగము లేదు. జ్ఞానము లేకపోతే మోక్షము లేదు. జ్ఞానమే జీవిత సర్వస్వము (గమ్యము).

## 31. మానవజాతికి గీతే మాత

కాపవరం, డిశంబర్ 10, 1987

భగవద్గీత గ్రంథములకు రాజు వంటిది. అది హిందువులకే కాకుండా మొత్తం మానవజాతికే మాత లాంటిది. అది ఒక శాఖా

గ్రంధము కాదు, అది జ్ఞాన సముద్రము. మానవుడు ఎలా జీవిస్తే జ్ఞానోదయం అవుతుందో అందులో విశదము చేయబడినది. భగవద్గీతలో భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి చెప్పిన సలహా, చేసిన హితోపదేశం మానవజాతి అంతా గర్వించతగిన సుభాషితం.

మనో నిగ్రహమును సాధించుటకు అనేక ఉపాయములు గీతలో ప్రతిపాదింపబడినవి. మానవజాతి పరిణామము యొక్క కొసగా ఉన్న మోక్షమును అందుకొనుటకు సహాయము చేయు శాస్త్రమే గీతా శాస్త్రము.

గీతను చదువుట వలన, చదివించుట వలన పుణ్యం వస్తుంది. జీవితమునకు ఎంతో సంతృప్తి, సంతోషము కలుగుతుంది. భౌతికమైన సంపదలు ఇవ్వలేని పరమశాంతిని గీతామాత ప్రసాదిస్తుంది.

పరిశుద్ధుడికి మాత్రమే గీత తన హృదయాన్ని యిస్తుంది. పవిత్రత, ప్రవీణత, వినీతత, ఏకాగ్రత ఇవన్నీ గీతను అర్థం చేసుకొనుటకు కావలసిన సామగ్రి. సత్యమును, తపస్సును అంటిపెట్టుకొనియున్న మానవుడికి ఆత్మజ్ఞానము లభ్యమవుతుంది.

అన్ని కోణములు వికసించిన మానవుడు సమాజ కళ్యాణము కోసము పాటుపడకుండా ఉండలేడు. ఆడంబరము లేకుండా మాట్లాడటం, వ్రాయటం, జీవించటం నేర్చుకొంటే దేహములో ప్రాణము ఉండగానే మోక్ష సామ్రాజ్యమునకు అర్హుడవుతాడు. శాంతి హృదయములో నుంచి ఊరేది కాని పైనుండి పోసేది కాదు.

తనను తాను సంస్కరించుకొనుటకు భక్తి ఉపయోగపడక పోతే అది రాక్షస భక్తి అవుతుంది.

మానవుడికి పరిస్థితులు అనుకూలముగా ఉన్నా, అననుకూలముగా ఉన్నా ఈశ్వరుడు మీద భారం వేసి జీవించటం నేర్చుకున్న

వాడు హింసా ప్రవృత్తికి దూరం అవుతాడు. శరీరం, మనస్సు కలిపితే మనిషి అవుతాడు. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యము కూడా అంతే ముఖ్యము. మనో వికాసమునకు ధ్యానము అత్యంత ముఖ్యము. శరీరమునకు స్నానము ఎటువంటిదో మనస్సునకు ధ్యానము అటువంటిది.

మానవుని శోకమునకు అతని మనస్సులో ఉన్న మలినములు కారణము. వాటిని బయటకు తోలుటకు సుగుణములు అవసరము. అట్టి సుగుణములు ఆర్జించుటకు గీతామాత మనకు ఎంతగానో సహకరిస్తుంది.

మనం చేసే మంచిపని అయిష్టంతో కాకుండా ఇష్టంతో చెయ్యాలి. దాని వలన మన మెదడుకు, హృదయమునకు సమన్వయం కుదురుతుంది. అట్టివాడు యోగి అవుతాడు. ఆసక్తి లేకుండా పనిచేసేవాడు దుఃఖమునకు దూరము అవుతాడు.

గీతను అనుదినము అధ్యయనం చేసేవాడిని మోక్ష సుఖం వరిస్తుంది.

అహంకారమును ప్రకటించుకోవటం భక్తి కాదు. నిరహంకార స్థితిని సాధించుటయే భక్తి!

## 32. మతిని బాగుచేసేది మతము

అర్ధవరం, మార్చి 19, 1988

మానవుడు ప్రగతి సాధించాలంటే విజ్ఞానము అవసరము. పరంపరగా వస్తున్న మూఢాచారములను విజ్ఞానము మాత్రమే నాశనము చేయగలదు.

మతిని బాగుచేసేది మతము కాని మనిషిని, మనిషిని దూరం చేసేది మతము కాదు. మతములో చెప్పబడిన మంత్రములు, పూజలు, జపములు మానవ సమాజమును పరిశుద్ధము చేయుటకు మాత్రమే. పవిత్రుడికి మనస్సు చలించదు. మనో నిగ్రహము ఉన్నవాడికి మంత్రములతో పనిలేదు. మంత్రాలు జపం చేసే జపికి నిజం తెలిస్తే మనస్సు శాంతిస్తుంది. నిజం తెలిసే రకు ఒక అబద్ధము నుండి మరొక అబద్ధమునకు తిరుగుతూ ఉంటాడు. నిజమును తెలుసుకొనుటకు కావలసిన ఇంద్రియ నిగ్రహమును, శాంత చిత్తమును సంపాదించుకోకుండా మంత్రములు, మతములు వలన నిజము తెలియబడదు.

ఉన్న వస్తువు ఒక్కటే, అదే ఆత్మ. దానితో కలిసి జీవించే వారికి అది తెలుస్తుంది. "నేను" అను తలంపు యొక్క మూలములో ఉన్నది చైతన్యమే కాని శూన్యము కాదు. దేహగతమైన "నేను" నుండి, మనోగతమైన "నేను" నుండి విడుదల పొందినవాడు ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహిస్తాడు. వాడికి మాత్రమే శాంతి దొరుకుతుంది.

మానవునిలో ఉన్న అశాంతికి కారణము అజ్ఞానము మాత్రమే, అదే పిశాచము, అదే మానవుడు అతిక్రమించవలసిన పెద్ద ఆటంకము. బాహ్యమైన ప్రతిష్ఠ కోసం కాకుండా సత్యాన్వేషణకు మాత్రమే సాధకుడు కృషి చేయాలి. నిజమైన ఆత్మ గురించి తెలుసుకొనుటకు శ్రవణం చేయాలి. ఆత్మను గురించి ఇష్టమును పెంచుకోవాలి. సత్యాత్మను తెలుసుకొనుటకు దానిని విశ్వసించటం అవసరం. సత్యమును తెలుసుకొనుట జ్ఞానము. సత్యము తెలియక పోవటం అజ్ఞానము. జ్ఞానమే మోక్షము.

## 33. సత్యసాక్షాత్కారమే జీవిత గమ్యం

సత్య సాక్షాత్కారం మాత్రమే జీవితం యొక్క గమ్యం. తన హృదయములో నిరంతరము ప్రకాశిస్తున్న సత్ పదార్థమును దర్శించు టకు మానవ మానసము అంతర్ముఖం కావాలి, సుగుణములు వలన మనస్సు శుద్ధి కలుగుతుంది. మనస్సుద్ధి లేకుండా మానవుడు పరిపక్వము కాలేడు. మాధుర్యముతో నిండిన మనస్సు మాత్రమే అంతర్ముఖమై సత్యాత్మను దర్శిస్తుంది. సత్యాన్వేషణమే జీవిత సారము.

మానవుని బుద్ధి సత్యమును గ్రహించేవరకు ఒక సత్యం నుండి మరొక అసత్యమునకు, ఒక బలహీనత నుండి మరొక బలహీనత లోనికి ప్రయాణము చేస్తూ ఉంటుంది. సత్యమే జ్ఞానము. జ్ఞానమే మోక్షము. జ్ఞాని శక్తి వ్యక్తిగతమైనది కాదు. అది అనంతమైనది. జ్ఞాని ద్వారా సమాజములో కళ్యాణము జరుగుతుంది.

పవిత్రత, ప్రవీణత, ఏకాగ్రత లేనివాడు జ్ఞాన మండలంలో ప్రవేశించలేడు. అజ్ఞాని దేహమునకు మాత్రమే పరిమితమై ఉంటాడు. అందువలన అతనిని భయము, కోరిక పెనవేసుకుంటాయి. అజ్ఞానమును త్యజించలేకపోతే ఈనాటికైనా, ముందునాటికైనా జ్ఞానోదయము కాదు. జ్ఞాన సముపార్జన అత్యంత ముఖ్యము. అది లేని జీవితము వ్యర్థము. జ్ఞాని యొక్క ప్రాణశక్తి ఆధ్యాత్మిక శక్తిగా పరిణమించి లోకమునకు వెలుగు చూపిస్తుంది.

## 34. రక్షణ ఇచ్చేది రామాయణం

శృంగవృక్షం, ఏప్రియల్ 2, 1988

ఎన్నో గృహస్థ ధర్మములను చెప్పిన గ్రంథం రామాయణం. జీవితానికి రక్షణ కల్గించే గ్రంథం రామాయణం.

దేశ సమైక్యతకి రామాయణం ఉపయోగపడుతుంది. ధర్మ, అర్థ, కామ, మోక్ష స్వరూపములను వివరించిన సాహిత్యక్షేత్రం రామాయణము. ఎలా జీవిస్తే మానవుడు పవిత్రుడు అవుతాడో అలా జీవించి చూపాడు శ్రీరాముడు.

రామకథను అనుదినం పారాయణం చేసి సంతోషించిన వాడికి సహృదయం చేకూరుతుంది. లక్ష్మణస్వామి జితేంద్రియుడైతే, రామస్వామి అతేంద్రియుడు. జ్ఞానమే రాముడై వెలిగింది. రాముని రూపము కంటే ఆయన నామము గొప్పది. రామ నామం జపించి జాతిపిత బాపూజీ అభయస్థితిని పొందాడు.

సీతారాముల జీవితము ప్రేమకథ, ప్రేమలో దైవప్రేమ, భక్తిలో దేశభక్తి ఆదర్శవంతమైనది. తోటి మానవుడి అభివృద్ధికి ఏ పనిచేసినా అది కళ్యాణము అవుతుంది. చెడును త్యజించి మంచి కోసం పనిచేస్తే మానవుడు ఆత్మారాముడులో లీనమౌతాడు. రాముడు త్యాగమయ జీవితం గడిపాడు. ఎన్నో కష్టములను సహనముతో భరించాడు. కష్టములు మానవుడిలోని బలహీనత లను బయటికి తీసుకొనివచ్చి మంట పెట్టుటకు ఉపయోగపడతాయి. మానవుడికి సహజపరంగా వచ్చే బాధల కంటే తన తలంపులలో ఉన్నలోపముల వలననే అధికమైన నష్టములకు, కష్టములకు, బాధలకు గురి అవుతాడు.

## 35. ఈశ్వర దర్శనమే యోగం

వడ్లవానిపాలెం, జూన్ 7, 1988

ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడో అది ఆయనే చెప్పాడు. ఈశ్వరుడు అందరి హృదయములలోను ఆత్మగా ప్రకాశిస్తున్నాడు. మనస్సును

అంతర్ముఖం చేసి హృదయ నివాసియైన ఈశ్వరుడిని దర్శించటమే యోగము.

రాగద్వేషములనుండి, ఇంద్రియముల నుండి విడుదల పొందిన మనస్సు మాత్రమే అంతర్ముఖం అవుతుంది.

కష్టసుఖములు కళ్లకు కనిపించకపోయినా మనస్సుకు తెలుస్తుంది. అదే విధముగా ఈశ్వరుని యొక్క స్వరూపం కళ్లకు కనిపించకపోయినా పరిశుద్ధమైన హృదయము కలవాడికి ఈశ్వరుడు తన స్వరూపముగానే అనుభవమవుతాడు.

ఈశ్వర దర్శనమునకు తెలివి ఒక్కటే చాలదు. ఏకాగ్రత, పవిత్రత అవసరమై ఉన్నది.

నేటి యుగమునకు కర్మయోగము అవసరము. స్వార్థము నుండి, సంకుచిత హృదయము నుండి విడుదల పొందుట మాత్రే యోగము. యోగము యొక్క సహాయము లేకుండా మానవుడు శాశ్వత శాంతిని పొందలేడు.

ఈశ్వరుడు పరమశాంతి రూపములో తన హృదయములోనే ప్రకాశిస్తున్నప్పటికి జ్ఞానము లేనివాడు దానిని అందుకోలేడు.

అహంకార రూపములో ఉన్న అజ్ఞానము పంచభూతములలో ఒకటైన నీటిలో కరగదు. కాని జ్ఞానగంగలో మాత్రము సమూలంగా కరుగుతుంది.

మానవుడికి సుఖం కావాలి. శాస్త్ర సహాయంతో, గురువు సహాయంతో, నిరంతర సాధనతో, ఈశ్వరానుగ్రహంతో ఎవరైతే అజ్ఞనమనే తెరను తొలగించుకున్నారో వారికి సుఖము స్వరూపము గానే వ్యక్తమవుతుంది.

స్వరూప సుఖము రుచి చూచిన మనస్సు బహిర్ముఖము అగుటకు అవకాశము లేదు. అతనిని ప్రకృతి బంధించలేదు. ప్రకృతి నుండి విడుదల పొందినవాడు లోకమును గాని, ఈశ్వరుని గాని తనకంటే వేరుగా చూడడు. అందువలన వరములు అడగడు.

అజ్ఞానికి తన శరీరము, మనస్సు మాత్రమే అనుభవంలో ఉంటాయి. జ్ఞానికి తన స్వరూపమైన ఈశ్వరుడు అనుభవంలో ఉంటాడు.

ఈశ్వరుడు తనకంటే వేరుగా ఉన్నాడు అను భావన ఉన్నంత కాలము మానవుడు భక్తి పేరు మీదుగా వ్యాపారము చేస్తూనే ఉంటాడు.

## 36. వ్యాస పూర్ణిమ ఉత్సవం (గురు పౌర్ణమి)

చించినాడ, ఆగష్టు 21, 1988

గురువు అంటే జ్ఞానం. అందరి గురువుల యొక్క సారమే వేదవ్యాసుడు. అందువలన వ్యాస పూర్ణిమను గురుపూర్ణిమగా నిర్ణయించడమైనది.

ఆత్మను దర్శించినవాడే జ్ఞాని. జ్ఞాని మాత్రమే భగవంతుని యొక్క స్వరూపమును పొందుతాడు. జ్ఞాని నిజమైన సుఖి. జ్ఞాన సంపదకు సహృదయము ఉన్న మానవులందరూ వాటాదారులే.

గురురూపంలో ఉన్న జ్ఞానిని ఆశ్రయించి అజ్ఞానమును తొలగించుకొనవలెను. అజ్ఞానము అహంకార రూపములో ఉంటుంది. అహంకార భావన మానవుడిని బంధిస్తుంది. ఈ బంధం నుండి మానవుడిని విడిపించినవాడే నిజమైన గురువు.

చంద్రుడి యొక్క కిరణములు శరీరమునకు మాత్రమే చల్ల దనము నిస్తాయి. కాని గురువు యొక్క చల్లని చూపులు శరీరమును మాత్రమే కాక హృదయమునకు కూడా చల్లదనమును చేకూరుస్తాయి.

ఎవరి సమక్షంలో నివశిస్తే దుర్గుణమలు దూరము అవుతాయో, శాంతి కల్గుతుందో, ఆత్మవిద్యకు అర్హుడవుతాడో వారు మాత్రమే సద్గురువులు. అజ్ఞానము నుండి విడిపించి జ్ఞానమునకు దారి చూపించలేనివాళ్ళు గురువులు కాదు, బరువులు మాత్రమే.

లోకమునకు సూర్యుడు ఏ విధముగా వెలుగునిస్తున్నాడో అదే విధముగా జ్ఞాని మానవుడిలో ఉన్న అంధత్వాన్ని బయటికి తోలి హృదయానికి వెలుగును ప్రసాదిస్తున్నాడు.

సర్వవాంఛలకు, లోపములకు, పాపములకు, బలహీనతలకు అజ్ఞానము కారణం. అజ్ఞానమును త్యజించలేనివాడు జ్ఞాని కాలేడు. సామాన్య మానవుడు అజ్ఞానమును ఇష్టపడతాడు. అతడు ఇష్టపడే అజ్ఞానమే అన్ని అనర్ధములను తెచ్చిపెడుతుంది. రాగ ద్వేషములకు కారణం అజ్ఞానమే.

అహంకారికి జ్ఞానం యొక్క విలువ తెలియదు. అందుచేత దానిని సముపార్జించుటకు ప్రయత్నం చేయడు. అహంకార భావన లేకుండా రచనలు చేస్తే, మాటలు మాట్లాడితే, చేతులు తోటి పనిచేస్తే ఈ భూమిమీద, శాంతి సామ్రాజ్యమును నెలకొల్పవచ్చును. మనుష్యుల యొక్క దుఃఖాగ్నిని ఆర్పుటకు ఈ భూమి మీదకి దిగి వచ్చిన గురువులు మాత్రమే మహాగురువులు.

# 37. జ్ఞాన సముపార్జన మాత్రమే ఘనకార్యము

గుమ్మలూరు, సెప్టెంబరు 26, 1988

మానవుడు జీవ లక్షణములను త్యజించాలి. వాటిని నిర్దాక్షిణ్య ముగా నిర్మూలించకపోతే మానవుడు జ్ఞానములో ఎదగలేడు. బ్రహ్మానందం పొందాలంటే అజ్ఞానమనే గృహము నుండి బయటికి రావాలి.

మన హృదయానికి హృదయముగా, ఆలోచనకు ఆలోచనగా, ప్రాణమునకు ప్రాణముగా, కంటికి కన్నుగా ఉన్న ఈశ్వరుని పట్ల ఇష్టమును పెంచుకోవాలి. ఈశ్వరుడు పట్ల అత్యంత భక్తి అలవర్చు కొంటే రాగద్వేషముల నుండి, కృత్రియ గౌరవము నుండి విడుదల పొందవచ్చును. అట్టివాడు భయము యొక్క కోరలను గూడా తొలగించగలడు. అభయస్థితిని పొందినవాడు మాత్రమే అమృతత్వమును అందుకోగలడు.

వివేకమును పెంచుకొనుటకు సహనము అవసరము. వివేక వంతుడై జీవించేవాడికి మాత్రమే అమృతద్వారము తెరువ బడుతుంది. వివేకమే నిజమైన సంపద.

ఆధ్యాత్మికంగా వికాసము లేని సమాజమునకు ఎన్ని భౌతిక సంపదలు ఉన్నా అవి మేలు కంటే కీడు ఎక్కువ చేస్తాయి. ఆత్మ జ్ఞానమును సంపాదించుట కంటే ఘనకార్యము మరొకటి ఈ లోకంలో లేదు.

మానవుని ఆలోచనాశక్తి బాహ్యముగా ఎంత దూరము దూసుకుపోయినా ఆ ఆలోచన పుట్టుచోటు తెలియకపోతే వాడు అశాంతి నుండి, ఆందోళన నుండి విడుదల పొందలేడు.

మానవుని స్వరూపము కంటే ఈశ్వరుడు భిన్నంగా లేడు. ఈ సత్యమును అనుభవంలోనికి తెచ్చుకున్నవాడిని మోక్షము వరిస్తుంది.

ఎక్కడ మంత్రాలు, తంత్రాలు లేవో, ఎక్కడ శాస్త్రాలు, గురువులు లేరో, ఎక్కడ దేవతలు లేరో, ఎక్కడ పాలితులు లేరో ఎక్కడ ఇష్టాలు అయిష్టాలు లేవో అక్కడ మోక్షము ఉన్నది. మోక్ష సుఖమునకు మించిన సుఖము ఈ లోకములో కాని, పరలోకములో కాని లేదు. దేహమునకు మాత్రమే పరిమితమైన బుద్ధికి మోక్షసుఖము అందదు.

దేహబుద్ధి దుఃఖాన్ని తీసుకొనస్తుంది. ఆత్మబుద్ధి ఆనందాన్ని వర్షిస్తుంది. సత్యాన్వేషకుడు మాత్రమే చిత్తమును సరిచేసు కొంటాడు.

## 38. అజ్ఞానం నశించిన చోట సమత్వం ఉదయిస్తుంది

పాలకొల్లు (జిన్నూరు), ఫిబ్రవరి 7

ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా మానవుడు మంచి నడత గాని, నిర్మల హృదయము గాని సాధించలేడు. అజ్ఞానము నశించకుండా సమానత్వం సాధ్యం కాదు. అజ్ఞానం అంతా అహంకార రూపములో ఉన్నది.

సమత, మమత లేనివాడు చైతన్యస్థాయి పెంచుకోలేడు. భేద బుద్ధి నశించేవరకు మానవుడు హింసాప్రవృత్తి నుండి విడివడలేడు.

తనను తాను సంస్కరించుకోలేని మానవుడు ఇతరులను కూడా సంస్కరించలేడు. సంస్కారం, సభ్యత, మంచితనం, మర్యాద లేని మానవుడు ఇతరులకి దుఃఖాన్ని కోరుతాడు.

శవబుద్ధి నశించిన వెంటనే శివబుద్ధి కలిగి ఆత్మానుభవం పొందుతాడు. ఆత్మానుభవమునకు మించిన లాభము లేదు. తన

అర్హతను, తన స్థితిని, తన యోగ్యతను తెలుసుకోకుండా ప్రవర్తించే మానవుడి ద్వారా సమాజనమునకు చిక్కులు, గొడవలు వస్తాయి. దురలవాట్లు, దురభ్యాసాలు పోగొట్టుకోలేకపోతే మానవుడికి తన హృదయములో ఉన్న నిజం కూడా గోచరించదు. ఆ నిజాన్ని కూడా పట్టుకొంటేనే కాని వాడి అశాంతి నశించదు. అశాంతి నశిస్తే జీవితం శోభిస్తుంది.

## 39. అజ్ఞానమే బంధము

జిన్నూరు, సెప్టెంబరు 23, 1985

భగవంతుని అనుగ్రహం కోసం జీవుడు జరిపే పోరాటమే సాధన. త్రికరణశుద్ధిగా సాధన చేసి నిరాడంబరముగా జీవిస్తే పూర్ణస్థితిని అందుకోవచ్చు. మానవుడు శనిగ్రహం నుండి బయట పడడానికి పూజలు చేస్తున్నాడు. కాని అజ్ఞానం అనే గ్రహం నుండి బయటపడుటకు ప్రయత్నం చేయుట లేదు. అజ్ఞానమే రోగముగా, దుఃఖముగా, బాధగా పరిణమిసున్నది.

జ్ఞానయోగం శ్రవణం చెయ్యటానికి కూడా మానవుడికి అర్హత, అధికారం ఉండాలి. అన్ని పనులలోనికి మనోనిగ్రహమే ముఖ్యమైన పని. మనస్సును నిగ్రహించుకొనలేనివాడు ప్రకృతిని అతిక్రమించ లేడు.

తాను శరీర మాత్రుడనేనని అజ్ఞాని ఎంత సహజంగా అనుకొంటాడో, తాను ఆత్మనని జ్ఞాని కూడా అంత సహజంగా అనుకొంటాడు.

మరణం వలన దేహంతో సంబంధం తెగిపోయినా మానవుడికి అహంకారంతో ఉన్న సంబంధం తెగదు. అహంకారం అంతమైతేనే అమృతస్థితిని పొందుతాడు. మానవుడు తనకి అజ్ఞానం మీద ఉన్న అభిమానం పూర్తిగా త్యజిస్తేనే గాని జ్ఞానం కలుగదు. సత్య స్వరూపమును దర్శించటమే జ్ఞానము.

## 40. నేటి ప్రపంచముకు కావలసినది జ్ఞానమతము

బల్లిపాడు, అక్టోబరు 21, 1988

నేటి ప్రపంచమునకు కావలసినది జ్ఞానమతము జ్ఞానోదయమునకు దారి చూపించేదే మతం. మతిని బాగుచేసేది, గతిని చూపించేదే మతం. మానవుడిని పవిత్రుడిని చేయుటకు మతం యొక్క సహాయము అవసరము.

హిందూ మతములో కులానికిస్తున్న ప్రాముఖ్యత మతానికి ఇవ్వడం లేదు. మతం పేరు మీద పూజలకు, మంత్రాలకు, తంత్రాలకు విలువ ఇవ్వడం కంటే మానవునిలో వివేకము కలుగుటకు, దైవ సంపదను వెతుక్కొనుటకు ప్రాముఖ్యత ఇవ్వాలి.

అన్ని మతముల గమ్యము సత్యమును తెలుసుకొనుటే, అందు వలన మతము మార్చుకోవలసిన అవసరము లేదు. పవిత్రత లేని వ్యక్తి సృష్టిని ప్రేమించలేడు. ప్రేమలేని జీవితము వ్యర్థము. దైవభక్తి దేశభక్తి మనిషిని పరిపూర్ణ స్థితికి చేర్చుటకు సహకరిస్తాయి. పరి పూర్ణత్వమే మోక్షము.

సత్యము మానవుని హృదయములో ప్రకాశిస్తున్నది. హృదయము అన్వేషిస్తే సత్యము అందుతుంది. ఈ అన్వేషణమును పురికొల్పుటయే అన్ని మతముల సారము. మతము మార్గమే కాని గమ్యము కాదు.

మానవుడు పనిచేయుటకు శక్తి అవసరము. శక్తి లేకపోతే సృష్టి లేదు. అందువలన భారతీయులు శక్తికి దేవి రూపము కల్పించి ఆరాధిస్తున్నారు. ఈ శక్తి సహాయంతోనే మానవుడు ఆనందమును తన స్వరూపముగా పొందుతున్నాడు, దుఃఖము లేని స్థితిని పొందుతున్నాడు. గతమును గురించి గర్వించుట కంటే వర్తమాన కాలములో సజీవముగా జీవించే శక్తి అవసరము.

అసుర సంబంధమైన గుణములతో పోరాడి వాటి మీద విజయమును సాధించుటకు సంకేతముగా విజయదశమి పర్వ దినము ఏర్పడినది. ఈ పండుగ దేశము యొక్క నలుమూలల భారతీయులు ఎంతో ప్రేమతో జరుపుకొంటారు. దేశము యొక్క సమైక్యతకు, సమగ్రతకు, సంపదకు ఈ పండుగ ప్రతిరూపముగా ఉన్నది.

అజ్ఞానమే దురాచారముల రూపములో ఉన్నది. అజ్ఞానమనే భూతము నుండి విడివడలేకపోతే వ్యక్తికి గాని, సంఘమునకు గాని ప్రగతి లేదు. అజ్ఞానము అస్తమించిన వెంటనే జ్ఞానోదయము అవుతుంది.

## 41. జ్ఞానసంపదకు సహృదయులందరూ వాటాదారులే

లంకలకోడేరు, నవంబరు 21, 1988

జ్ఞానం పట్ల ఆశ, ఆకర్షణ, ప్రేమ కలవాడు మాత్రమే అజ్ఞాన బంధం నుండి బయటపడతాడు. జ్ఞాన సంపదకు లోకములో ఉన్న సహృదయులందరూ వాటాదారులే! త్యాగం చేయలేని వాడికి జ్ఞానము లేదు. శాంతి లేదు.

మానవుడు స్వతంత్రముగా ఆలోచించుటకు, నిదానముగా జీవించుటకు అభయస్థితి అవసరము. దైవమును దర్శించేవరకు మానవుడికి భయము వెంటాడుతూనే ఉంటుంది. దైవములో భయము లేదు. అందువలన దైవ సాక్షాత్కారము పొందినవాడికి మాత్రమే భయము ఉండదు. భయమునకు కారణం అజ్ఞానం.

దేహగతమైన రోగములకు, మనోగతమైన రోగములకు మూలకారణం అజ్ఞానం. సాపేక్షికమైన జ్ఞానం వల్ల కాకుండా కేవలము ఆత్మజ్ఞానము వల్ల మాత్రమే అన్ని వ్యాధులకు మూలముగా ఉన్న అజ్ఞానం నశిస్తుంది. ఆత్మజ్ఞానం ధీరులను మాత్రమే వరిస్తుంది. భయస్తులకు, బద్ధకస్తులకు, బలహీనులకు ఆత్మజ్ఞానం అందదు.

శాంతి లేనివాడు, ప్రేమలేనివాడు అజ్ఞానముతో పోరాడలేడు. అజ్ఞానం సుజ్ఞానముగా కనిపిస్తున్నంత కాలం మనిషి కలవరపాటు నుండి తొట్రుపాటు నుండి, ఆందోళన నుండి, ఆవేశము నుండి, అశాంతి నుండి విడుదల కాలేడు. అజ్ఞానము అతి బలహీనమైనది. అది అహంకార రూపములో ఉంటుంది. దానిని అణచుటకు ఎంతో ధైర్యముతో పాటు దైవ సహాయము కూడా అవసరము. ఎన్ని భోగములు అందుబాటులో ఉన్నా నిగ్రహము లేకపోతే సుఖములేదు. పరమాత్మ వైపు తిరిగి ఉన్న మనస్సుకి కష్టం, కష్టంగా కనిపించదు. విశ్వాసము, హేతువాదము ఈ రెండూ కూడా మనస్సు సంపూర్ణము అగుటకు సహకరిస్తాయి.

## 42. మనోజయమునకు గీతలో ఎన్నో సాధనలు చెప్పబడినవి

కాపవరం, డిశంబర్ 21, 1988

అర్జునుడు అసూయ లేనివాడు, అందువలన భగవంతుడు భగవద్గీతను అర్జునుడికి బోధించాడు. భగవద్గీత గ్రంథములకు రాజు ప్రపంచములో ఇంత కీర్తి పొందిన గ్రంథము లేదు. హిందువులకే కాకుండా మొత్తము మానవజాతికే మాత లాంటిది.

దైనందిన జీవితములో మానవుడు ఎలా ప్రవర్తించాలో సరళంగా, సహజంగా, సూటిగా గీతాశాస్త్రములో చెప్పబడినది. మనో జయమునకు గీతలో ఎన్నో సాధనలు ప్రతిపాదింపబడినవి. గీతను చదవడం, చదివించడం జ్ఞాన యజ్ఞం అవుతుంది. అనుదినము భారత యుద్ధము మానవ హృదయములో జరుగుతూనే ఉన్నది. మంచికి, చెడుకి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో దైవసహాయం ఉన్నవారికి మంచి జయిస్తుంది.

అందరి హృదయములలోను ప్రకాశిస్తున్న ఈశ్వరుడిని ఆరాధించే వారికి శక్తి కలుగుతుంది. శక్తి ముక్తినిస్తుంది. ముక్తిని సాధించేవరకు మానవుడు అజ్ఞానము నుండి, అశాంతి నుండి, ఆందోళన నుండి విడుదల కాలేడు. మంచితనము ఆత్మ జ్ఞానమునకు పునాది వంటిది. శాంతి ఆత్మలో ఉంది. ఆత్మ విచారణ చేస్తే ఆత్మానుభవం అవుతుంది.

ఆత్మకంటే భిన్నంగా సుఖము లేదు. ఆత్మకంటే వేరుగా అమృతం లేదు. అమృతానుభవం పొందినవాడు శీతోష్ణముల మధ్య, మానావ మానముల మధ్య ఊగిసలాడడు, దేహాత్మవాది నిరహంకార స్థితిని సాధించలేడు, తన అస్థిత్వమును దేహమునకే పరిమితము చేసుకొని స్వేచ్ఛను, సమత్వమును కోల్పోతున్నాడు.

మానవుడు "నేను" అని అంటాడు, ఆ "నేను" యొక్క మూలం తెలియకపోవుట వలననే ఇంద్రియముల చేత, అజ్ఞానముచేత, అశాంతి చేత పీడింపబడుచున్నాడు. దుఃఖము లేని స్థితికి ఎదగటమే జీవిత లక్ష్యము.

శీలము అనే సంపదను సంపాదించువాడికి జ్ఞానోదయం అవుతుంది. జ్ఞాని లోకమును ప్రేమిస్తాడు కాని కామించడు. జ్ఞాని యొక్క ఆనందం బాహ్యపదార్థముల మీద, వ్యక్తుల మీద, విషయముల మీద ఆధారపడి ఉండదు.

జ్ఞానిలో లోకము లయమవుతుంది, అందువలన అతనికి ఆసక్తి గాని, ద్వేషము గాని, భయము గాని, క్రోధము గాని ఉండదు.

ప్రశాంత చిత్తము జ్ఞానమునకు ద్వారము వంటిది. ఎన్ని దుఃఖములు వచ్చినా శాంత చిత్తమును సాధించినవాడు నిర్వికారం గానే ఉంటాడు, మోహమునకు గురికాడు.

## 43. కుల, మతముల ఆకర్షణకు లోబడినవాడు సమాజమునకు న్యాయం లేకూర్చలేడు!

గుమ్ములూరు, డిశంబరు 31, 1988

కులము యొక్క ఆకర్షణకు, మతము యొక్క ఆకర్షణకు లోబడినవాడు సమాజమునకు న్యాయము చేకూర్చలేడు. అహం భావమును దూరముగా విడిచిపెట్టి సమాజసేవకు అంకితమైన వాడు మాత్రమే న్యాయం చేకూర్చగలడు. వాడే కర్మయోగి అవుతాడు.

జ్ఞానము యోగులకు అందుతుంది కాని సోమరులకు అందదు. జ్ఞానమును ఆర్జించటం కంటే జీవితములో ముఖ్యమైన పనిలేదు. మరుగున పడిపోయిన జ్ఞాన మార్గమును పునరుద్ధరించుట కొరకు భగవాన్ శ్రీ రమణ మహర్షి ఈ లోకంలో అవతరించారు. ఆయన చెప్పదలచినవి మాటల ద్వారా కంటే మౌనం ద్వారానే ఎక్కువ బోధించేవారు.

పరిసరముల పారిశుధ్యం ఎంత ముఖ్యమో భక్తిలో కూడా అంత పరిశుద్ధత అవసరము. భక్తిని ఆధారము చేసి స్వచ్ఛముగా జీవిస్తే జీవితములో యోగ్యత పెరుగుతుంది. భౌతికమైన వాంఛలతో సంబంధము లేని భక్తుడికి భగవంతుని స్వరూపం దొరుకుతుంది. అహంకారమునకు చోటివ్వని వాడు భక్తుడు అవుతాడు. భక్తి సమతకు

దారి చూపిస్తుంది. సమత జీవితానికి సొమ్ము వంటిది. భక్తి లేకపోతే జ్ఞానోదయం కాదు. ఆత్మజ్ఞానము అత్యంత ముఖ్యము. జ్ఞాని కానివాడు స్వార్థము నుండి, అహంభావము నుండి, దుఃఖము నుండి, ద్వేషము నుండి విడుదల కాలేడు.

ఋషి అంటే దేహమాత్రుడు కాడు. అందరి హృదయములలో చైతన్యరూపంలో ప్రకాశిస్తున్న ఆత్మ మాత్రమే ఋషి. ఇంద్రియములను నిగ్రహిస్తే, మనస్సు యొక్క చలనమును ఆపు చేస్తే, హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మ అవగతమవుతుంది. అదే మోక్షం. మోక్ష సామ్రాజ్యమునకు అందరూ వారసులే, అందరూ రాజులే. బంధము నుండి బయటపడుట వలన మోక్షం వస్తుంది. కాని దేహము నశించుట వలన మాత్రం రాదు. సత్యమును అభ్యాసము చేసి అనుభవము లోనికి తెచ్చుకొన్నవాడిని మోక్షసుఖం వరిస్తుంది.

అసత్యము నుండి విడుదల పొందినవాడు మాత్రమే సత్యమునకు దారి చూపించగలడు. పుస్తకములలోను, దేవాలయముల లోను, యాత్రాస్థలములోను వెతికినంత మాత్రం చేత సత్యం కనిపించదు. మానవుడి హృదయంలోనే సత్యము ప్రకాశిస్తున్నది, కాబట్టి హృదయములో వెదికితే అది దొరుకుతుంది. దేహము లేనివాడు లోకమును ఎలా చూడలేడో అదే విధముగా హృదయము లో ఆత్మను దర్శించలేనివాడు జ్ఞానమును పొందలేడు.

అహంవృత్తి పోకుండా సత్యమును సాక్షాత్కరించుకోవాలనుకోవటం అన్నము ఖర్చు అవ్వకుండా ఆకలి తీర్చుకోవటం లాంటిది. కామమును విడిచిపెట్టకుండా నిష్కామ స్థితిని, అహంకారమును విడిచిపెట్టకుండా నిరహంకార స్థితిని మానవుడు సాధించలేడు. దైవానుగ్రహము శక్తివంతమైనది. దాని సహాయముతోనే మానవుడు నిజస్థితిని పొందాలి.

# 44. శాంతి కుదిరితే సంఘములో శక్తిని స్థాపించవచ్చును

పాలకొల్లు, ఏప్రియల్ 1, 1989

వస్త్రములు, పరిసరములు మార్చుకొన్నంత తేలికగా మానవుడు తన స్వభావమును మార్చుకోలేడు.

మానవ మానసమునకు మంచితనము విలువ తెలిసేవరకు సామాజిక రుగ్మతలు ఉంటూనే ఉంటాయి. సోమరితనమును, స్వార్థమును త్యజించి కర్మను ఆచరిస్తే మానవునకు నిర్మలత్వం కలిగి స్వభావములో మార్పు వచ్చి జ్ఞానం కలుగుతుంది, శాంతి కుదురుతుంది. శాంతి లేనివాడు లోకకళ్యాణమునకు కృషి చేయలేడు. సంఘములో శక్తిని స్థాపించలేడు.

ప్రపంచములో ఏ దేశమునకు వెళ్ళి చూసినా మానవ మనస్తత్వం ఒకేలాగుంటుంది. మానవునకు ధనలాభం, కీర్తిలాభం, అధికారలాభం మీద ఉన్న ఆసక్తి జ్ఞానలాభం మీద కనిపించటం లేదు, అందువలన మానవ హృదయములో సద్భావన కనిపించటం లేదు. సద్భావన లేనప్పుడు మాటలో గాని, వ్రాతలో గాని స్థైర్యము ఉండదు, స్పష్టత కూడా ఉండదు. జ్ఞానమునకు మూలము సద్భావన. జ్ఞానములో బంధము లేదు, దుఃఖము లేదు.

అజ్ఞానము బంధిస్తుంది, దుఃఖమునకు హేతువు అవుతుంది. అజ్ఞానము తొలగించుకొనుటకు మేధస్సు ఒక్కటే చాలదు. సహృదయము, తోటి మానవుని పట్ల ఆప్యాయత, అనురాగము, పవిత్రత ఇవి అన్నీ అవసరము. అజ్ఞానమునకు, జ్ఞానమునకు బేధము తెలియకపోతే అజ్ఞానమును తొలగించలేము. మానవుడు తనకున్న అన్ని అవకాశములను ఉపయోగించుకొని జ్ఞాన సముపార్జనకు కృషి చేసిన యెడల అసత్యము నుండి, అంధకారము నుండి విడుదల పొంది స్వేచ్ఛను పొందవచ్చును.

# 45. సామాజిక స్పృహ వలన బుద్ధికి శుద్ధి కలుగుతుంది

అరటకట్ల, ఏప్రియల్ 8, 1989

ధనము, విద్య, ప్రకృతి శక్తులు, వాటిని సద్వినియోగం చేయటం వలన సమాజమును అలరించవచ్చును. సామాజిక స్పృహ బుద్ధిని శుద్ధి చేస్తుంది. బుద్ధికి సత్యము తెలిసేవరకు శాశ్వతమైన శాంతి లభించదు. సత్యాన్వేషకుడికి మాత్రమే సౌందర్యము యొక్క విలువ తెలుస్తుంది. సత్యాత్మను స్మరించేవాడు తరిస్తాడు.

ఆత్మను తెలుసుకొనుటకు, జీవిత విలువలను గ్రహించుటకు, సుగుణములను సంపాదించుటకు సత్పురుషుల యొక్క ఆశ్రయం అవసరము. సజ్జన సాంగత్యము లభించినవాడు మాత్రమే మోక్ష మార్గములో నిలబడగలడు. అనుదినము దైవమును స్మరించుట వలన సాధకుని హృదయములో జ్ఞానాగ్ని ఉద్భవించి అతనిలో ఉన్న మాలిన్యమును దహిస్తుంది.

దేహమును, ఇంద్రియములను, మనస్సును వశం చేసుకోలేని వాడు స్వేచ్ఛా మండలములోనికి ప్రవేశించలేడు. శాంతిలో స్థిరపడిన వారికి మాత్రమే క్రియాశక్తి, ఆలోచనాశక్తి అభివృద్ధి పొందుతాయి, ప్రతిస్పందనకు దూరముగా ఉంటాడు, పనిలో ఆనందమును చూస్తాడు. అనంతము దిశగా ప్రయాణము చేస్తాడు. శాంతి లేనివాడు పాపముతో పోరాడలేడు. శాంతితో సాధించలేనిదేముంది! మనస్సు స్వరూపము తెలియనివాడికి శాంతి అందదు. సమాజములో ఉన్నస్వార్థపరులు తమ పబ్బము గడుపుకొనుటకు కులము పేరుతో, మతం పేరుతో, వర్గం పేరుతో అశాంతిని సృష్టిస్తారు. అశాంతి అసహజమైనది. శాంతి సహజమైనది.

## 46. అందరూ ఆరాధకులే

సెప్టెంబరు 23, 1989

అనేకమంది అధికారమును, ధనమును, కీర్తిని ఆరాధిస్తు న్నారు. కొద్దిమంది మాత్రమే ఈశ్వరుడిని ఆరాధిస్తున్నారు.

మానవుడు తనలోని దోషములను జయించుటకు, బుద్ధి బలమును పెంచుకొనుటకు ఈశ్వరున్ని ఆరాధించుట అత్యంత ముఖ్యము. ఈశ్వరుడు అందరి హృదయములలోను నిరంతరము ప్రకాశిస్తున్నాడు. మనస్సును పరిశుభ్రపరచి అంతర్ముఖం చేయగల్గితే ఆత్మగా ప్రకాశిస్తున్న ఈశ్వరుడు అనుభవంలోనికి వస్తాడు. మనస్సుకు స్వస్థానమైన ఆత్మలో నిలబడగలిగినవాడికి శాంతి కుదురుతుంది, వివేకం పెరుగుతుంది.

ఈ లోకములో అన్నములేక దుఃఖపడుతున్న వారికంటే మనస్సులో శాంతిలేక దుఃఖపడుచున్న వారే ఎక్కువగా ఉన్నారు.

పవిత్రత సంపాదించినవాడికి ప్రజ్ఞ అంతర్ముఖం అవుతుంది. పవిత్రత యొక్క సారమే శాంతి.

అహంకార భారమును తొలగించుకొని పనిచేస్తే పనిభారం అనిపించదు. పనిచేసి ఫలితమును ఆశిస్తున్న మానసము కలుషిత మవుతుంది. "నేను" ను మరచిపోయి పనిచేస్తున్న వారి ద్వారా మాత్రమే సమాజమునకు శ్రేయస్సు సిద్ధిస్తుంది. నేను జ్ఞాపకము రానివాడు శ్రేష్ఠమైన గతిని పొందుతాడు.

బాహ్యముగా ఎన్నో మతములు, కులములు కనిపిస్తున్నప్పటికి హృదయములో మనమందరము ఒకటిగానే ఉన్నాము. నిజము ఒక్కటిగానే ఉంటుంది కాని అనేకముగా ఉండదు. అట్టి నిజమును

తెలుసుకొనుటకు వివేకము అవసరము. కామమునకు వివేకముతో పనిలేదు. కాని వివేకము లేకుండా ప్రేమ ఉత్పత్తి కాదు. ప్రేమజీవులు మాత్రమే సమాజ శ్రేయస్సుకు సహకరిస్తారు.

మానవుడు తాను ఉపయోగించే వస్తువులన్నీ నాణ్యతగా ఉండాలని ఎలా అనుకొంటాడో అదే విధముగా తన మనస్సు కూడా నాణ్యతగా ఉండాలని అనుకోవాలి. మంచిని చేస్తూ, మంచిని చూస్తూ, మంచిని వింటూ జీవితమును దిద్దుకొని మానవుడు తన మనస్సుకు శ్రేష్టత చేకూర్చుకోవాలి. మనస్సును శిక్షణలో పెట్టుటకు మంచితనముతో పాటు దైవం పట్ల విశ్వాసం కూడా అవసరము. మనస్సుకు మూలం ఆత్మ. మనస్సు అణిగితే ఆత్మసుఖం అనుభవం లోనికి వస్తుంది.

## 47. మోక్షం హృదయంలో ఉంది

శృంగవృక్షం, డిశంబరు 3, 1990

హిందువులకు ఉన్న అత్యంత పవిత్రమైన క్షేత్రములలో అరుణాచలం ఒకటి. అరుణాచలంలో భగవంతుడిని జ్యోతి రూపము లో ఆరాధిస్తారు. భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆత్మజ్ఞానమును బోధించుటకు ఈ క్షేత్రమును కేంద్రముగా చేసుకొన్నారు. అందు వలన ఈ క్షేత్రమునకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చినది. కాశీలో మరణిస్తే ముక్తి, అరుణాచలమును స్మరిస్తే ముక్తి అని భారతీయులు విశ్వసిస్తున్నారు.

మోక్షము మానవుడి హృదయములో ఉన్నది, అయితే అజ్ఞానము వలన అది తెలియటం లేదు. ఆత్మజ్ఞానము అజ్ఞానమును నివృత్తి చేస్తుంది, మోక్ష సుఖమును తెలియపరుస్తుంది. అజ్ఞానమును తొలగించుకొనుటకు వేదాంతము యొక్క గమ్యము, చెరకు గెడను పిండితేనే గాని దానిలో ఉన్న రసము బయటకు రాదు, అదే విధముగా

మనస్సును శోధించి దానిని అరగదీస్తే దాని మూలమైన ఆత్మలో లీనమైపోతుంది. అప్పుడు తాను ఆత్మనని గ్రహిస్తాడు.

అహంకారమును "నేను" అనుకొంటే అజ్ఞానము పెరుగుతుంది. ఆత్మను "నేను" అనుకొంటే జ్ఞానోదయం అవుతుంది. ఆత్మజ్ఞానము పొందినవారు అందరి ప్రేమకు అర్హులవుతారు.

అహంకారము యొక్క ముడి విడిపోయే వరకు మానవుడిని సంశయాలు, సందేహాలు వెంటాడుతూనే ఉంటాయి. సదా చలించే మనోప్రవాహమునకు ఎదురు ఈదినవాడు మనోమూలమును తెలుసుకొని సుఖి అవుతాడు.

ఈశ్వరుని పట్ల గాని, గురువు పట్ల గాని, సత్యాత్మ పట్ల గాని హృదయపూర్వకమైన అనురాగం జ్ఞాన సముపార్జనకు సహక రిస్తుంది. జ్ఞానము కంటే వేరుగా మోక్షము లేదు.

అజ్ఞానము బలిస్తే ఆత్మశాంతికి దూరం అవుతాడు. అజ్ఞానము ను శేషము లేకుండా నాశనము చేసినవాడే ముక్తుడు. ముక్తుడికి భేదదృష్టి ఉండదు.

బుద్ధుడు, శంకరుడు, రమణుడు మొదలైన జ్ఞానుల యొక్క అనుగ్రహము మనమీద ప్రసరించగానే మన బంధములు భస్మీ పటలం అవుతాయి. జ్ఞానులు ఆత్మకంటే భిన్నముగా ఉండరు. ఆత్మానుభూతిని సాధించటమే జీవిత గమ్యం.

మనోనిర్మలత మానవుడు ఉదాత్త స్థాయికి చేరుకొనుటకు ఎంతగానో సహకరిస్తుంది.

భగవాన్ శ్రీ రమణ మహర్షి "నేను" ఎవడను అని ప్రశ్నించుకో మన్నారు. ఆ ప్రశ్నకు సమాధానమే ఆత్మజ్ఞానము. మనము ఎవరుగా ఉన్నామో మనకు తెలిసినప్పుడు సాధనలతో పనిలేదు. మోక్షమునకు తీసుకొని వెళ్లే మార్గమే జ్ఞానమార్గము.

## 48. మన దేశానికి కర్మ నిష్ఠ అవసరము

వేల్పూరు, డిశంబర్ 7, 1990

ప్రస్తుతం మన దేశానికి కర్మ నిష్ఠ అవసరము. కర్మఫలమును కొంతైనా సమాజమునకు ఉపయోగిస్తే మానవుడు పరిశుద్ధుడవుతాడు.

సకాలములో మంచి కర్మలను ఆచరించేవారు దేవతలతో సమానులవుతారు. ఎవరి స్వధర్మమును వారు నిర్వర్తిస్తే దేశమునకు స్వర్ణయుగం ప్రారంభమవుతుంది. కులముతో, మతముతో, ప్రాంతీయతతో తాదాత్మ్యం చెందకుండా ఉంటే దేశ సమైక్యతను, సమగ్రతను సాధించవచ్చును.

మానవ మానసము హింసా ప్రవృత్తి నుండి విడుదల కాకపోతే దేశములో అశాంతి, అలజడి కొనసాగుతూనే ఉంటుంది. హింసా ప్రవృత్తి ఏ రూపములో ఉన్నా దానిని నిర్మూలించటం అవసరము.

కర్మయోగము మానవుడిని దుర్గుణముల నుండి, దురభ్యాసముల నుండి విడుదల చేస్తుంది, హృదయమును విశాలపరచి మేధస్సు యొక్క లోతులను పెంచుతుంది.

భగవంతుడే లోకముగా కనిపిస్తున్నాడు. అందువలన లోకమునకు మేలుచేసే ప్రతి పని కూడా భగవంతుడికి పూజ అవుతుంది. భగవంతుడు అందరి హృదయములలోను సజీవముగా ఉన్నాడు. ఈ వాస్తవమును గ్రహించిన వాడికి జ్ఞానము, శాశ్వతమైన శాంతి, ఆనందము కలుగుతుంది. కర్మయోగము దుఃఖమునకు కారణమైన అజ్ఞానము సమూలముగా నశింపజేయుటకు సహకరిస్తుంది. దేహబుద్ధి నశిస్తుంది, ఆత్మబుద్ధి లభిస్తుంది, అమృతత్త్వం పొందవచ్చును.

# 49. గీతను అర్థం చేసుకొని ఆనందమును పొందండి.

కాపవరం, డిశంబర్ 29, 1990

మనం బజారులో ఏదైనా ఒక వస్తువు కొనాలంటే ధనం అవసరం. అదే విధముగా అనుదినము గీతను పారాయణము చేసి, అర్థము చేసుకొని, ఆచరించి అద్వైతానుభవమును పొందుటకు పుణ్యబలము అవసరము.

భగవంతుడికి ఉండవలసిన లక్షణములన్నీ వాసుదేవస్వామిలో ఉన్నాయి. అందువలన ఆయన చెప్పిన గీతను భగవద్గీత అని అన్నారు. కాలమును "నేను" అని భగవద్గీతలో భగవంతుడు చెప్పి యున్నాడు. కాలము ధనమునకు సంబంధించినది కాదు. కాలము జీవితమునకు సంబంధించినది. అందువలన జీవితమును సద్వినియోగం చేసుకొంటే జ్ఞానమనే ఐశ్వర్యము లభిస్తుంది.

అజ్ఞానమును ఈ జన్మలోనే దులుపుకొని బయటికిపోతే మోక్ష సామ్రాజ్యమును పొందవచ్చును. ఆత్మానుభవము కంటే వేరుగా మోక్షము లేదు. మోక్షము అలౌకికం. మన హృదయంలో మోక్షం ఉండనే ఉన్నది. కాని రాగద్వేషముల వలన అది తెలియబడటం లేదు. వాటిని తొలగించుకొనుటకు జ్ఞాన మార్గమే ప్రధానమైన మార్గం.

భగవదనుగ్రహం సంపాదిస్తే చలిస్తున్న మనస్సును అచలము చేసి శాంతిని, కాంతిని పొందవచ్చును. మనల్ని అజ్ఞానము యొక్క పరిధిలో నుండి విడుదల పొందమని గీతలో భగవంతుడు ఉపదేశిస్తున్నాడు. మన మనస్సుని వాసుదేవస్వామి యందు లగ్నం చేసి ధ్యానిస్తే హృదయానందంలో ఊగిసలాడవచ్చును. మనము తెలుసుకోవలసిన ఆత్మ పదార్థము మనకి అంతర్యామిగానే ఉన్నది. అదే జ్ఞానం, అదే

ఆనందం, దానిని అనుభవంలోనికి తెచ్చుకొన్న మరుక్షణమే మోహం పోతుంది. జ్ఞానము ముదిరిపోతే మోహానికి చోటు ఉండదు.

మనము క్రమముగా వాసుదేవస్వామిని చింతన చేస్తూ జ్ఞాన లక్షణములను అలవర్చుకొంటే మనలో ఉన్న దుఃఖములు, దోషములు, బలహీనతలు హరించుకుపోతాయి. అందువలన అన్ని విధముల ప్రయత్నము చేసి మన హృదయ సింహాసనం మీద కూర్చున్న అజ్ఞానమును దింపివేసి జ్ఞానము ప్రతిష్ఠింపవలెను.

భగవంతుడు అన్నికాలములలోను పనిచేస్తూనే ఉన్నాడు. ఆయనకు తెలియకుండా ఏమీ జరగటం లేదు. భగవంతుడు ఎంత నిత్యమో, సృష్టి యొక్క వ్యాపారము కూడా అంత నిత్యముగానే జరుగుతూ ఉంటుంది. సృష్టి పట్ల మైత్రీ భావము పెంచుకోవటము వలన కూడా మానవుడు తనలో ఉన్న అల్పమైన, స్వల్పమైన దోషముల నుండి బయటపడవచ్చును.

శ్రీ కృష్ణస్వామి వంటి అవతార పురుషులు భూమి మీదకు వచ్చినప్పుడు వారిని, వారి సందేశమును మనము ఉపయోగించుకోలేకపోతే రైలు తప్పిన ప్రయాణీకులము అవుతాము.

## 50. అహంకారం నశిస్తేనే ఆత్మసాక్షాత్కారం సాధ్యం

పాలకొల్లు, జూలై 27, 1991

అహంకారం నశిస్తేనే కాని ఆత్మసాక్షాత్కారం కాదు. ఆత్మసాక్షాత్కార సుఖం అన్ని సుఖాలలోను గొప్పది. ఇంద్రియ విషయముల నుండి, అహంకారము నుండి విడుదల పొందేవరకు

నిజమైన స్వేచ్ఛ రాదు. దీనికి అభ్యాసం, వైరాగ్యం అభివృద్ధి చేసుకోవాలని శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు.

కోరికలు, ఆశలు, ఆకాంక్షలు, ద్వేషాలు, అభిరుచులు అన్నీ "నేను" లోనే ఉన్నాయి. ఈ దేహగతమైన "నేను" ను తొలగించుకోగలిగితే దానితో పాటు అవి కూడా నశిస్తాయి. ఆ "నేను" అన్నది మన శరీరంలో ఉంది. అది నశిస్తే అహం నశిస్తుంది. అన్ని దానాలలోను బలిచక్రవర్తి దానం గొప్పదంటారు. బలిచక్రవర్తి తన శిరస్సును దానం చేశాడు. అంటే తన అహంకారాన్ని తొలగించుకొన్నాడన్నమాట. అహంకారమును త్యాగం చేయకుండా వస్తువులను త్యాగం చేసినా ప్రయోజనం ఉండదు.

మతం మనకు బోధించిన సంఘానికి సంబంధించిన కట్టుబాట్లు, ఆచారాలు, లాంఛనాలు మాత్రం ఆచరిస్తాం కాని మతం బోధించే సాధన, తత్త్వం, విచారణ, వివేకం ద్వారా మోక్షం గురించి పట్టించుకోము.

మనస్సును అంతర్ముఖం చేయకుండా ఎన్ని పూజలు, వ్రతాలు, నోములు ఆచరించినా అజ్ఞానం నశించదు. మనస్సు లగ్నం అయినప్పుడే అంతర్ముఖం అవుతుంది. అందుకే దేహాభిమానాన్ని చంపుకోవాలని చెప్పడానికే శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాలు అపహరించాడు.

ఎంతటివాడికైనా దేహబుద్ధి నశించనంత కాలం ఆత్మబుద్ధి కలుగదు. ఆత్మ ప్రకాశం వలన మాత్రమే అహంకారంలో ఉన్న "కారం" తొలగిపోతుంది. ఈశ్వరునికి శరణాగతి చేయుట ద్వారా మానవుడు తనను తాను ఈశ్వరునికి సమర్పించుకోగలడు.

మానవునికి దృశ్యం మీద ఉన్న ప్రేమ తన స్వరూపం మీద నెలకొని ఉంటే జ్ఞానం కలుగుతుంది. దుఃఖం నశిస్తుంది. సుఖి అవుతాడు. ఆత్మను తెలనుకొన్నవాడు దేవుని స్వరూపమును పొందుతాడు.

గురువుకి, ఆత్మకి, భగవంతునికి బేధమే లేదని తెలుసుకోవాలి. గురువు మీద విశ్వాసం పెంచుకోవటం వలన ఆత్మదర్శనం సంభవిస్తుంది. ఆత్మగా ఈశ్వరుడే దర్శనం ఇస్తాడు.

(శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం)

## 51. మనోనిగ్రహమే అత్యంత ముఖ్యము

పాలకొల్లు, సెప్టెంబర్ 23, 1991

మనస్సు మానవుని లోపల ఉన్నది. కాని మానవుడు మనస్సును బాగుచేసుకొనుటకు ఇవ్వవలసిన ప్రాముఖ్యత కంటే బయట జరిగే సంఘటనలకు, పరిస్థితులకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటం జరుగుచున్నది.

మనస్సులో ఉన్న బలహీనతలు నశిస్తే ఆత్మలో, ఆనందములో, జ్ఞానములో మునిగిపోవచ్చును. ఎరుక కూడా వస్తుంది.

తలంలపుల సమూహమునే మనస్సు అని అంటారు. మానవ జీవితం తలంపుల మీదే ఆధారపడి ఉంది. తలంపు మంచిదయితే మంచికార్యం చేయవచ్చును. అందువలన తలంపుల విషయంలో జాగ్రత్త పడాలి. హృదయంలో మంచి తలంపులు ఉదయించిన యెడల భగవంతుని అనుగ్రహము పూర్ణముగా పొందవచ్చును. దైవానుగ్రహము పొందినవాడికి వేదన లేదు, రోదన లేదు, భౌతికముగా గాని, ఆధ్యాత్మికముగా గాని పతనము రాదు.

మధనపడకుండా మనోనిగ్రహం సాధ్యం కాదు. "నేను" ఎవడను అను ప్రశ్న మనోనిగ్రహము నకు సహకరిస్తుంది. హృదయమును పరిశుద్ధ పరుస్తుది. నిరంతరము మన కూడా ఉండే మనస్సును బాగుచేసుకొనుటకు జాగ్రత్తపడాలి. జాగ్రత్తగా ఉంటే ఉజ్వలమైన భవిష్యత్తును పొందవచ్చును. అణగిన మనస్సుకు మంగళప్రదమైన సద్వస్తువు వ్యక్తమవుతుంది. సమగ్రంగా జీవించుటకు అర్హత పొందవచ్చును. ఎక్కడ బేధబుద్ధి నశించిందో అక్కడ స్వేచ్ఛ, సమత, నమ్రత సిద్ధిస్తాయి. మనస్సు వికసించుటకు ఉపయోగపడే మాటలు మాత్రమే నిజమైన వార్తలు.

## 52. సహజస్థితిని పొందుటకే సాధన

జిన్నూరు, జూలై 14, 1992

ప్రతి మానవుడికి శాంతి కావాలి. అది అతని సహజస్థితి. దానిని పొందటానికి అన్ని ప్రయత్నాలు చేస్తాడు, దానినే సాధన అంటారు. సహజంగా, సరళంగా, సూటిగా జీవించే మానవుడు సహజస్థితిని పొందుతాడు. సహజస్థితికి వేరుగా శాంతి లేదు. శాంతి లేనివాడికి శక్తి లేదు, సుఖము లేదు, కాంతిలేదు.

ప్రతి వాని హృదయములోను భగవంతుడు ఉన్నాడు. ఉండటమే భగవంతుని స్వరూపము. ఆ నిజానికి మానవుని కళ్లు తెరుచుకొనే వరకు దుఃఖము నశించదు. సత్యాన్వేషకుడు హృదయములో ఉన్న శాంతికి దూరముగా ఉండడు. ఎంత పనిలో ఉన్నా అణగిన మనస్సు అప్రయత్నముగా ఆనందమును అందుకొంటుంది. సత్యము తెలుసుకొనేవరకు అసత్యము వెంటాడుతూనే ఉంటుంది. అసత్యమును పోగొట్టుకొనుటయే సాధన ఫలం.

మనకు బాహ్యంగా ఉన్న యోగులను చూడటంకంటే మనలో ఆత్మరూపంలో ఉన్న యోగిని దర్శించినవాడు శాంతి సాగరములో మునుగుతాడు. అశాంతిలో ఉన్నవాడు జీవుడు అవుతాడు. శాంతిలో ఉన్నవాడు దేవుడు అవుతాడు. శాంతి తెలిస్తే ఈ లోకంలో ఏదీ బాధించదు.

మనలో ఉన్న అహంకారమును, ఆడంబరమును, అజ్ఞానమును త్రోసివేస్తే ఉన్నది ఉన్నట్లు కన్పిస్తుంది. ఉన్నది శాంతి, అశాంతి మన కల్పితం. అశాంతి బయటలేదు, మనలో అజ్ఞానరూపంలో ఉంది. అజ్ఞానము నశిస్తే అశాంతి నశిస్తుంది. అప్పుడు శాంతి తానుగా వ్యక్తం అవుతుంది.

భౌతిక అభివృద్ధికైనా, ఆధ్యాత్మిక అభివృద్ధికైనా శాంతి పునాది లాంటిది. మన హృదయంలో ఉన్న నిజం తెలిసేవరకు శాంతి లేని దుస్థితిలోనే ఉంటాము.

## 53. సుఖము అహంకారమునకు అందేది కాదు

జిన్నూరు, సెప్టెంబర్ 23, 1992

శరీరం శవం అయ్యేవరకు ఆహారం తీసుకోవాలి. అహంకారం నశించే వరకు సాధన చెయ్యాలి. అహంకారం ఉన్నంత వరకు సుఖం అందదు. అహంకారం అనేది ఒకటి ఉన్నదా! అని విచారణ చేస్తూ ఉంటే కాలక్రమంలో అది లేదని తెలుస్తుంది. అహంకారమును అదుపులో ఉంచుకొంటే దాని నాశనం ప్రారంభం అవుతుంది. ఆ దొంగను పట్టుకోగల్గితే అది పెట్టే చిక్కుల నుండి బయటపడవచ్చును. ఆ దొంగను తప్పించుకోవటానికే పూజ, ప్రార్థన, ధ్యానము, ప్రేమ అవసరము.

మంచితనము వలన, మానవుని కృషి వలన, దేవుని కృప వలన, అహంకార రూపములో ఉన్న అజ్ఞానమును తొలగించి పరమావధిని చేరుకోవచ్చును. అవినయమును తొలగించుకొంటే అజ్ఞానం నశిస్తుంది.

శరీరమునకు, ఆత్మకు మధ్యలో అహంకారం పుట్టుకొస్తోంది. నేను అను ప్రథమ తలంపును, ప్రధాన తలంపును అహంకారమని పిలుస్తారు. ఈ అహంకారం ఎక్కడ నుండి పుడుతున్నదో చూస్తే అది నశిస్తుంది. వెంటనే జ్ఞానం ఉదయిస్తుంది. అప్పడు సదా నీలో ఉండే నిజమైన ఆత్మను కనుగొంటావు. అహంకారం పెట్టే తికమకలు ఆగిపోతాయి. అప్పడు నిజమైన ఆనందం వరిస్తుంది. సందేహాలు ఉండవు. దుఃఖము, వేదన, సందేహాలు అహంకార రూపములో ఉన్నాయి.

మానవుడిలో ఉన్న దుఃఖానికి, ప్రపంచములో ఉన్న దుఃఖానికి అహంకారమే కారణము కాని భగవంతుడు కారణము కాదు. భగవంతుడు పరమ పవిత్రుడు. ఆయన చేసే ప్రతి పని పరిశుద్ధముగానే ఉంటుంది. అట్టి భగవంతుడి నుండి మనం వేరుపడటం వలన అజ్ఞానం తలెత్తుతోంది.

ఉన్నది జ్ఞానమే, మనం కల్పించుకొనేది అజ్ఞానం. అజ్ఞానం నశిస్తేనే కాని బ్రహ్మభావన కుదరదు. బ్రహ్మభావన కుదిరితే బ్రహ్మమందు నిలిచి ఉండవచ్చును. జ్ఞానంలో స్థిరపడిన వానిని కర్మలు కలతపెట్టవు. అజ్ఞానం నిశ్శేషం కాకుండా జ్ఞానం స్థిరపడదు. జ్ఞానం మన స్వరూపంగానే ఉంది. అనుదినము "నేను ఎవడను" అని ప్రశ్నించుకొంటూ ఉంటే జ్ఞాన స్వరూపులము అవుతాము. అప్పడు జ్ఞానం మాట్లాడుతుంది. అజ్ఞానం నశిస్తుంది.

జ్ఞానం యొక్క ఏకత్వం అనుభవమయ్యే వరకు ఆహారము, విహారము, నివాసము వీటి విషయములో సాధకుడు జాగ్రత్త పడాలి. బేధాలు పాటించే నివాసాలకి దూరముగా ఉండాలి. బేధాలు కల్పించే వారి మధ్యలో బాధలు పడుతూనే ఉండాలి. బాధలు పోగొట్టుకోవటానికే సాధనలు.

## 54. మూలతలంపు మూలంలోనే ఆత్మదేవుడు ఉన్నాడు

జిన్నూరు, జనవరి 10, 1993

"నేను" అను ప్రధమ తలంపు యొక్క పుట్టిన చోటును చూడగల్గితే మానవుడికి తన స్వరూపము తెలియబడుతుంది. "నేను" అను ప్రధమ తలంపును కలుషితము, అపవిత్రత నుండి విడుదల చేయగల్గితే అది అంతర్ముఖమై ఆత్మలో అంతర్ధానమవు తుంది. అజ్ఞానము నుండి విడుదల పొందవచ్చును. శుద్ధమైన "నేను" స్ఫురిస్తుంది. అదే స్వర్గరాజ్యము, శాంతిలో స్థిరపడవచ్చును. శాంతి వల్ల సుఖము వస్తుంది. అశాంతి వల్ల దుఃఖము వస్తుంది.

మానవుడు ఎంతవరకు ఆలోచించగల్గితే అంతవరకే మాట్లాడటం మంచిది. ఆలోచన కూడా తపస్సుతో సమానము. ఆలోచనే కేంద్రముగా పెట్టుకొని జీవించే వాడు దుఃఖము లేని స్థితికి ఎదుగుతాడు. సత్యమును తెలుసుకొనుటకు తగిన అర్హతను, యోగ్యతను సంపాదించుకొంటాడు. మానవుడికి సుగుణములు ఉన్నప్పటికి అవి స్వార్థం చుట్టూ తిరుగుతూ ఉంటే సత్యం తెలియబడదు.

అహంకారమునకు అతీతముగా ఉన్న అలౌకికమైన, అభౌతికమైన శాంతిని అహంకారముతో పట్టుకోలేము. అందువలన అహంకారమును వదిలించుకొన్నవాడు శాశ్వతశాంతిలో, మోక్షసుఖములో స్థిరపడతాడు.

## 55. దేశసమైక్యతకు రామకథ సహకరిస్తుంది

మట్లపాలెం, జూన్ 1, 1993

రామకథ దేశసమైక్యతకు ఎంతగానో సహకరిస్తుంది. అనేక ధర్మ సూక్ష్మములు తెలుసుకోవచ్చును. మర్యాదగా మాట్లాడటం, మంచిగా ప్రవర్తించటం, ద్వేషం లేకుండా జీవించటం రామకథ నుండి మనం నేర్చుకోవలసిన పాఠములు, రాముడు ప్రేమామయుడు మన అందరి హృదయములలోను ఆయన సజీవముగా ఉన్నాడు.

మనకి చీకటిలో వస్తువులేవీ కనపడవు. అజ్ఞానము కూడా చీకటి వంటిదే. మనలోని అజ్ఞానము కారణముగా మన స్వరూపము మనకు వ్యక్తం కావటం లేదు. అజ్ఞానము ఉన్నంతకాలము మనల్ని అంధ విశ్వాసములు వెన్నాడుతూనే ఉంటాయి. మౌఢ్యాన్ని తొలగించుకోలేము. జ్ఞాన సముపార్జన వలన, తపస్సు వలన అజ్ఞానమును తొలగించు కోవచ్చును. భౌతికమైన అగ్ని అజ్ఞానమును దహించలేదు, జ్ఞానాగ్ని మాత్రమే అజ్ఞానమును దహించగలిగిన శక్తి ఉన్నది.

సాంఘికంగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టములు జ్ఞానము లేకుండా పరిష్కరించబడవు. జ్ఞానము వలన సత్ ప్రవర్తన కుదురుతుంది. సత్ ప్రవర్తన ఉన్నచోట మాత్రమే సాంఘిక దృక్పథం కన్పిస్తుంది. మానవుడికి మంచితనం మీద విశ్వాసము అవసరము. మంచితనములో ప్రేమ ఉన్నది.

హేతువాదము గురించి ఎవరు ఎంత మాట్లాడినా మనోభావము మీద మాత్రమే ఆధారపడి ప్రవర్తిస్తారు. మనుషుల మనసు ఏకమైనప్పుడు వాదములు, వివాదములు మరుగున పడిపోతాయి. దైవమును తెలుసుకొనేవరకు మానవుడికి నిజమైన శాంతి లభ్యం

కాదు. శాంతి కుదిరితే కాని చిత్తము స్థిరపడదు. శాంతి సంసారమును సుఖమయం చేస్తుంది.

భగవంతుడు చెప్పిన మాటలను మనము మనస్సులో ఉంచుకోవాలి. చేతనైనంత వరకు ఆచరణలో పెట్టాలి. మానవుడికి సహజంగా కృతజ్ఞత ఉండదు. ఈశ్వరుడి పట్ల ప్రేమకొంటే కృతజ్ఞత, శరణాగతి భావం పెరుగుతాయి. మోసమునకు, మోహమునకు దూరము కావచ్చును. జ్ఞానమును వృద్ధి చేసుకోవచ్చును. అనుదినము ఈశ్వరుని స్మరించుట వలన, ధ్యానించుట వలన ఆత్మవిశ్వాసం కుదురుతుంది. ఆత్మజ్ఞానం కల్గుతుంది.

## 56. బ్రహ్మానుభవం వచ్చాక భవసుఖాలు నశిస్తాయి

జిన్నూరు, సెప్టెంబర్ 23, 1993

మానవుడు ఎన్నో జన్మల నుంచి శరీరానికి, ఇంద్రియాలకి, మనస్సుకి సంబంధించిన భవసుఖాలు అనుభవిస్తున్నాడు. వీటివల్ల పునర్జన్మకు హేతువులైన కర్మ సముద్రంలో కొట్టుకుపోతారు.

నీవు అనుభవించే శారీరక సుఖాలు పరిణామంలో దుఃఖం తీసుకొస్తుంది. బ్రహ్మానుభవం వచ్చాక భవసుఖాలు నశిస్తాయి.

నీ స్వరూపం బ్రహ్మమే, బ్రహ్మం వ్యక్తం అయినప్పుడు ముగింపు లేని ఉత్తమ సుఖాన్ని పొందుతారు. సముద్రానికి పరిమితులు ఉన్నాయి. కాని బ్రహ్మానికి పరిమితులు లేవు. బ్రాహ్మీసుఖం అనుభవించే కొలది ఆ సుఖానికి వ్యయం లేదు. బ్రహ్మంలో నిజమైన సుఖం ఉంది. ఆ బ్రహ్మాన్ని తెలుసుకోలేకపోతే నీవు నిజమైన సుఖివి కాలేవు.

శాంతి దొరికితే భవసుఖాల వైపు మనస్సు తిరగదు. బ్రహ్మ సుఖం అందినప్పడు దేవుడు వచ్చి కన్పించినా చూడాలని ఉండదు. అది జ్ఞాని యొక్క వైభవానికి నిదర్శనం. జ్ఞాని ఈ లోకాన్ని ప్రేమించకుండా ఉండలేడు. ప్రతి గురువు, ప్రతి జ్ఞాని బోధస్వరూపుడు, ప్రేమాస్వరూపుడు.

మానవ హృదయంలో నిజాన్ని తెలుసుకొనే వరకు బుద్ధి సంతృప్తి పడదు. ఈ లోకంలో ఎన్ని సాధించినా నిన్ను నీవు తెలుసుకోలేకపోతే ఒకటి లేని సున్నలు లాంటిది. భగవంతుని తెలుసుకొనుటకు అనేక మార్గాలు ఉన్నాయి. మీకు నచ్చిన మార్గం ద్వారా భగవంతుడిని చేరుకోవాలి. ఏ మార్గంలో ప్రయాణం చేసినా శాంత చిత్తం కావాలి.

దేవుని మీద ఎంత గౌరవం ఉందో అదే విధముగా దేవుని సంకల్పం మీద గౌరవం ఉన్నవాడు నిజమైన భక్తుడు. మీరెవరో మీరు తెలుసుకొనుటకే భక్తి యొక్క ప్రయోజనము.

ప్రతి జ్ఞాని, ప్రతి ఋషి ప్రపంచ రహితుడైనప్పటికి మనం మన శరీరాలను ఎలా ప్రేమించుకొంటామో జ్ఞాని ఈ ప్రపంచాన్నంతా అపారంగా ప్రేమిస్తాడు.

మనస్సు నశిస్తే సృష్టి అంతా బ్రహ్మమే అని తెలుస్తుంది. బ్రహ్మానుభవం వచ్చేవరకు దుఃఖం, భయం వెంటాడుతాయి.

మనం కన్పించని దేవుడికి సన్మానం చేయడం అంటే మనం మన పరిమితమైన మనస్సులో మైత్రి, సహనశీలం అలవాటు చేస్తే దేవుడు సన్మానింపబడతాడు.

మన శరీరాలు ఎక్కడ ఉన్నప్పటికి ఒక అవతార పురుషునితోనో, ఒక జ్ఞానితోనో మానసికమైన అనుబంధం పెట్టుకొంటే మనస్సు నశించి దుఃఖం, అశాంతిలో నుంచి విడుదల పొందుతాము. మనస్సు నుంచే దుఃఖము, అశాంతి వచ్చింది కాబట్టి మనస్సు నశించాలి.

ఒక జ్ఞాని చెప్పిన మాటల మీద ప్రమాణం పెట్టుకొనిజీవిస్తే మనం బాగుపడతాము. స్నేహాలు చెయ్యకుండా ఎలాగా ఉండలేము కాబట్టి నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో సహవాసం చెయ్యి. అలాగ చెయ్యలేకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో నయినా సహవాసం చేస్తుంటే మానసిక స్థాయి పెరిగి మనం ఎదగాలనే ఉత్సాహం వచ్చి నీ స్వరూపం ఏమిటో తెలుస్తుంది.

## 57. జ్ఞాన సముపార్జనలో అతి ప్రధానమైనది గుర్వానుగ్రహము మాత్రమే (గురుపౌర్ణమి)

జిన్నూరు, జూలై 24, 1994

శిష్యుని యొక్క అజ్ఞానమును తొలగించగల్గినవాడినే గురువు అంటారు. సర్వకాల సర్వావస్థల యందు ఆత్మనిష్ఠ కలిగి తనను ఆశ్రయించిన వాళ్ళకు ఆత్మ సుఖానుభవమును చేకూర్చే వాడిని సద్గురువు అంటారు. జ్ఞాన సముపార్జనలో అతి ప్రధానమైనది గుర్వానుగహము మాత్రమే.

గురువు తనను ఆశ్రయించిన వాళ్ళకి తత్త్వమును ఉపదేశించి శాంతచిత్తమును అనుగ్రహిస్తాడు. ఆత్మజ్ఞాన సముపార్జనకు బోధలు, సంవాదములు, రచనలు, ప్రవచనములు, జపధ్యానాదులు రెండో పక్షం. మానవుడు సంపూర్ణ స్థితిని సాధించుటకు గుర్వానుగ్రహము ప్రధమ కారణం. గురువు చూపు, గురువు స్పర్శ, గురువు బోధ, గురువు మౌనం ఇవన్నీ శిష్యుని యొక్క చైతన్య స్థాయిని పెంచుటకు సమర్థమగుచున్నవి.

శిష్యుని హృదయంలో ఉన్న సత్యాత్మను ప్రకాశింపచేయువాడే సద్గురువు. గురువు అనుగ్రహము లేకుండా మానవుడు దుఃఖము లేని స్థితికి ఎదగలేడు. గురువుసహాయ సహకారములు లేకుండా శిష్యుడు అజ్ఞాన బంధము నుండి విడుదల కాలేడు.

దేహబంధము అజ్ఞాన కల్పితము. దేహబుద్ధికి మాత్రమే పరిమితమైన వాడికి బేధదృష్టి కల్గుతుంది. బేధదృష్టిని సమదృష్టి వలన తొలగించుకోవచ్చును. సమానత్వమే యోగము.

చిత్తశుద్ధి లేకుండా చిత్తశాంతి రాదు. చిత్తశాంతి రాకుండా సుఖానుభవం తెలియదు. సుఖము జ్ఞానకార్యము, దుఃఖము అజ్ఞానకార్యము. దోషము ఉన్నచోట దుఃఖము ఉండనే ఉంటుంది. ఎప్పడూ సరళముగా ఉండేదే సహజమైనది. అటువంటి సహజస్థితిని సాధించటానికి మనస్తాపములు ఉండవు.

## 58. జ్ఞానగురువు శ్రీ రమణ మహర్షి

హైదరాబాద్ (మధురానగర్), సెప్టెంబర్ 1, 1994

ధర్మమును ఉపదేశించి అజ్ఞానము అనే చీకటిని తొలగించేవాడు మాత్రమే జ్ఞాన గురువు, పూర్ణ గురువు. అటువంటి సద్గురువులలో భగవాన్ శ్రీ రమణ మహర్షి ఒకరు.

భగవాన్ సన్నిధికి ఆకర్షింపబడిన శిష్యులను ఆత్మాభిముఖంగా చేశారు. ఆత్మ మాత్రమే సత్యము. అట్టి సత్యమందు మనస్సు లగ్నము కానిచో సుఖము ఉండదు. సత్యము, జ్ఞానము, శాతి అనుభవైక వేద్యములు. సత్య సాక్షాత్కారమును పొందినవాడిని మాత్రమే ఋషి

అంటారు. అట్టివాడికే బేధదృష్టి నశిస్తుంది. కాలాతీతమైన తత్త్వం ఎరుకలోనికి వస్తుంది. హృదయములో ఉన్న ఆనందం కానవస్తుంది.

ఆత్మానుభవము పొందిన ఋషి ద్వారా మాత్రమే శాంతి తరంగములు సమాజమునకు ప్రవహింపజేయబడతాయి.

సద్గురువు సన్నిధిలో మానవుడి పరిణామము తొందరగా జరుగుతుంది. శిష్యులకు అత్యంత సన్నిహితుడు గురువు మాత్రమే. సత్యసాక్షాత్కారము పొందిన సద్గురువు మాత్రమే మానవుడికి హితుడు, యదార్థమును బోధించేవాడు. గురువు మాత్రమే నిజమైన బంధువు.

అన్ని చిక్కులకు, విరోధాలకు, కల్లలకు, కలతలకు అజ్ఞానమే కారణము. అట్టి అజ్ఞానము నశించుటకు సద్గురువు బోధలు, సంవాదములు, ఉపన్యాసములు సహకరిస్తాయి. సందేహములు ఆగిపోతాయి.

మానవుని హృదయములో నిజముంది. ఆ నిజము మానవుడికి అనుభవం లోనికి వచ్చే వరకు స్వతంత్రుడు కాలేడు. అట్టి స్వతంత్ర స్థితిని అందుకొనుటకు మానవుడికి అడ్డుపడే దోషములను, లోపములను, బలహీనతలను తొలగించుటకు సహాయ సహకారములు అందించేవాడే సద్గురువు.

సమాజములో ఉన్న అన్ని దోషములు అజ్ఞానము నుండే ఉద్భవిస్తున్నవి. అట్టి దోషములను కత్తిరించేవాడే సద్గురువు. అజ్ఞానమే దుఃఖము, జ్ఞానమే సుఖము.

మరుగుపడిపోయిన జ్ఞానమార్గమును పునరుద్ధరణ చేయుటకు దివి నుండి భువికి అవతరించిన దేవతా పురుషుడే భగవాన్ శ్రీ రమణమహర్షి. ఆయన ద్వారా సర్వ జీవులకు అనుగ్రహము

ప్రసరింపబడినది. ఆయన సన్నిధిలో భక్తులు ఆనందములో పులకరించి పరవశించారు. ఆయన వాణి మధురమైనది, శాంతమైనది, గంభీరమైనది, సౌందర్యవంతమౌనది, ఆయన అసంతుష్టి తెలియని వాడు. శాంతి మాత్రమే స్వరూపముగా కలవాడు. శాశ్వత శాంతిని పొందుటకు మార్గమును ఉపదేశించిన మహా గురువు భగవాన్ శ్రీ రమణ మహర్షి.

## 59. అందరిలోను సత్యం ఉన్నది

జిన్నూరు, సెప్టెంబర్ 23, 1994

అందరిలోను సత్యం ఉన్నది. కాని మానవుడు తన హృదయములో ఉన్న సత్యమును గురించి శ్రవణము చేసి, మననం చేస్తే అమృతత్త్వమును పొందుతాడు.

సత్యం హృదయంలో సిద్ధంగానే యున్నది. అది అనుభవైక వేద్యము. దేశ కాలములు దానిని తాకవు. దేహము, మనస్సు దానిని పరిమితము చేయలేవు. సత్యం తెలియకపోవటమే అజ్ఞానం. సమాజములో ఉన్న అన్ని అనర్థములకు అజ్ఞానమే కారణం.

జ్ఞాన ఫలం శాంతి, అజ్ఞాన ఫలం అశాంతి. జ్ఞానమునకు కర్మకు విరోధము లేదు. జ్ఞానము, అజ్ఞానము పరస్పర విరుద్ధములు.

ఏనాటికైనా సత్యమును మానవుడు తనలోనే కనుగొన వలెను. అది వెలుపల దొరకదు. సత్యాన్వేషకుడు కానివాడిని ప్రపంచం నిరంతరం వ్యామోహపరుస్తూ ఉంటుంది. మానవ మానసం జ్ఞానాన్ని లోపల వెతకటం విడిచిపెట్టి వెలుపలనే వెతకటం అలవాటు

పడిపోయింది. అందువలన మానవ హృదయంలో ఉన్న సద్వస్తువు నిజమైనప్పటికి నిజము కాని దానివలె కన్పిస్తున్నది.

అజ్ఞానము కల్ల విషయములను సృష్టించి వాటితోనే తిరుగుతూ ఉంటుంది. ప్రయత్నము చేసి అజ్ఞానమును తొలగించు కుంటే దానికి సంబంధించిన బాధలు, వ్యధలు నశిస్తాయి. అజ్ఞానము తలంపులకు లోబడి ఉంటుంది. చైతన్యము తలంపులకు అతీతమై ఉంటుంది. అన్ని కాలములలోను, అన్ని అవస్థలలోను చైతన్యము ఒక్కటి మాత్రమే నిలచి ఉంటుంది. చైతన్యమే పూర్ణజ్ఞానము.

## 60. శాస్త్రవేత్త అయినా, తత్త్వవేత్త అయినా సమాజమునకు ఉపయోగపడే లాగ ఉండాలి

భగవాన్ శ్రీరమణ మహర్షి 114వ జయంతి

జిన్నూరు, డిశంబర్ 30, 1994

శాస్త్రవేత్త అయినా, తత్త్వవేత్త అయినా సామాన్య మానవుడికి ఉపయోగపడేలాగ ఉండాలి.

మనస్సే తలంపుల క్రింద మారుతుంది. మనస్సు యొక్క స్వరూపం తెలియకపోతే మానసికమైన ఒత్తిడిని తగ్గించుకోలేము. మానసిక ఒత్తిడి శారీరకమైన అనారోగ్యానికి గురిచేస్తుంది. మనస్సే మనకు నేను గా వ్యక్తం అవుతుంది. గాఢనిద్రలో ఈ మనస్సు హృదయంలోనికి ఉపసంహరింపబడుతుంది. మెలకువ రాగానే ఈ మనస్సులో విజృంభిస్తుంది. ఆత్మజ్ఞానము లేకుండా మానసికమైన ఆందోళనను అరికట్టలేము. మనోమూలములోనే ఆత్మ ఉంది. ఆత్మలో సుఖం ఉంది. భగవాన్ శ్రీ రమణ మహర్షిలాంటి మహా గురువులు మానవుడు

ఆత్మానుభవమును సంపాదించుటకు సహాయపడతారు. ఉపదేశాలకన్నా, ఉపన్యాసాల కన్నా ఆత్మశాంతికి గురువు యొక్క అనుగ్రహం ఎక్కువ ఉపయోగపడుతుంది.

వివేకమును పెంచుకోవటం వలన ఈ భూమి మీద మనకు ఇవ్వబడిన పాత్రను సక్రమముగా నిర్వర్తించగలము. మనలో ఉన్న భ్రాంతిని, అజ్ఞానాన్ని తొలగించుకోకుండా వివేకవంతులమై జీవించ లేము. పక్వమైన మనస్సు మాత్రమే మనలను సరియైన దారిలోనికి మళ్లించగలదు, సత్యసాక్షాత్కారం చేయగలదు. సత్యాన్వేషణ మాత్రమే ఉత్తమభక్తి. మన హృదయంలో ఉన్న సత్యం మనకు తెలిసే వరకు మనలను దుఃఖం వెంటాడుతుంది. తత్త్వం తెలియకుండా దుఃఖం నశించదు. మానవుడు జ్ఞాని కాలేకపోతే సుఖి కాలేడు.

## 61. గురువు యొక్క కృప

మానవుడు సత్యసాక్షాత్కారము పొందుటకు పూజల కంటే, జపాల కంటే గురువు యొక్క కృప ఎక్కువ సహకరిస్తుంది. శాశ్వత శాంతి వైపు వెళ్లేందుకు సహాయపడుతుంది. శ్రీ రమణ మహర్షి యొక్క బోధలలో గురువు యొక్క కృప కీలకమైనది.

మనిషి యొక్క భక్తిలో, ప్రేమలో నిజాయితీ ఉన్నప్పుడు భగవంతుని యొక్క దయ గురు రూపం ధరించి వస్తుంది. గురువు యొక్క బోధ వలన శిష్యుని మనస్సు నిర్మలమై, నిశ్చలమై అంతర్ముఖం అవుతుంది. గురువునకు, దైవమునకు, సత్యమునకు బేధాలు లేవు. గురువు సర్వత్రా సమానబుద్ధి కల్గి ఉంటాడు, అతని ధైర్యమునకు చాపల్యము ఉండదు. గురువు శిష్యుని బంధాల నుండి విడిపించి ముక్తిని ప్రసాదిస్తాడు.

గురు కృప లేకుండా భక్తుడు తన హృదయంలో ఉన్న నిజాన్ని సాక్షాత్కారము చేసుకోలేడు. గురువు యొక్క కృప సంకల్పాలకి, కోరికలకి, ఊహలకి, మాటలకి అతీతమైనది.

సద్గురువు మాత్రమే నిజమైన జ్ఞానముతో భక్తుడిని అలంకరించగలడు. భక్తుడికి తన స్వరూపము తెలిస్తే గురువు యొక్క నిజ రూపం అర్థం అవుతుంది. సాధకుడికి లోపాలు, బలహీనతలు ఉన్నంత వరకు ఎవరో ఒక సద్గురువు అవసరం కావాలి.

## 62. పరమాత్మ శ్రీ రమణ రూపంలో భూమిమీదకి దిగి వచ్చినది

లంకలకోడేరు, జనవరి

వేదములలో వర్ణింపబడిన పరమాత్మ శ్రీరమణ సద్గురువుగా భూమి మీదకి దిగివచ్చినది. రమణస్వామి జ్ఞాన యోగిగా ప్రపంచ ఖ్యాతి పొందాడు.

గురువు చెప్పిన మాటలను విని అర్థం చేసుకొనుటకు గురువు యందు ప్రేమ అవసరము. నిజమైన గురువు మానవ మానసమును అంతర్ముఖం చేసి ఆత్మను దర్శించుటకు సహాయ సహకారములను అందిస్తాడు.

తాను ఎవడో తాను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయక పోవటమే మానవుడు చేస్తున్న ప్రథమ తప్పు, ప్రధాన తప్పు కూడా. ఈ తప్పు నుండి మానవుడిని విడిపించి స్వేచ్ఛను ప్రసాదించుటకు సత్యాత్మ శ్రీ రమణ దేవుని రూపంలో ఈ భూమి మీద అవత రించినది. మనోమూలమును తెలియనివాడు మోక్షసుఖమును పొందలేడు.

ఆత్మజ్ఞానం కలవాడే నిజమైన సుఖి, రాగద్వేష రహితుడు. ఆత్మ యొక్క వైభవాన్ని గ్రహిస్తాడు. ఆత్మకు మరోకపేరు జ్ఞానం. లౌకిక కర్మలు, వైదిక కర్మలు కేంద్రముగా పెట్టుకొని జీవించే జాతికి ఆత్మవిద్య అందదు. ఆత్మ విచారణ వల్ల ఆత్మ తెలియబడుతుంది. ఆత్మ విచారణ పేరుతో లోక విచారణ చేస్తే కాముడు దర్శనమిస్తాడు. కాని రాముడు దర్శనమివ్వడు.

మానవుడు తన వాంఛలకిస్తునన ప్రాముఖ్యత కంటే ఎక్కువగా విశ్వాత్మను గౌరవించి ప్రేమిస్తే అమృతస్థితిని పొందుతాడు.

మనకు కనిపించకపోయినా భూమికి ఆకర్షణ శక్తి ఉన్నది. అదే విధముగా అంతటా వ్యాపించియున్న ఆత్మ మన ఇంద్రియములకు, మన చపల మనస్సుకి, సంకుచిత బుద్ధికి గోచరించక పోయినా మన హృదయములో నిరంతరము స్వయముగా నిజమైన "నేను" గా ప్రకాశిస్తున్నది. అహంకారం అనే మూతను తొలగించి ఆత్మగతమైన "నేను" ను దర్శిస్తే శాశ్వత శాంతి లభిస్తుంది. రమణావతారం ప్రపంచ ఆధ్యాత్మిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుచున్నది.

## 63. జ్ఞానమే సుఖానికి మూలము

పాలకొల్లు, ఏప్రియల్ 7

ఆత్మజ్ఞానమును సాధించటానికి మనం ఈ భూమి మీదకు వచ్చాము. జ్ఞాన సముపార్జనకు మన వంతు కృషి మనం చేస్తూ ఉంటే దైవ సహాయం వస్తూనే ఉంటుంది. దైవమునకు శరణాగతి చెందిన వాడికి మాత్రమే జ్ఞానం యొక్క వైభవం తెలుస్తుంది. జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి.

జ్ఞానము ఉన్నచోట అజ్ఞానము ఉండదు. అజ్ఞానము ఉన్నచోట జ్ఞానము ఉండదు. నిజమైన జ్ఞానము మానవుని హృదయంలోనే ఉంది. అహంకారమును త్యజిస్తే అది వ్యక్తం అవుతుంది. జ్ఞానము మాత్రమే అశాంతిని, బంధమును పోగొట్టుటకు సహాయపడుతుంది. అజ్ఞానము "నేను" రూపములోనే ఉన్నది. అందువలన "నేను" ను మినహాయించి సాధన చేస్తే అజ్ఞానము నశించదు.

అజ్ఞానం ఆత్మను పరిమితం చేస్తుంది. జ్ఞానమునకు పరిధులు ఉండవు. ప్రేమ యొక్క లోతులను పెంచుతుంది.

ఎప్పడూ ఉండే సత్యమును సాధించుటకు జ్ఞానమునకు మాత్రమే సాధ్యం అవుతుంది. జ్ఞానోదయం కలిగే వరకు మానవుడిని ప్రకృతి గజిబిజిగా చేస్తూ ఉంటుంది.

సత్యమును ప్రత్యక్షముగా అనుభవంలోనికి తెచ్చుకొనుటకు ప్రకృతి అడ్డుపడుతుంది. సత్య దర్శనమునకు సత్సంగము సహాయ పడుతుంది. ఆనందము అనుభవంలోనికి వస్తుంది. శాంతి శాశ్వతం అవుతుంది.

## 64. బ్రహ్మానుభవం ఉన్నవాడే గురు శబ్దానికి అర్హుడు

జిన్నూరు, జూలై 4, 1993, గురుపూర్ణిమ

బ్రహ్మము ఒక్కటే ఉన్నది. అదే సత్యం, అదే శాంతి. బ్రహ్మ జ్ఞానము లేకుండా బ్రహ్మానుభవము కలుగదు. బ్రహ్మానుభవం ఉన్నవాడే "గురు" శబ్దానికి అర్హుడు. సాధకుల యొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గురువు పనిచేస్తాడు. గురువు బోధించిన దానిని ఆలోచించి అనుభవములోనికి తెచ్చుకొనుటకు ప్రయత్నం చేసే సాధకుడిలో అహంకారం అంతరిస్తుంది.

అహంకారికి ఉన్న సంపదలన్నీ బంధ హేతువులవుతాయి. ప్రయత్నం చేసి అహంకారమును తొలగించుకుంటే శాంతి దానంతటదే చేకూరుతుంది.

బుద్ధిలో ఉన్న దోషములను దహించిన వెంటనే ఆత్మజ్ఞాన సిద్ధి కల్గుతుంది. ఆత్మ చైతన్య రూపంలో ఉన్నది. అందుచేత మానవుడు చైతన్యస్థాయిని పెంచుకొంటే నిశ్చలత్వమును పొంది మోక్ష సుఖమును తెలుసుకోగల్గుతాడు. అట్టి మహాత్ముడి దృష్టి అహంకారము యొక్క మూలాన్ని వెదకి పట్టుకోవడానికి సహకరిస్తుంది. అహంకారము యొక్క మూలము దానికి తెలిసిన వెంటనే అది అంతర్ధానమవుతుంది. అప్పుడు ఏ చిక్కూ ఉండదు.

జప ధ్యానములు దుఃఖమునకు కారణమైన కర్తృత్వబుద్ధిని వదిలించడానికి సహకరిస్తాయి. ఆడంబర జీవితము నుండి విడుదల పొందినవాడికి మాత్రమే ఆత్మదర్శనం కలుగుతుంది.

సముద్రంలో ఎంత నీరు ఉందో ఆత్మలో అంతనీరు ఉంది. మరొక మాటలో చెప్పాలంటే ఆత్మ కేవలం ప్రేమ స్వరూపమే. విషయ ప్రేమ నీళ్ళు కలిపిన పాలు వంటిది. తక్కువ తరగతికి చెందినది.

గురువు సహాయముతో సాధకుడు ఆత్మగా ఉండుటకు నేర్చుకొంటాడు. ఆత్మకు మరొక పేరే శాంతి. ఆత్మ లేకుండా ఎరుక లేదు. ఎరుక లేకుండా మనస్సు లేదు. మనస్సు లేకుండా దేహము లేదు. దేహము లేకుండా ప్రపంచము లేదు. ఆత్మస్పర్శ అనుభవించిన వాడికి మాత్రమే ప్రపంచము లేదని తెలుస్తుంది.

ఆత్మానుభవము నిశ్చలముగా ఉంటుంది. ఆత్మానుభవం పొందిన సిద్ధ పురుషుడికి గురువు కూడా తన ఆత్మగానే ఉన్నాడన్న సంగతి తెలుస్తుంది. గురువు ఈశ్వరుడి కంటే వేరుగా లేడు. అందువలన గురువుకి చేసే పూజ ఈశ్వరుడికే అందుతుంది.

## 65. సత్యమునకు కుల మతములు లేవు

ఖండవల్లి, ఫిబ్రవరి 22, 1998

పూజ, జపము, ధ్యానము చిత్తశుద్ధికి సహాయపడతాయి. ఇవి ఆత్మజ్ఞానమును సంపాదించుటకు ఉపాయములు, మనస్సును శాంతింపజేస్తాయి. నిజము అనేది మన హృదయములోనే ఉన్నది. దానిని పొందకుండా ప్రకృతి గుణముల నుండి విడివడలేము. మన తలంపుల కంటే, మన అహంభావన కంటే ఆ నిజమునకు మనం దగ్గరలో ఉన్నాము. అయినప్పటికి దురాలోచనల వల్ల, దురభ్యాసముల వల్ల అహంభావన కేంద్రముగా పెట్టుకొని జీవించుట వల్ల మన హృదయంలో ఉన్న నిజము మనకు అనుభవములోనికి రావటము లేదు.

సత్యము తెలిస్తేనే గాని అసత్యము నుండి విడుదల కాలేము. సత్యము స్వయంప్రకాశమైనది. తెంపులేని ధ్యానము, వివేకము, సాధు సాంగత్యము సత్య సాక్షాత్కారమునకు సహాయపడతాయి. చైతన్యస్థాయిని పెంచుతాయి.

హృదయం యొక్క లోతులలోనికి మనం దిగకుండా మన అలవాట్లు మనలను అడ్డగిస్తున్నాయి. అలవాట్లను అశక్తాలు చేస్తే నిశ్చలంగా, నిర్మలంగా, ఉన్నతముగా, ఉదాత్తముగా, శాంతంగా ఉండవచ్చును.

అహంభావం అణగటం ప్రారంభిస్తే విషయాలు మనలను బాధించవు, రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. ఉన్న సత్ పదార్థమును ఉన్నట్లుగా గ్రహించినవాడి దృష్టికి వస్తు సమృద్ధికంటే సద్వస్తువే సుఖ తరమనిపిస్తుంది. తనను తాను తెలుసుకున్న మావుడికి సర్వము

తానేనని తెలుస్తుంది. అన్ని చిక్కుల నుండి, పరస్పర విరోధాల నుండి, కల్లలైన ఊహల నుండి బయటపడతాడు.

మానవుడు తన హృదయంలో ఉన్న భగవంతుడు కంటే గుళ్ళో ఉన్న భగవంతుడిని ఇష్టపడుతున్నాడు. మానవుడు తన అస్థిత్వమును తన దేహమునకు, తన నామమునకు పరిమితము చేసుకొనుట వలన చిక్కులకు, చికాకులకు, హద్దులకు గురవుతున్నాడు. సృష్టికి ఆధారముగా ఉన్న శక్తిని సాక్షాత్కరించుకొనే వరకు మానవుడు సఖి కాలేడు.

సత్యము ఒక కులానికి గాని, మతానికి గాని పరిమితమైనది కాదు. భారతదేశములో మత వ్యవస్థ కంటే కులవ్యవస్థ లోతైనది. సత్యాన్వేషకుడు మాత్రమే కులపరిమితులను, మత పరిమితులను అతిక్రమించగలడు. దేశ సమైక్యతకు సహకరించగలడు. దేశాన్ని సేవించడం ద్వారా కూడా దైవాన్ని దర్శించవచ్చును. శాంతిలో స్థిరపడవచ్చును.

## 66. ఆత్మ లాభానికి గురువు అనుగ్రహం అవసరము

చించినాడ, జూలై 4, గురుపూర్ణిమ

ఆత్మవిద్యను ప్రసాదించేవాడే గురువు. గురువు ఆత్మ గురించి బోధించుటయే కాకుండా ఆత్మ అనుభవంలోనికి వచ్చుటకు సహాయ సహకారములను అందిస్తాడు. ఆత్మ లాభమునకు మించిన లాభము లేదు. మానవుడికి ఆత్మలాభం కల్గేవరకు మోహం వెంటాడుతుంది.

మోహమే బంధం. జ్ఞానమే మోక్షం. మోక్ష సుఖమును రుచి చూచినవాడి హృదయమును మమకారము తాకదు, ఇంద్రియములు

కలతపెట్టవు, బాహ్య విషయ స్పర్శలు అందవు. భగవంతుని స్వరూపమును పొందుటకు గురువు యొక్క ఉపదేశము అత్యంత అవసరము. భగవంతుని స్వరూపము పొందిన వెంటనే అజ్ఞానము యొక్క క్షోభ నుండి విడుదల పొందుతాడు.

కొంతమంది జన్మతః సుగుణములతో జన్మిస్తారు. మరికొంత మంది వాటిని కష్టపడి సంపాదించుకొంటారు. సుగుణములు దైవానుగ్రహమును పొందుటకు సహకరిస్తాయి.

రూపముకంటే గుణము గొప్పది. గుణము కంటే జ్ఞానము గొప్పది. అట్టి జ్ఞానమును గుర్వానుగ్రహము వలన సాధించవచ్చును. జ్ఞాన సముపార్జనలో గురువు ప్రోత్సాహము ఉండనే ఉంటుంది. గురువును గౌరవించి, ఆదరించి ప్రేమిస్తే అన్ని సక్రమంగానే ఫలిస్తాయి. నిజం తెలిసేవరకు బుద్ధి శాంతించదు. అట్టి నిజమును మనము అర్థం చేసుకొనుటకు అనుగుణముగా బోధించేవాడు మాత్రమే సద్గురువు. నిజమును అన్వేషించేవాడికి చైతన్యస్థాయి పెరుగుతుంది. జీవితము పునీతము అవుతుంది. పవిత్రత, ఏకాగ్రత కుదురుతాయి. నిజం తెలుసుకొనే వరకు అబద్ధం నిజముగా కన్పించవచ్చును. నిజం తెలుసుకున్నాక అది ఒక్కటే మిగులుతుంది. ఏకత్వం శాంతినిస్తుంది. భిన్నత్వం అశాంతినిస్తుంది.

ఏది మంచిదో, ఏది చెడో గురువుకి తెలుసును. అందుచేత ఆయన ఆజ్ఞను పాలించటం అవసరము. గురువు మీద భారం వేస్తే మన చింతలన్నీ రాలిపోతాయి. భగవంతుడే గురురూపంలో వస్తాడు. అట్టి సద్గురువును సంతృప్తిపరచినవాడికి ఈ లోకంలో అసాధ్యం అంటూ ఏమీ లేదు. గురుభక్తి, దైవభక్తి ఈ రెండూ సమానమే.

## 67. బుద్ధిని బాగుచేసేది భగవద్గీత

కాపవరం, డిశంబరు, 1995

ప్రపంచంలో ఉన్న గ్రంథములలో భగవద్గీత ఉత్కృష్టమైనది, ఉదాత్తమైనది. మానవుడు తన బుద్ధిని బాగుచేసుకొనుటకు భగవద్గీతలో భగవంతుడు అనేక సలహాలు చెప్పినాడు. భగవద్గీతను అనుదినము అధ్యయనం చేస్తే బుద్ధి బాగుపడుతుంది. జ్ఞానము కల్గుతుంది. ముక్తి వస్తుంది.

ఇంద్రియ నిగ్రహం ఉంటే బుద్ధి స్థిరంగా ఉంటుంది. బుద్ధి విర్రవీగదు, చిల్లర చింతలు ఉండవు. గీతను పఠించి, అర్థం చేసుకొని ఆచరిస్తే అభయస్థితిని పొందవచ్చును. కోరికలు ఉన్నంత కాలం భయం వెంటాడుతూనే ఉంటుంది.

పరిపూర్ణస్థితిని ప్రసాదించేది భగవద్గీత. మానవుడు దురభ్యాసముల నుండి, దురలవాట్ల నుండి విడుదల చేసి చరమ, పరమస్థితిని ప్రసాదిస్తుంది భగవద్గీత. పనికి, జ్ఞానమునకు విరోధము లేదని గీతలో విపులముగా చెప్పబడినది. ఆసక్తి లేకుండా పని చేసేవాడు బంధింపబడడు. ఆత్మను తప్ప అన్యములైన వస్తువులతో సంబంధము పెట్టుకోడు.

జ్ఞాన లక్షణాలు అలవర్చుకొంటే మానవుడు అంతర్ముఖుడవుతాడు, అప్పడు దుఃఖమునకు కారణమైన అహంకారం సమసి పోతుంది. అహంకారమునకు మరొకపేరు అజ్ఞానము. అజ్ఞానము తొలగించుకొన్న వాడికి తాను ఆత్మ తప్ప వేరేమీ కాదని తెలుస్తుంది, అటువంటి వానికి దేహం ఉంటే ఏమి! లేకుంటే ఏమి! సత్యము తెలుసుకుంటే స్వేచ్ఛ కల్గుతుంది. అహంకారం నుండి విడుదలైన వాడికి సత్యం వ్యక్తం అవుతుంది. ఆత్మయందు నిలకడ కల్గుతుంది.

# 68. అరుణాచల దీప దర్శనం పుణ్యప్రదం

శృంగవృక్షం, డిశంబరు 18

ఈశ్వరుడు మన హృదయములోనే ఏ సహాయము అక్కర లేకుండా తనంతట తానుగా వెలుగుచున్నాడు. ఆ వెలుగులో నుండే మానవుడికి "నేను" అను తలంపు వచ్చుచున్నది. ఈశ్వరుడిని ధ్యానం చేస్తే ఆయన ప్రకాశం ఉదయిస్తుంది. శాంతి కల్గుతుంది.

ఏనాటికైనా మన హృదయములో జ్యోతి రూపములో ప్రకాశిస్తున్న ఈశ్వరుడిని దర్శించాలి. దానికి సంకేతముగా ప్రతి సంవత్సరము కార్తీక పూర్ణిమ రోజున ప్రసిద్ధ క్షేత్రమైన అరుణగిరి మీద దీపము వెలిగిస్తారు. ఈ క్షేత్రము తమిళనాడు రాష్ట్రములో తిరువణ్ణామలై అనే పేరుతో పిలువబడుచున్నది. భగవాన్ శ్రీ రమణ మహర్షి సుమారు యాబదినాల్గు సంవత్సరములు అక్కడ నివసించుట వలన ఈ క్షేత్రమునకు అంతర్జాతీయ ఖ్యాతి కల్గినది.

అరుణాచల దీపదర్శనం మన మనస్సు హృదయములో లీనమగుటకు సహాయపడుతుంది. మనస్సు లయమగుట వలన ఆనందం వస్తుంది. చైతన్యస్థాయి పెరుగుతుంది. చైతన్యమే శివుడు. చైతన్యమే ఆత్మ. మానవ మానసము హృదయములోనికి లోతుగా పోయిన యెడల ఆత్మానుభవము అప్పటికప్పడే సాధ్యమవుతుంది.

ఆత్మ మాత్రమే నిత్యము, నిజము. నిజము ఒకటిగా ఉంటుంది. కాని రెండుగా ఉండదు. మానవుడు చైతన్య ప్రవాహములో లీనమయ్యేవరకు అతనిని అజ్ఞానము కాటువేస్తూనే ఉంటుంది, అహంకారము పెరుగుతూనే ఉంటుంది, దుఃఖము వస్తూనే ఉంటుంది. అజ్ఞానమును త్యజించలేకపోతే ఈశ్వరానుభవం కలుగనే కలుగదు, సుఖము తెలియదు.

## 69. వివేకమును పెంచుకోవటమే వేదసారము

పాలకొల్లు, సెప్టెంబరు 23, 1990

ప్రాణాయామం, పూజ, జపము వీటి వలన మనస్సు కట్టుదిట్ట మవుతుంది, ఏకాగ్రత కుదురుతుంది, పవిత్రత చేకూరుతుంది. పవిత్రమైన మానసము మాత్రమే సత్యమైన, శాంతమైన ఆత్మ పదార్థమును దర్శించగలదు. ఆత్మానుభవము లేకుండా మానవుడు స్వేచ్ఛను పొందలేడు.

హేతువాదులు హేళన చేసినా, నాస్తికులు నవ్వినా ఉన్న ఆత్మ పదార్థము లేకుండా పోదు. ఆత్మ ప్రకృతి నియమములకు అతీతమైనది. వివేకము లేనివాడు ఆత్మను గమనించలేడు.

మతం పేరుమీద వివేకమును పెంచుకోవాలి కాని నాశనము చేసుకోకూడదు. వివేకవంతుడికి నిశ్చలత అలవడుతుంది. నిశ్చలత వలన జీవితమును సరిదిద్దుకోవచ్చును. వేదముల సారము వివేకము సముపార్జించుకొనుట మాత్రమే. అందువలన అరమరికలు లేకుండా జ్ఞాన సముపార్జన కొరకు ప్రయత్నించాలి.

సైన్సు రంగములో ఎన్నో సాధించిన మనము శాంతిగా, వివేక వంతముగా జీవించలేకపోతున్నాము. రాగద్వేషములకు దూరముగా ఉంటే నమ్రత, యోగ్యత సిద్ధిస్తాయి. శాంతిలో స్థిరపడవచ్చును. పనిచేయుట పట్ల విసుగు చెందే వాడికి మనశ్శాంతి అందదు. పనిమనిషిని బంధించదు. బంధించేది అహంకారం మాత్రమే. అహంకారం లేకుండా జీవించటమే శ్రేష్ఠమైన తపస్సు.

ఈ లోకములో అతి నీచమైనది అహంబుద్ధి మాత్రమే. భూమి పట్ల అపేక్ష, సంపదయందు కాంక్ష, అహంబుద్ధి ఇవన్నీ ప్రపంచయుద్ధ

కారణాలవుతున్నాయి. అహంకారి ఏ ప్రాంతములో ఉన్నా వాడిని అశాంతి వెంటాడుతూనే ఉంటుంది. అహంకారమును కేంద్రముగా పెట్టుకొని జీవించే వారివలన మాత్రమే ప్రపంచములో కలతలు, కలహాలు, బాధలు పెరుగుచున్నవి. అందువలన అహంకారమునకు ప్రధానమైన అజ్ఞానము నుండి విడివడుటకు అన్ని విధముల ప్రయత్నము చేయవలెను.

## 70. అవిద్యను తొలగించువాడే గురువు

మానవుడిలో అవిద్య ఉన్నంతకాలము కామము, దుఃఖము, బాధ వెంటాడుతూనే ఉంటాయి. మానవుడిలో ఉన్న అవిద్య అనే అంధకారమును తొలగించుటకు ఎవరు సహాయ సహకారములు అందిస్తున్నారో అతను మాత్రమే గురువు. ఏ జీవుడు అవిద్యను విడిచిపెట్టకుండా సుఖమును అనుభవించలేడు. కర్తృత్వమును రాల్చి పనిచేసినవాడికి అవిద్యనశిస్తుంది. భూమినంతను సంపాదించటం కంటే తాను ఎవడో తాను తెలుసుకోవటం కష్టం.

నదీ ప్రవాహము వలె ఆత్మను గురించి మాత్రమే నిరంతరము ధ్యానం చేయువాడికి అవిద్య వేరుతో సహా నశిస్తుంది. మలిన వాసనలకు దూరం అవుతాడు. అవిద్యను దాటినవాడు మాత్రమే మృత్యువును దాటగలడు. ఎన్ని యాత్రలు చేసినా, ఎన్ని నదులలో మునిగినా మానవుడు అవిద్యను దాటకపోతే మోక్షం దగ్గరకు చేరుకోలేడు. తనలో ఉన్న రాక్షస వాసనలను విడిచిపెట్టితే అవిద్యను కూడా మాయం చేయవచ్చును.

నిగ్రహం లేనివాడు, శాంతి లేనివాడు అవిద్యతో పోరాడలేడు. విద్యను ఆర్జించుకోవడానికి అవిద్య అడ్డుగా నిలుస్తుంది. అవిద్యలో ఉన్నవాడు సమాజమును పిండుకుంటాడు, కాని సమాజమునకు సహకరించడు. అవిద్యలో ఉన్నవాడు అబద్ధాన్ని నమ్మినట్లుగా నిజాన్ని నమ్మలేడు. దేహములో ప్రాణము ఉండగా అవిద్యను విడిచిపెట్టిన వాడు ముక్తుడగువాడు. అవిద్య రూపంలో ఉన్న ప్రకృతి గుణములను త్యాగం చేయటమే నిజమైన విద్య, మానవుని హృదయములో నిరంతరము ప్రకాశిస్తున్న పరమాత్మ యొక్క అస్థిత్వమును అవిద్య అంగీకరించదు. ఎవడు అవిద్యను పోగొట్టుకొనుటకు అనుదినము కృషి చేస్తున్నాడో వాడే సాధకుడు, వాడే భక్తుడు. స్వార్థము, అవిద్య చలి జ్వరముల వంటివి.

## 71. సుఖము ఆత్మలో ఉన్నది, లోకంలో లేదు

మానవుడికి తనలో ఉన్న నిజమైన ఆత్మను దర్శించుటకు మౌనము ఎక్కువ సహాయము చేస్తుంది. దేహముయొక్క, మనస్సు యొక్క ముఖ్య ప్రయోజనం ఆత్మను దర్శించుటకు మాత్రమే.

మానవుడిలో బేధ (బుద్ధి) తలంపులు ఉన్నంతకాలం భోగ తలంపులు కూడా ఉదయిస్తూనే ఉంటాయి. మానవుడు తాను దేహము మాత్రవే అనుకొని పరమితికి లోనవుడుతున్నాడు. దుఃఖమునకు గురి అవుతున్నాడు.

ప్రతి మానవుడికి సుఖం కావాలి. ఆ సుఖం తన యొక్క ఆత్మ స్వరూపమేనన్న విషయము అతనికి తెలియటం లేదు. సుఖమే తన స్వరూపము అన్న సంగతి తెలియక సుఖం కోసం లోకంలో వెతుకుతున్నాడు.

జ్ఞానాన్వేషణలో ఇంద్రియ నిగ్రహం పునాది లాంటిది. స్వాధీన మైన ఇంద్రియములు కలవాడికే శాంతి దొరుకుతుంది. శాంతిలేని వాడికి సుఖము లేదు. ధనంతో లోకంలో ఉన్న వస్తువులను కొనగలము, కాని శాంతిని కొనలేము. రావణాసురుడు గొప్ప తపస్సంపన్నుడు కాని అతని ఇంద్రియములను అతను అదుపు చేసుకోలేకపోయాడు, అందుకే పతనమయ్యాడు.

కామ, క్రోధ, లోభములు కూడా మన తలంపులు మాత్రమే. అవి వస్తువులు కాదు. మన తలంపులను మనం విడిచిపెట్టకుండా వాటిని విడిచిపెట్టలేము. మన దుఃఖమునకు మూలము మన తలంపులోనే ఉంది. భయం కూడా ఒక తలంపే. ఈ తలంపులకు కేంద్రం "నేను" అను తలంపు, అదే అహంకారం. ఈ అహంకారమును ఆధారము చేసుకొనే ఈ ప్రపంచము నడుస్తున్నది. అందుకే ఈ ప్రపంచం అంతా దుఃఖమయంగా ఉంది. దేహం శవం అయ్యే కాలంలో తన మనస్సులో ఉన్న తలంపులే బయటికి వస్తాయి. ఆ తలంపులకే మరో నూతన శరీరం వస్తున్నది. అందువల్ల మన జన్మలకు మనమే కారణం అవుతున్నాము.

మనిషి పనిచెయ్యాలి, ఫలితాన్ని ఆశించకూడదు. ఒక మేడ కట్టటం కంటే ఒక మనిషిని తయారుచేయటం కష్టం. మనిషికి ప్రథమ కర్తవ్యం, ప్రధాన కర్తవ్యం. తనలో ప్రకాశిస్తున్న ఆత్మను దర్శించటమే.

మానవుడు జన్మించినప్పుడు ఏడుస్తూ జన్మిస్తాడు. మరణించే టప్పుడు ఏడుస్తూ మరణిస్తాడు. కాని ఆత్మను దర్శించినవాడు సంతోషముతో శరీరాన్ని విడిచిపెడతాడు. మనము ఆత్మను తెలుసుకొనుటకు అడ్డువచ్చే విషయములను విసర్జించాలి. ఆత్మను తెలుసుకొనటం అంటే తన నిజమైన స్థితిని తాను దర్శించటం.

మానవుడికి తన మనస్సు స్వాధీనము లేనప్పుడు తనకున్న సిరిసంపదలు సుఖాన్నివ్వలేవు.

మానవుని సృష్టివల్ల మాత్రమే మానవునికి దుఃఖము కల్గుచున్నది. దేవుని సృష్టి వల్ల కాదు. దేవుడు మనలో నిజమైన ఆత్మగా ఉన్నాడు. దేవుడిని దర్శించటం అంటే మనలోని ఆత్మను దర్శించటం. దేహము, మనస్సు లేకుండా ఆత్మ ఉండగలదు. కాని ఆత్మ ఆధారము లేకుండా దేహము, మనస్సు, ప్రపంచము ఉండలేదు.

మానవుడికి జ్ఞానం విలువ తెలియుట లేదు కాబట్టి దానిని పొందుటకు కృషి చేయుటలేదు, డబ్బు విలువ తెలుసు కాబట్టి డబ్బును సంపాదించుటకు కృషి చేస్తున్నాడు. మనలో హృదయశుద్ధి లేనందువల్ల మన ఋషులు చెప్పిన మాటలు మనకు రుచించుట లేదు.

మానవుడు మరణించేటప్పుడు తాను సంపాదించిన డబ్బు గడప దాటి కూడా రాదు. తన బంధువులు, స్నేహితులు స్మశానం వరకు మాత్రమే వస్తారు. తాను ఎంతగానో ప్రేమించిన తన శరీరం గూడా తనకూడా రాదు. తనకూడా వచ్చేవి తన అలవాట్లు, తన గుణాలు మాత్రమే. అందుకే మంచిగుణాలు అభివృద్ధి చేసుకోవాలి, దానికి ఏకాంతవాసం, సత్పురుషుల సహవాసం అవసరం. మంచి తనమే జ్ఞానం. సద్గుణాలు అలవర్చుకున్నవాడే సహజంగా జీవిస్తూ కృత్రిమ జీవితానికి దూరముగా ఉండగల్గుతాడు.

శాంతిలేని జీవితం వ్యర్థం. సాధనలు, తపస్సులు శాంతి కోసమే. శాంతిని పొందినవాడికి ఇంద్రియాలు దుఃఖమును తీసుకురాలేవు. శాంతిలో ఇంద్రియములు వాటి విషయాలు కూడా అణగిపోతాయి. శాంతిని సాధించిన వాడికి ఇంద్రియములు స్నేహితులవలే సహకరిస్తాయి. శాంతిని సాధించినవాడు ఆరోగ్యముగా జీవించటమే కాకుండా ఆరోగ్యముగా మరణిస్తాడు.

# 72. ఆత్మజ్ఞానమే మోక్షం

జ్ఞానము అంటే ప్రకాశం. జ్ఞానము అంటే చైతన్యం. ఆత్మ జ్ఞానమునకు సమానమైన జ్ఞానము కాని, ఆత్మశాంతికి సమానమైన శాంతిగాని ఈ లోకంలో ఏమీ లేదు. మానవజాతి ఏనాటికయినా అశాంతికి దూరము కావాలంటే ఆత్మను ఆలింగనము చేసుకోవలసి నదే. జాతికి తిండి, బట్ట అవసరమే. అంతకంటే ముఖ్యముగా శాంతి అవసరము. శాంతిలేని జాతి ప్రాణం లేని శరీరం లాంటిది. ప్రాణము లేని శరీరమునకు అలంకరణ ఎటువంటిదో శాంతిలేని జాతికి భాగ్యము అటువంటిది.

నేడు భారతజాతిని పట్టి పీడిస్తున్నవి ఒకటి అజ్ఞానం, రెండు దారిద్ర్యం. దారిద్ర్యం కంటే భయంకరమైనది అజ్ఞానం. దేశంలో ఉన్న ఆర్థిక, సాంఘిక అసమానతలకు కూడా అజ్ఞానమే కారణం. సమాజంలో ఉన్న లోపాలకి, పాపాలకి, వేషాలకి, రోగాలకి, బేధాలకి కారణం అజ్ఞానమే. మానవజాతికి నిజమైన శత్రువు అజ్ఞానమే. అన్ని రంగాలలోను జాతి వెలుగును చూడాలంటే అజ్ఞానంలో నుంచి బయటపడాలి. అజ్ఞానము అంటే చీకటి. జ్ఞానము అంటే వెలుగు. చీకటిలో నుంచి వెలుగులోనికి రావాలి. అజ్ఞానము అంతరించి నప్పడు జాతికి నిజమైన సౌఖ్యము దర్శనమిస్తుంది. అహంకారము ను విడిచిపెట్టినవాడే తోటి మానవున్ని ప్రేమించగలడు.

జీవితంలో నటించటం వేరు, ప్రేమించటం వేరు. జ్ఞానము లేకుండా ప్రేమించలేము. ప్రేమకు కళ్ళు ఉన్నాయి. మోహానికి కళ్ళు లేవు. మనిషికి చేతిలో ఉన్న దీపం చీకటిలో ఎలా ఉపయోగ పడుతుందో అదే విధముగా ఈ ప్రపంచమనే చీకటిలో నుంచి బయటపడటానికి

జ్ఞానము అనే జ్యోతి వెలుగు చూపుతుంది. మానవుడు ప్రచారానికిస్తున్న ప్రాముఖ్యత ఆచరణకివ్వటం లేదు. కీర్తికిస్తున్న ప్రాముఖ్యత సేవాభావాని కివ్వటం లేదు.

తల్లి కడుపులోనుంచి శరీరము వచ్చినంత తేలికగా మనస్సులో ఉన్న అజ్ఞానం బయటికి వెళ్ళదు. దానికి ఎంతో సాధన అవసరం. జీవితము నుండి సాధనను వేరు చెయ్యలేము. సాధన కూడా జీవితములో ఒక భాగమే. సమగ్రంగా జీవించలేనివాడు సంపూర్ణతను సాధించలేడు. మనకు జీర్ణమైన ఆహారం ఆరోగ్యాన్ని ఎలా ఇస్తున్నదో అదే విధముగా జీవితములో కలిసిపోయిన సాధన మాత్రమే సమగ్రతను, యోగ్యతను ప్రసాదిస్తుంది.

మనకు అర్హత లేనప్పుడు జ్ఞానము సిద్ధించదు. జ్ఞాని కావాలను కొన్నవాడు తన జీవితములో ప్రతీ సెకను ఎంతో మెలకువగా జీవించాలి. జ్ఞానికి మించిన సోషలిస్టు లేడు. అందుచేత జీవిత లక్ష్యము జ్ఞానము మాత్రమే.

## 73. ధనం ప్రయోజనం పరిమితం

కార్తీక దీపోత్సవం, శృంగవృక్షం, డిశంబర్ 1, 1988

అక్షరమణమాల అంటే అక్షరములతో తయారుచేసిన పెండ్లి నాటి మాల. ఈ మాలకు నాశనము లేదు. పూలమాలలా వాడిపోయేది కాదు. అరుణాచలేశ్వరుడిని పెండ్లి కుమారుడిగాను తనను పెండ్లికుమార్తెగాను భావన చేసి భగవాన్ శ్రీ రమణ మహర్షి "అక్షరమణ మాల" అనే స్తోత్ర గ్రంధమును రచించాడు.

అజ్ఞాని తన అస్థిరత్వమును దేహమునకు మాత్రమే పరిమితము చేసుకుంటాడు. రూపదృష్టి, నామదృష్టి లేకుండా అజ్ఞాని పనిచేయలేడు. అందువలన నామరూపములకు అతీతముగా ఉన్న ఈశ్వరున్ని అజ్ఞాని ఊహించలేడు, కాబట్టి ఈశ్వరుడు రూపం ధరిస్తాడు. ఈశ్వరుడే గురువు రూపములో వచ్చి ముముక్షువు యొక్క మనస్సును అంతర్ముఖపరుస్తాడు.

సూర్యుడు లోకమునకు వెలుగునిచ్చుటకు లోకమంతా వ్యాపిస్తాడు. అదేవిధముగా జ్ఞాని లోకమును అనుగ్రహించుటకు ఆత్మ రూపములో అంతటా వ్యాపించి ఉంటాడు. జ్ఞాని మౌనము యొక్క గొప్పతనమును మాటలతో కాకుండా మౌనముతో చెప్పగలడు. జ్ఞానము చేతలకు, కళ్లకు, మనస్సుకు, మాటలకు, తలంపులకు అందకపోయినా అనుభవమునకు అందుతుంది. జ్ఞానము మాత్రమే ఆత్మానందమును ప్రసాదించగలదు. ధనము యొక్క ప్రయోజనము పరిమితమైనది. ధనముతో శాంతిని గాని, సౌందర్యమును గాని, మోక్షమును గాని కొనలేము. ఆత్మానందముతో పోల్చినప్పుడు ఆర్థికానందము ఏపాటిది? జ్ఞానము మాత్రమే మానవుడిని శోకము లేని స్థితికి చేరుస్తుంది.

## 74. తన కోరికే తనకు శత్రువు

కాపవరం, డిశంబరు 13

గీత ఉపదేశ గ్రంథము. దానిని చదివి అర్థం చేసుకొని ఆచరిస్తే మోక్షం వస్తుంది. గీతా శాస్త్రమును ఆధారము చేసుకొని జీవిస్తే మానవుడిలో ఉన్న లోపములు కాలి బూడిద అవుతాయి.

అద్దంలో మన ప్రతిబింబమును చూచుకొని మన అసలు ముఖమును ఏ విధముగా శుభ్రము చేసుకుంటున్నామో అదే

విధముగా గీతాశాస్త్రమును అద్దము వలె ఉపయోగించుకొని మనస్సులో ఉన్న మురికిని శేషమ లేకుండా తొలగించుకోవలెను.

మానవుడు కామ, క్రోధములను నేర్చుకున్నాడు. అవి తలంపుల రూపంలో మానవ మానసమును ఆవరించి అశాంతికి గురి చేస్తున్నాయి. కామమే క్రోధముగా పరిణమిస్తుంది. బద్ధకస్తుడు వాటిని త్యజించలేడు, కాబట్టి బంధమే మిగులుతుంది. అవి ఉన్నవాడు హృదయము యొక్క లోయలో ఆత్మరూపంలో ప్రకాశిస్తున్న ఈశ్వరుని దర్శించలేడు. అభ్యాసం చేస్తే వాటిని విడిచిపెట్టగలడు. ప్రపంచంలో ఉన్న సంపద అంతా కలిపినను ఒక మనిషి యొక్క కామమును కూడా సంతృప్తి పరచలేదు. కామమునకు ఆకలి బాధయే కాని అజీర్తి బాధలేదు. సత్యసాక్షాత్కా రమునకు కామక్రోధములే అడ్డుగా ఉన్నవి. వాటిని తొలగించు కొనుటకు దైవభక్తి అవసరము.

నిరంతరము తన స్వార్థమును గూర్చి ఆలోచించే మనిషి భక్తుడు కాలేడు. స్వార్థమును విడిచిపెట్టలేనివాడు సత్యమును దర్శించలేడు. తన స్వరూపమైన సత్యమును దర్శించేవరకు మానవుడిని దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. సత్యంలో ప్రవేశించుటకు అడ్డుగా ఉన్న మాలిన్యమును తొలగించుకొనుటయే యోగం యొక్క ప్రయోజనము. సత్యమునకు పర్యాయపదమే జ్ఞానము. సత్యం ఒక్కటిగా ఉన్నది. జీవిత గమ్యం సత్యమును తెలుసుకోవటమే. దానిని తెలుసుకొనుటకు మతం గాని, కులం గాని అడ్డురావు.

అజ్ఞానమే మానవుడికి శత్రువుగా ఉన్నది. దానిని తొలగించు కొనుటకు మహాత్ముల సహవాసము అవసరము. మనోమూలము ను తెలుసుకున్నవాడే మహాత్ముడు.

# 75. HOW I CAME TO BHAGAVAN RAMANA

**- B.V.L.N. RAJU,** Sri Nanna Garu

I HAIL from Jinnuru, a Village in West Godavari district of Andhra Pradesh and belong to a peasant community. During 1954, I accompanied my maternal Grand Mother in a Pilgrimage to the Northern part of the Country.

In 1957 I had a dream one night. An old man with a stick in his hand, raised me from the bed and kissed me hard on my cheeks. I was perplexed. I pleaded with him to leave me alone. The stranger paid no heed to my words. I had a feeling that he was invading my life. I was seized with fear and tried hard to wriggle out of his grip. While he was holding, me in his embrace, my pillow fell on to the floor. He lifted it off the ground, adjusted it on my bed and gently laid me back on the cot. He looked at me compassionately and left me, as a doctor would leave a patient.

For six months I was struggling to know who this stranger could be. One day while reading the Hindu in our Village Library, I saw an advertisement of The Great Men of India by Madras Book Publishing House. Going through the list of these great men, I felt a thrill when I

read the seventh name as "Sri Ramana Maharshi". I felt here was the man who would draw me to the cave of my heart. I got the book on Sri Ramana Maharshi through post from the Madras Company. The book contained his portrait also and I recognized the person who had appeared before me in my dream six months earlier.

The divine person, Bhagavan Sri Ramana Maharshi, lived in 'Arunachala' in Tamilnadu and was revered all over the world. His physical life ended on 14th April 1950, in his seventieth year.

He had no personal life of His own. His life was, but the splendour of the self. Equality was His life breath. Many blessed people achieved fulfilment in their lives by the mere darshan of the Maharshi. He was like a blazing sun in the spiritual firmament of India. The Chanting of His name is auspicious. He is the Mahatma of all Mahatmas.

I paid my fist visit to Sri Ramanasramam in January, 1959. I have dedicated my life from then on till now to His service. It was not my choice that He came into my life. He took me into His fold and blessed me.


ॐ